# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - గురువారం 12 ఫిబ్రవరి 2026 | సంపుటి: 10 | సంచిక: 39 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## జయ హో.. పాట పాడుతున్న రోడ్డు

ముంబైలోని నారిమన్ టు వర్లి రహదారి

దేశపు తొలి మ్యూజికల్ రోడ్‌గా రికార్డు



2

## పాటల్లో మ్యాథ్స్, సైన్స్..

ఐఐటీ మద్రాస్‌లో మ్యూజిక్ రీసెర్చ్ సెంటర్

త్వరలో ప్రత్యేక కోర్సులు ప్రారంభం



2

## మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

### కొత్తగా సైబరాబాద్, మల్కాజ్‌గిరి కార్పొరేషన్లు

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

### కొత్త కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారిగా జయేష్ రంజన్




హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌ను మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నగర పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ పరిధిలోని కోర్ అర్బన్ ఏరియాను పునర్విభజించి కొత్తగా మూడు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ కార్పొరేషన్ యథాతథంగా కొనసాగనుండగా, కొత్తగా సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లను కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా రూపొందించారు. ఐటీ, అభివృద్ధి చెందిన పట్టణ ప్రాంతాల పరిపాలనను మరింత

...మిగతా 2లో

## హస్తందే హవా!

### మున్సిపల్ ఎన్నికల్లోనూ లోకల్ బాడీ ఫలితాలే రిపీట్ ● వెల్లడిస్తున్న ఎగ్జిట్ పోల్స్



హైదరాబాద్, ఫిబ్రవరి 11: చెదురుమదురు ఘటనలు మినహా రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచీ సాయంత్రం వరకూ ఓటర్లు తండోపతండాలుగా పోలింగ్ బూత్‌లకు తరలి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దానితో 75.88 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలకు

...మిగతా 2లో

## మున్సిపాలిటీల్లో 73.01% | కార్పొరేషన్లలో 77.36%

## పుర పోలింగ్ ప్రశాంతం

### గతంతో పోలిస్తే భారీగా పెరిగిన పోలింగ్

### వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించిన ఎన్నికల సంఘం

### రేపు కౌంటింగ్, 16న ఛైర్మన్, మేయర్‌ల ఎన్నిక




హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): రాష్ట్రవ్యాప్తంగా 11 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు పోలింగ్ బుధవారం ప్రశాంతంగా ముగిసింది. అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు మినహా మిగతా అన్ని చోట్లా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల్లో 73.01 శాతం పోలింగ్ నమోదైంది. మున్సిపాలిటీల్లో యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మున్సిపాలిటీలో అత్యధికంగా 91.91 శాతం అత్యల్పంగా నల్లగొండ జిల్లా నందికొండ మున్సిపాలిటీలో 59.68 శాతం నమోదైంది. ఇక మున్సిపల్ కార్పొరేషన్లలో అత్యధికంగా నల్గొండ కార్పొరేషన్‌లో 77.36 శాతం, అత్యల్పంగా నిజామాబాద్‌లో 59.12 శాతం నమోదైనట్లు బుధవారం రాత్రి ఎన్నికల సంఘం అధికారులు ప్రకటించారు. కొన్ని చోట్ల అధికార కాంగ్రెస్ బీఆర్ఎస్, మరికొన్ని చోట్ల కాంగ్రెస్ బీజేపీ, ఇంకొన్ని చోట్ల బీఆర్ఎస్ బీజేపీ నేతల మధ్య తోపులాటలు జరిగాయి. పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలోని మొత్తం 2,981 వార్డుల్లో పోలింగ్ జరిగింది. ఇందుకోసం రాష్ట్ర ఎన్నికల సంఘం 8203 పోలింగ్ కేంద్రాలు, 16031 బ్యాలెట్ బాక్సులను ఏర్పాటు చేసింది.

బుధవారం ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా సాయంత్రం వరకు ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ముందుగా మందకోడిగా ప్రారంభమైన ఓటింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. ఓటర్లు తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. ఎన్నికల నిబంధనల ప్రకారం సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసే అవకాశం ఇచ్చారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆయా వార్డులు, డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ అనుచరుల సాయంతో ఓటర్లను రవాణా సదుపాయం కల్పించి

...మిగతా 2లో

## అలుపెరుగని యోధుడు.. ఆరవయ్యారేళ్ల యువకుడు

### రాజకీయాలలో 'యావ'లేని...సేవకుడు



పొంగులేటికి...లేరెవరు సాటి ● రేవంతుకు అన్నింటా...తన వంతు

● భూ'మాత'కు భూ భారతితో హారతి ● రాజకీయాలలో మేటి పొంగులేటి

ఎలాంటి స్వార్థం లేకుండా రాజకీయాలు చేయాలన్నదే ఆయన సంకల్పం. ధనార్జనకు రాజకీయాలు వేదిక కాకూడదన్నదే ఆయన అభిమతం. ప్రజలకు సేవలందించడంలో 'యావ' ఉండరాదన్నది ఆయన నైజం. ప్రతీ పథకం నిరుపేదలను ఆదుకునేలా రూపొందించాలన్నదే ఆయన ఆరాటం. పథకాలు ప్రారంభించడం కాదు అవి ప్రజలకు ప్రయోజనం కలిగించేలా చేయడమే ఆయన పోరాటం. ధరణి పేరిట బురిడీ కొట్టించడం కాదు.. భూ భారతితో భూ యజమానులకు హారతి పట్టాలని ఆయన సంకల్పం. వెరసి పాలకులు పేద ప్రజల పక్షాన నిలిచి.. వారి గుండెల్లో పదికాలాల పాటు పదిలంగా ఉండాలనుకునే పాలకులు, నాయకులు అరుదు. ఆయన రాజకీయ యోధుడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

వివరాలు 3లో

## ఖర్గేతో రేవంత్ భేటీ



- మున్సిపల్ ఎన్నికలు, తాజా రాజకీయాలపై చర్చ
- ఢిల్లీలో నేడు కేంద్ర మంత్రులను కలిసే అవకాశం

2

## బీఆర్ఎస్‌ను గురి చూసి కొట్టిన పొంగులేటి

### రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న మంత్రి వ్యాఖ్యలు

### ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మేలు చేస్తాయని హస్తం శ్రేణుల హర్షం

### ఉక్కిరిబిక్కిరవుతున్న గులాబీ నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. ప్రభుత్వంలో ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన బీఆర్ఎస్ అధికారం కోల్పోయినా ఇంకా బుద్ధి రాలేదనీ, చాటుమాటుగా మంత్రులు, కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతల ఫోన్ల ట్యాపింగ్‌కు పాల్పడుతోందని పొంగులేటి చేసిన సంచలన వ్యాఖ్యలు గులాబీ నేతలను మరోసారి

...మిగతా 2లో

## సింగరేణి ఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాశ్

2

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కర్ణన్ కొనసాగింపు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన..
- మల్కాజ్‌గిరి కార్పొరేషన్ కమిషనర్‌గా టి.వినయ్ కృష్ణారెడ్డి నియామకం

## పోలింగ్ ప్రశాంతం

రాష్ట్ర పోలీసులకు డీజీపీ ప్రశంసలు

వెబ్‌కాస్టింగ్‌తో వీక్షించాం

ఓటర్లకు పోలీసు సాయం

వృద్ధ, వికలాంగులు ఓటేసేలా సహకారం

పోలింగ్ కేంద్రాల వద్ద పసి పిల్లలను సంరక్షించారు

డీజీపీ బి.శివధర్ రెడ్డి వెల్లడి



2



## జనగణమనకు ముందు వందేమాతరం ఆలపించాలె

ఆరు చరణాలను.. 3 నిమిషాల 10 సెకన్లలో పాడాలె

జాతీయ గీతం, గేయం ఆలాపనకు అంతరాయం కలిగించినా.. అగౌరవ పరిచినా.. మూడేండ్ల జైలు శిక్ష

### కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు



ఢిల్లీ, ఫిబ్రవరి 11: అన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, పాఠశాలల్లో ఇక నుంచి జాతీయ గీతం జనగణమన కంటే ముందుగా జాతీయ గేయం వందేమాతరం ఆలపించాలని కేంద్రం పేర్కొంది. ఈ మేరకు బుధవారం కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కొత్త నిబంధలను అమల్లోకి తెచ్చినట్లు వెల్లడించింది. వందేమాతరం ఆలపిస్తున్న సమయంలో అందరూ లేచి నిలబడాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

...మిగతా 2లో

## ఆమె మాట నచ్చలేదు.. అందుకే సుంకాలు పెంచిన

### స్విట్జర్లాండ్ నేతపై ట్రంప్ వ్యాఖ్యలు



వాషింగ్టన్, ఫిబ్రవరి 11: ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలపై సుంకాలు విధిస్తోన్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. స్విట్జర్లాండ్‌పై టారిఫ్ లు పెంచడం వెనక విచిత్రమైన కారణాన్ని చెప్పారు. ఆ దేశానికి చెందిన ఒక నేత మాట్లాడిన తీరు తనకు నచ్చలేదని.. అందుకే అదనంగా మరో తొమ్మిది శాతం పెంచానని చెప్పారు. ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ.. 'స్విట్జర్లాండ్‌పై 30 శాతం టారిఫ్లు విధించాను. అది మొత్తం చాలా తక్కువ. సుంకాల విధింపు తర్వాత నాకు

...మిగతా 2లో

## అమెరికా.. పాక్‌ను టాయిలెట్ పేపర్ కంటే హీనంగా చూసింది

### పాకిస్తాన్ రక్షణ మంత్రి ఆసిఫ్ ఖవాజా వెల్లడి



ఇస్లామాబాద్, ఫిబ్రవరి 11: తమ దేశం పట్ల అమెరికా చూపుతున్న వైఖరిపై పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ ఖవాజా పలు వాస్తవాలు వెల్లడించారు. అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని అన్నారు. తర్వాత తమను టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా తీసిపారేసిందన్నారు. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం తాము చేసిన పెద్ద తప్పిదమని అన్నారు. దీనివల్ల దేశం చాలా నష్టపోయిందని.. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తోందని వాపోయారు. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్

...మిగతా 2లో

# జయ హో.. పాట పాడుతున్న రోడ్డు

## ముంబైలోని నారిమన్ టు వర్లి రోడ్డు దేశపు తొలి మ్యూజికల్ రోడ్‌గా రికార్డు

ముంబై, ఫిబ్రవరి 11: దేశపు తొలి మ్యూజికల్ రోడ్డు ముంబైలో ప్రారంభమైంది. నగరంలోని నారిమన్ నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై పలు సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులకు దాదాపు 700 మీటర్ల మేర 'స్లమ్ డాగ్ మిలియనీర్' సినిమాలోని 'జయ హో' పాట వినిపిస్తుంది. ఈ పాటను దేశానికి అంకితం చేయడానికి, ప్రజల్లో దేశభక్తి భావాన్ని మరింత పెంచేందుకు ఈ విధంగా డిజైన్ చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు. ముంబై నగరపాలక సంస్థ అయిన బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ. 6.21 కోట్ల వ్యయం అయినట్లు అధికారులు వెల్లడించారు. ముంబయి కోస్టల్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొదటి మ్యూజికల్ రోడ్డుగా రికార్డులకెక్కింది. ఇటువంటి మ్యూజికల్ రహదారులు హంగరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో మాత్రమే ఉన్నాయన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ఈరోజు దీనిని ప్రారంభించారు.

# పాటల్లో మ్యాథ్స్, సైన్స్..

- ఐఐటీ మద్రాస్‌లో మ్యూజిక్ రీసెర్చ్ సెంటర్
- త్వరలో ప్రత్యేక కోర్సులు ప్రారంభం

చెన్నై, ఫిబ్రవరి 11: సంగీత సృష్టికర్త ఇళయరాజా ఆధ్వర్యంలో ఐఐటీ మద్రాస్ సంగీత కోర్సులను ప్రారంభిస్తున్నది.
ఒకప్పుడు ఉర్రూతలూగించిన రాగాలలోని శాస్త్రీయ, సాంకేతిక విషయాలు వెలికి తీసి.. నేటి తరం ఔపోసన పట్టేలా పరిశోధనలూ జరుగనున్నాయి. 'మాస్ట్రో ఇళయరాజా సెంటర్ ఫర్ మ్యూజిక్ లెర్నింగ్ అండ్ రీసెర్చ్' పేరిట ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రత్యేక కోర్సులు, పరిశోధన ప్రాధాన్యంగా కార్యక్రమాలు డిజైన్ చేస్తోంది.
వైవిధ్యమైన కోర్సులు 2026-27 విద్యా సంవత్సరంలో అందుబాటులోకి రానున్నాయి.
సంగీతానికి శాస్త్రీయ కూర్పును ఇవ్వడంతో పాటు అందులో ఆధునికతను తీసుకురావడంలో కృషి చేయనున్నారు. దీంతో విద్యార్థులకు ప్రత్యేక కోర్సుల్ని పరిచయం చేసి, వారిని ఆధునిక సంగీతంలో మేటి పరిశోధకులుగా మార్చాలనేది వీరి ధ్యేయం. కోర్సుల్ని విడతల వారీగా పరిచయం చేయనున్నారు.

# మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

(మొదటి పేజీ తరువాయి)

సమగ్రంగా నిర్వహించేందుకు ఈ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది.

అలాగే, ఎల్బీనగర్, ఉప్పల్, మల్కాజ్‌గిరి జోన్లను కలిపి కొత్తగా మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశారు. వేగంగా విస్తరిస్తున్న నివాస ప్రాంతాలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించాలన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

ఇక సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లతో జీహెచ్ఎంసి కార్పొరేషన్‌గా కొనసాగనుంది. ఈ మూడు కార్పొరేషన్లను ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండళ్లు బాధ్యతలు చేపట్టే వరకు ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది. ఎన్నికలు పూర్తయ్యే వరకు అన్ని పరిపాలనా బాధ్యతలను ఆయన ప్రత్యేక అధికారిగా నిర్వహించనున్నారు. నగర విస్తరణ, జనాభా పెరుగుదల, పరిపాలనా సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం నగర అభివృద్ధికి దోహదపడుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# ఖర్గేతో రేవంత్ భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. బుధవారం జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కొడంగల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్న సీఎం మధ్యాహ్నం శంషాబాద్ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో భేటీ అయిన సీఎం రాష్ట్రంలో జరిగిన మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలతో పాటు తాజా రాజకీయ పరిణామాలపై చర్చించారు. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలలో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అలాగే, గురువారం సీఎం రేవంత్ పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమై రాష్ట్రానికి సంబంధించిన పలు పెండింగ్ ప్రాజెక్టులు, రావాల్సిన నిధుల విడుదలపై చర్చించనున్నారు. అలాగే, కొత్త ప్రాజెక్టులకు సంబంధించి సైతం సీఎం చర్చలు జరుపనున్నారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

# బీఆర్ఎస్‌ను గురి చూసి కొట్టిన పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

ఇరుకున పెట్టాయి. రాష్ట్రంలో మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికలు జరగడానికి ముందు రోజు కొందరు ఉద్యోగ సంఘాల నేతలతో నిర్వహించిన రహస్య సమావేశం వివరాలు బయటికి పొక్కడం మంత్రి పొంగులేటి వ్యాఖ్యలకు తాజాగా కారణమైంది. ప్రస్తుతం బీఆర్ఎస్ హయాంలో నడిపిన ఫోన్ ట్యాపింగ్ విచారణ దాదాపు ముగింపు దశకు చేరుకుంది. ఈ వ్యవహారంపై నిజాలు నిగ్గుతేల్చి ఇందుకు బాధ్యులైన దోషులను కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ప్రత్యేకంగా సిట్‌ను ఏర్పాటు చేసింది. హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ నేతృత్వంలో ఏర్పాటైన సిట్ ఇప్పటికే ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించినట్లు భావిస్తున్న మాజీ సీఎం కేసీఆర్‌తో పాటు మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్ రావు, మాజీ ఎంపీ సంతోష్‌రావును సుదీర్ఘంగా విచారించి ఇందుకు సంబంధించిన విషయాలు రాబట్టింది. ఈ వ్యవహారం ఇలా సాగుతుండగానే తాజాగా మంత్రి పొంగులేటి ఫోన్ ట్యాపింగ్ ఇంకా జరుగుతోందన్నది అక్షరాల నిజమనీ, దీనిపై మరింత లోతుగా దృష్టి సారిస్తామని చేసిన వ్యాఖ్యలు గులాబీ నేతలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. అసలే గతంలో చేసిన ట్యాపింగ్‌తో తలబొప్పి కడుతుంటే కొత్తగా ఆ వ్యవహారం ఎటు తిరిగి ఎటు చుట్టుకుంటుందోనని చర్చించుకుంటున్నారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీలోనూ మంత్రి పొంగులేటి చర్చలపై ఆసక్తికర చర్చ సాగుతోంది. మున్సిపల్ ఎన్నికల ముందు మంత్రి పొంగులేటి చేసిన వ్యాఖ్యలు ఎన్నికలలో ఓటర్లు బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ వైపు మొగ్గేలా ఉన్నాయని చర్చించుకుంటున్నారు. మంత్రి పొంగులేటి ఏ ఆధారాలు లేకుండా ఇలాంటి కీలక వ్యాఖ్యలు చేయరనీ పేర్కొంటున్నారు. మాజీ సీఎం కేసీఆర్ మొదలు ఆ పార్టీ ముఖ్య నేతలు కేటీఆర్, హరీష్‌రావులను ఎప్పటికప్పుడు ఘాటైన విమర్శలతో ఎండగడుతూ ఎప్పుడూ సంచలనాలకు కేరాఫ్‌గా నిలిచే పొంగులేటి ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన వ్యాఖ్యల పరిణామాలు మరికొద్ది రోజుల్లో తెలుస్తాయని స్పష్టం చేస్తున్నారు.

# హస్తందే హవా!

(మొదటి పేజీ తరువాయి)




పోలింగ్ ముగిసినా బూత్ లలో ఉన్న వారికి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించారు. పోలింగ్ పూర్తయిన తరువాత వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్ విడుదల చేశాయి. కాంగ్రెస్ పార్టీ తన ఆధిపత్యాన్ని చాటుకోనుందని పీపుల్స్ పల్స్ ఎగ్జిట్ పోల్ సర్వే వెల్లడించింది. మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబుబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఖాతాలో పడనుండగా.. కరీంనగర్, నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్లను బీజేపీ కైవసం చేసుకునే అవకాశాలున్నాయని అది వెల్లడించింది. ఈ రెండు మున్సిపల్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించనుంది. ఈ ఎగ్జిట్ పోల్ వివరాలిలా ఉన్నాయి.

- నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్లలో ఎంఐఎం కింగ్ మేకర్ కానున్నది.
- ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీ ఏ ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ గెలిచే అవకాశాలు లేవు
- రామగుండంలో కాంగ్రెస్ 30-34, బీఆర్ఎస్ 16-20, బీజేపీ 3-6, ఇతరులు 4-7 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.
- మంచిర్యాలలో కాంగ్రెస్ 39-43, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-9, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.
- కొత్తగూడెంలో కాంగ్రెస్ 28-34, బీఆర్ఎస్ 7-9, సీపీఐ 14-16, ఇతరులు 2-4 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.
- మహబూబ్ నగర్ లో కాంగ్రెస్ 26-30, బీఆర్ఎస్ 18-22, బీజేపీ 6-8, ఎంఐఎం 2-4, ఇతరులు 0-1 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.
- నల్లగొండలో కాంగ్రెస్ 21-26, బీఆర్ఎస్ 8-12, బీజేపీ 6-10, ఎంఐఎం 2-4, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం.
- నిజామాబాద్ లో కాంగ్రెస్ 10-16, బీఆర్ఎస్ 2-4, బీజేపీ 26-31, ఎంఐఎం 8-12, ఇతరులు 1-2 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.
- కరీంనగర్ లో కాంగ్రెస్ 14-16, బీఆర్ఎస్ 10-12, బీజేపీ 24-29, ఎంఐఎం 6-9, ఇతరులు 1-3 వార్డులు గెలుపొందే అవకాశం ఉంది.

ఇదే కోవలో.. 68-76 మున్సిపాలిటీలను అధికార కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుంది. 29-36 మున్సిపాలిటీలను ప్రధాన ప్రతిపక్ష పార్టీ బీఆర్ఎస్, 3-5 బీజేపీ, 0-1 ఎంఐఎం గెలుచుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ తన సర్వే ఫలితాల్లో పేర్కొంది. దాదాపు 70 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకునే అవకాశం ఉందని పీపుల్స్ పల్స్ సర్వే పేర్కొంది. ముఖ్యంగా మంచిర్యాల, రామగుండం, నల్లగొండ, మహబూబ్ నగర్, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్లలో కాంగ్రెస్ జెండా ఎగరవేయనుందని సర్వే అంచనా వేసింది. బీజేపీకి రెండు కార్పొరేషన్లు - బీఆర్ఎస్ సున్నాగా సర్వే తేల్చింది.

**బీజేపీ జోరు:** ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిరూపించుకోనుందని సర్వే చెప్పింది. కరీంనగర్, నిజామాబాద్ కార్పొరేషన్లలో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించి, వాటిని కైవసం చేసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయంది.

**బీఆర్ఎస్ పరిస్థితి:** ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ఈ ఎన్నికలు కోలుకోలేని దెబ్బ తీసేలా ఉన్నాయని తెలిపింది.. ఒక్క మున్సిపల్ కార్పొరేషన్ను కూడా గెలుచుకునే అవకాశం ఆ పార్టీకి లేదని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది.

**కింగ్ మేకర్ ఎంఐఎం:** నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్ నగర్ కార్పొరేషన్లలో అధికార పీఠాన్ని నిర్ణయించడంలో ఎంఐఎం కీలక పాత్ర (కింగ్ మేకర్) పోషించనుందని సర్వే వెల్లడించింది.

# పోలింగ్ ప్రశాంతం





హైదారాబాద్: ఫిబ్రవరి 11: రాష్ట్రంలోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీల్లో పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసిందని రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ బి.శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఈక్రమంలో బుధవారం జరిగిన మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల పోలింగ్ సరళిని డీజీపీ శివధర్‌రెడ్డి, అదనపు డీజీపీ మహేష్ ఎం. భగవత్‌తో కలిసి కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి వెబ్ కాస్టింగ్ విధానం ద్వారా పర్యవేక్షించారు. ముఖ్యంగా సమస్యాత్మక ప్రాంతాల్లో జరుగుతున్న పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ ద్వారా నేరుగా వీక్షిస్తూ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయి అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీజీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని పోలింగ్ స్టేషన్ల తీరుతెన్నులను ఎప్పటికప్పుడు తెలుసుకున్నామని, ఈ కెమెరాల నిఘా కారణంగాను, పోలీస్ సిబ్బంది బందోబస్తు వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రశాంతంగా పోలింగ్ నిర్వహించడంలో పోలీసు సిబ్బంది అంకితభావంతో పాటు వెబ్‌కాస్టింగ్ సాంకేతికత ఎంతగానో తోడ్పడిందని వివరించారు.

**బందో 'మస్తు':**

రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ పోలీసులు అత్యంత పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేశారని డీజీపీ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 8,203 పోలింగ్ స్టేషన్లను కవర్ చేస్తూ భారీ ఎత్తున భద్రతను కల్పించామన్నారు. వీటిలో 1,302 అత్యంత సమస్యాత్మక (హైపర్ సెన్సిటివ్), 1,926 సమస్యాత్మక (సెన్సిటివ్) మరియు 4,975 సాధారణ కేంద్రాలుగా గుర్తించి, ఆయా ప్రాంతాల తీవ్రతను బట్టి బలగాలను మోహరించినట్లు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసు శాఖతో పాటు ఇతర విభాగాల నుంచి సుమారు 3,000 మంది అదనపు బలగాలను రప్పించామని, ఇందులో టీజీఎస్పీ, ఫారెస్ట్, ఎక్సైజ్, సీఐడీ. లీగల్ మెట్రాలజీ విభాగాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం లోపల మరియు అత్యంత సమస్యాత్మక కేంద్రాల వెలుపల వంద శాతం వెబ్‌కాస్టింగ్ ఉండేలా చర్యలు తీసుకున్నామని, దీనివల్ల ఎన్నికల ప్రక్రియలో పూర్తి పారదర్శకత సాధ్యమైందని ఆయన వెల్లడించారు.

**'పోలీసు' సాయం:**

రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులకు సహాయం చేశారని డీజీపీ తెలిపారు. నిజామాబాద్‌లో సిపి పి. సాయి చైతన్య , నల్గొండ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, పెద్దపెల్లి డిసిపి బి రామ్ రెడ్డిలు వృద్ధ ఓటర్లను , వికలాంగులను వీల్ చైర్ లో తరలించి ఓట్లు వేసేలా సహకరించారన్నారు. ములుగు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల విధులు నిర్వహిస్తున్న నాలుగో బెటాలియన్ సిబ్బంది మూర్ఛ వచ్చి పడిపోయిన ఓటరుకు ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారని వివరించారు. అదేవిధంగా అక్కడ ఉన్న వృద్ధ ఓటర్లను పోలింగ్ కేంద్రంకు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా సహాయపడ్డారు. సంగారెడ్డి జిల్లా లోని జిన్నారం మండల పరిధికి చెందిన రాలకత్వలో వృద్ధులను ఆటోలు తీసుకువెళ్లి ఓట్లు వేసేలా తోడ్పాటు అందించారని, అలాగే మహబూబాబాద్ జిల్లాలో మహిళా ఓటర్లు ఓటేసి వచ్చే వరకు వారి పిల్లలను శ్రద్ధగా చూసుకోవడం పోలీసు సేవానిరతికి నిదర్శనమన్నారు.

# నేడు భారత్ బంద్..

## రవాణా, బ్యాంకింగ్ సర్వీసులకు అంతరాయం




హైదరాబాద్, ఫిబ్రవరి 11: దేశవ్యాప్తంగా నేడు సార్వత్రిక సమ్మె జరుగనుంది. సమ్మెకు 10 ప్రధాన కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. పలు రైతు సంస్థలు కూడా మద్దతు ప్రకటించాయి. పలు రైతు సంస్థలు మద్దతు ప్రకటించాయి. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కార్మిక సంఘాలు ఈ పోరాటానికి పిలుపునిచ్చాయి. ప్రస్తుతం ఉన్న 29 కార్మిక చట్టాల స్థానే 2025 నవంబర్లో కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన నాలుగు కొత్త కార్మిక కోడ్లు వివాదాస్పదంగా మారాయి. ఇవి కార్మికులపై ప్రతికూల ప్రభావం చూపించనున్నాయని, ఇందువల్ల ఉద్యోగ భద్రత తగ్గిపోతుందని, ఉద్యోగులను తొలగించడం యజమానులకు తేలికవుతుందని కార్మిక సంఘాలు ఆందోళన చెందుతున్నాయి. ప్రైవేటీకరణ, వేతనాల్లో వృద్ధి లేకపోవడం, సామాజిక భద్రత కొరవడటం జరుగుతుందని చెబుతున్నాయి. మరోవైపు భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై రైతు సంఘాలు ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఒప్పందం దేశీయ వ్యవసాయరంగాన్ని దెబ్బతీస్తుందని చెబుతున్నాయి. దేశవ్యాప్త బంద్లో సుమారు 30 కోట్ల మంది కార్మికులు భాగస్వాములు కానున్నట్టు ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తెలిపారు. ఐఎన్టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, టీయూసీసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ, ఎల్పీఎఫ్, యూటీయూసీలు ఈ బంద్లో పాల్గొంటున్నాయి. సంయుక్త కిసాన్ మోర్చా, ఆల్ ఇండియా కిసాన్ సభ సహా పలు రైతు సంఘాలు బంద్కు మద్దతు ప్రకటించాయి.

# 73.01 శాతం

(మొదటి పేజీ తరువాయి)

పోలింగ్ బూత్‌లకు తరలించారు. అధికార కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీ పార్టీల నుంచి ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు అవకాశం ఉన్నప్పుడల్లా తమకే ఓటు వేయాలని ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రచారం చేయడం కనిపించింది. కాగా, రాష్ట్రంలోని 8191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. పోలింగ్ గడువు ముగిసిన 5 గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా60 శాతానికి పైగా ఓటింగ్ శాతం నమోదైందనీ, తుది సమాచారం అందే సమయానికి ఓటింగ్ శాతం పెరిగే అవకాశం ఉందని ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలను సిద్ధం చేశారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఈనెల 16న మున్సిపాలిటీల్లో చైర్మన్, వైస్ చైర్మన్, కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక ప్రక్రియ పూర్తి కానుంది.

# అమెరికా పాక్‌ను టాయిలెట్ పేపర్ కంటే హీనంగా చూసింది

(మొదటి పేజీ తరువాయి)

పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించుకుందని ఆసిఫ్ ఖవాజా అన్నారు. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. అయితే, తాలిబన్లు తిరిగి తమపై హింసకు పాల్పడ్డారన్నారు. తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం తమకు ఎటువంటి సహాయం చేయలేదని ఆయన స్పష్టం చేశారు.

# జనగణమనకు ముందు వందేమాతరం ఆలపించాలె

(మొదటి పేజీ తరువాయి)

అంతే కాకుండా పౌరపురస్కారాలు ఇచ్చే సమయంలో, రాష్ట్రపతి హాజరయ్యే అన్ని కార్యక్రమాల్లో వందేమాతరం ఆలపించాలని నిబంధన పెడుతున్నట్లు తెలిపింది. అయితే, సినిమా హాళ్లలో దీనిని ప్రదర్శించాల్సిన అవసరం లేదని నిబంధనల్లో పేర్కొంది. జాతీయ గీతం, గేయం పాడుతుండగా.. అంతరాయం కలిగించేవారిపై చట్టపరమైన చర్యలు చేపడతామని చెప్పింది. ఈ కొత్త నిబంధనల ప్రకారం అంతరాయం కలిగించే వారికి గరిష్ఠంగా మూడేండ్ల జైలుశిక్ష విధించనున్నారు. దేశ వ్యాప్తంగా 'వందేమాతరం' 150వ వార్షికోత్సవాలు జరుగుతోన్న నేపథ్యంలో ఈ తాజా ఉత్తర్వులు వచ్చాయి. అందులో ఆరు చరణాలను పాడాలని కేంద్రం పేర్కొంది. వాటిని 3 నిమిషాల 10 సెకన్లలో ఆలపించాలి.

# ఆమె మాట నచ్చలేదు.. అందుకే సుంకాలు పెంచిన

(మొదటి పేజీ తరువాయి)

ఒక ఎమర్జెన్సీ కాల్ వచ్చింది. ఆ దేశ ప్రధాని కాల్ చేశారని అనుకున్నాను, కానీ అది స్విస్ ఫెడరల్ కౌన్సిల్ సభ్యురాలైన కరిన్ కెల్లర్ సట్టర్ నుంచి. అప్పుడు ఆమె మాట్లాడిన తీరు నాకు నచ్చలేదు. 'సర్.. మాది చాలా చిన్నదేశం. ఈ సుంకాలు మేం భరించలేం' అని అన్నారు. మీది చిన్నదేశమే అయినా అమెరికాతో జరుపుతోన్న వాణిజ్యంలో 42 బిలియన్ డాలర్ల మిగులు ఉందని చెప్పాను. అయినా మాది చిన్నదేశం అంటూ ఆమె పదేపదే అదే మాట చెప్పారు. నాకు ఆమె మాట్లాడిన తీరు నచ్చలేదు. అందుకే సుంకాలు తగ్గించడానికి బదులు.. 30 శాతం నుంచి 39 శాతానికి పెంచాను. ఎలాంటి సుంకాలు చెల్లించకుండా మా దేశానికి స్విస్ ఉత్పత్తులను ఎగుమతి చేస్తోంది'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్నివారాల క్రితం కూడా దావోస్ వేదికగా ఈ ఐరోపా దేశాన్ని ఉద్దేశించి ట్రంప్ ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు.

# సింగరేణి ఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాశ్

- జీహెచ్ఎంసీ కమిషనర్‌గా కర్ణన్ కొనసాగింపు
- సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా టి.వినయ్ కృష్ణారెడ్డి నియామకం
- పలువురు ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అవసరాల దృష్ట్యా పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. మరి కొందరు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు బుధవారం సాధారణ పరిపాలనా శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఐఏఎస్ అధికారుల బదిలీలలో భాగంగా ప్రస్తుతం ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి చేస్తున్న జ్యోతి బుద్ధప్రకాశ్‌ను సింగరేణి కాలరీస్ చైర్మన్, సీఎండీగా బదిలీ చేసింది. ఫ్లాగ్‌షిప్ సంక్షేమ, అభివృద్ధి పథకాల స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న సబ్యసాచి ఘోష్‌కు ఎస్సీ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, కమిషనర్‌గా అదనపు బాధ్యతలు, ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాకు ప్లానింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి, రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. అలాగే, ప్రస్తుతం సెర్ఫ్ సీఈవోగా ఉన్న దివ్య నటరాజన్‌కు అదనంగా పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బాధ్యతలు అప్పగించగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న ఆర్వీ కర్ణన్‌కు ఆ బాధ్యతలు కొనసాగించనున్నారు. శ్రీజనను జీహెచ్ఎంసి అదనపు కమిషనర్ పదవి నుంచి బదిలీ చేసి కొత్తగా ఏర్పాటు చేసిన సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, జీహెచ్ఎంసి అదనపు కమిషనర్‌గా ఉన్న టి.వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ చేశారు. అలాగే, కాత్యాయనిదేవిని ప్రజావాణి స్టేట్ నోడల్ అధికారిగా, హైదరాబాద్ మెట్రో వాటర్‌వర్క్స్ ఈడీగా ఉన్న మయాంక్ మిట్టల్ అదే సంస్థలో జాయింట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఐటీ, పరిశ్రమలు, శాసనవ్యవహారాల శాఖ ఓఎస్డీగా ఉన్న రఘురాం శర్మను ఇండస్ట్రీస్, కామర్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఆ శాఖ మంత్రికి ఓఎస్డీగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

# మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు.. భూసేకరణ షురూ..

హైదరాబాద్, ఫిబ్రవరి 11: మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టులో కీలక పరిణామం చోటుచేసుకుంది.
మూసీ అభివృద్ధికి భూసేకరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రారంభించింది. ఈ మేరకు మూసీ రివర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది.
దీని ప్రకారం ఫేజ్ ఏ1లో హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కిలోమీటర్లు, ఫేజ్ ఏ2లో ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8 కిలోమీటర్లు పరిధిలో భూసేకరణ చర్యలు చేపట్టనున్నారు అధికారులు. హైదరాబాద్, గోల్కొండ మండలం, రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పరిధిలో భూముల సేకరణ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు.
సుమారు 50 ఎకరాలకు పైగా భూమి సేకరించేందుకు ప్రక్రియ ప్రారంభమైంది.
భూ యజమానులకు మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. ఆయా యజమానులు తమ హక్కుల పత్రాలు(పట్టాలు, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాలు) నిర్దేశిత సమయంలో సమర్పించాలని ఆదేశాలు జారీ అయ్యాయి.
ఏమైనా అభ్యంతరాలుంటే నిర్ణీత సమయంలో తెలియజేయాలని అధికారులు సూచించారు. సర్వే నంబర్లు, గ్రామాల వారీగా పూర్తి జాబితాను కూడా ప్రకటించారు. 2013 నిబంధనల ప్రకారం.. ఈ భూసేకరణ ప్రక్రియను అధికారులు చేపట్టనున్నారు.

# అవిశ్వాస తీర్మానం నోటీసులో లోపాలు

## మార్చిలో చర్చకు అనుమతి!

ఢిల్లీ, ఫిబ్రవరి 11: లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా ను పదవి నుంచి తొలగించాలంటూ విపక్ష పార్టీలు అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టేందుకు సిద్ధమైన విషయం పాఠకులకు విదితమే. ఇందులో భాగంగా లోక్ సభ సెక్రటరీ జనరల్ కు మంగళవారం నోటీసులు అందజేసిన విషయం తెలిసిందే. కాగా ఆ నోటీసుల్లో లోపాలు ఉన్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. కొన్ని సందర్భాలను ప్రతిపక్ష సభ్యులు పదే పదే అందులో ప్రస్తావించినట్లు తెలిపాయి. అయితే, ఆ నోటీసును పూర్తిగా తిరస్కరించడానికి బదులుగా అందులోని లోపాలను సవరించాలని స్పీకర్ ఓం బిర్లా సెక్రటేరియట్ ను ఆదేశించినట్లు తెలుస్తోంది. సవరించిన నోటీసు అందిన తర్వాత.. నిర్దేశించిన నిబంధనల ప్రకారం వాటిని పరిశీలిస్తామని అధికారులు పేర్కొన్నారు.

# అలుపెరుగని యోధుడు.. ఆరవయ్యారేళ్ల యువకుడు



## రాజకీయాలలో 'యావ'లేని...సేవకుడు
## పొంగులేటికి...లేరెవరు సాటి
## రేవంతుకు అన్నింటా...తన వంతు
## భూ'మాత'కు భూ భారతితో హారతి
## రాజకీయాలలో మేటి పొంగులేటి

హైదరాబాద్,ఫిబ్రవరి 11(మనం,ప్రత్యేక ప్రతినిధి): ఎలాంటి స్వార్థం లేకుండా రాజకీయాలు చేయాలన్నదే ఆయన సంకల్పం. ధనార్జనకు రాజకీయాలు వేదిక కాకూడదన్నదే ఆయన అభిమతం. ప్రజలకు సేవలందించడంలో 'యావ' ఉండరాదన్నది ఆయన నైజం. ప్రతీ పథకం నిరుపేదలను ఆదుకునేలా రూపొందించాలన్నదే ఆయన ఆరాటం. పథకాలు ప్రారంభించడం కాదు అవి ప్రజలకు ప్రయోజనం కలిగించేలా చేయడమే ఆయన పోరాటం. ధరణి పేరిట బురిడీ కొట్టించడం కాదు.. భూ భారతితో భూ యజమానులకు హారతి పట్టాలని ఆయన సంకల్పం. వెరసి పాలకులు పేద ప్రజల పక్షాన నిలిచి.. వారి గుండెల్లో పదికాలాల పాటు పదిలంగా ఉండాలనుకునే పాలకులు, నాయకులు అరుదు. ఆయన రాజకీయ యోధుడు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి.

### ఇది...నేపథ్యం :

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఖమ్మం జిల్లా, కల్లూరు మండలంలోని నారాయణపురంలో 1959, నవంబరు 4న రాఘవరెడ్డి, స్వరాజ్యం దంపతులకు జన్మించాడు. 1984లో కల్లూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం దూరవిద్యలో బిఏ డిగ్రీని పూర్తిచేశారు. 1992, మే 8న తన జీవిత భాగస్వామి మాధురితో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు (హర్షా రెడ్డి), ఒక కుమార్తె (సప్నీ) ఉన్నారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తగా కొనసాగుతూ, వివిధ హోదాల్లో పనిచేశాడు. 2013లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాడు. తెలంగాణ వైకాపా అధ్యక్షుడిగా ఉన్న పొంగులేటి 2014లో జరిగిన 16వ లోక్‌సభ ఎన్నికలలో టీడీపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావుపై 11,974 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందాడు. కాలక్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితిలో చేరాడు.2018లో తెలంగాణ శాసనసభ ఎన్నికలలో 2019 17వ లోక్సభ ఎన్నికలలో టిఆర్ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇచ్చాడు. ఖమ్మంలో జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో పార్టీపై వివాదస్పద వ్యాఖ్యలు చేయడంతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 2023 ఏప్రిల్ 10న బీఆర్ఎస్ పార్టీ నుండి సస్పెండ్ చేసింది ఆయన 2023 జూలై 2న ఖమ్మంలో తెలంగాణ కాంగ్రెస్ జనగర్జన సభలో మిత్రుడు రేవంత్‌రెడ్డి పిలుపు మేరకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. 2023 పాలేరు ఎమ్మెల్యేగా గెలిచి, రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో 2023 డిసెంబరు 7న రాష్ట్ర సమాచార, రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించాడు.

### సవాల్ విసిరి..మరీ :

ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా ఉన్న 10 నియోజకవర్గ స్థానాల్లో ఏ ఒక్క బీఆర్ఎస్ నేతను అసెంబ్లీ గేట్ తాకనివ్వనని మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన పంతం నెగ్గించుకున్నారు.2023 శాసనసభ ఫలితాల్లో జిల్లాలోని 10 స్థానాలకు గానూ 9 స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించగా బీఆర్ఎస్ ఒక్క స్థానంతో సరిపెట్టుకునేలా వ్యూహాలు రచించాడు.ఈక్రమంలో పాలేరు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి కందాల ఉపేందర్‌రెడ్డిపై భారీ మెజార్టీతో విజయం సాధించిన పొంగులేటి సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గంలో నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్న విషయం విదితమే. నిరుపేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని పదేపదే చెప్పడమే కాదు ఆ దిశగా రాజకీయాలలో తనదైన ముద్ర వేసుకున్న పొంగులేటి తాజాగా రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం స్థానాలను కైవసం చేసుకుంటుందని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పాలనలో గడిచిన రెండేళ్లలో ఇచ్చిన ప్రతి మాటను నెరవేర్చామని, అందుకే ప్రజలు కాంగ్రెస్ అభ్యర్థులను దీవించబోతున్నారని ఆయన తేల్చిచెప్పారు.

### అభివృద్ధే మంత్రం :

బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని 8 లక్షల 19 వేల కోట్ల అప్పుల్లో ముంచిందని, ప్రస్తుతం నెలకు 6,300 కోట్ల రూపాయలు కేవలం అప్పుల జమకే కేటాయిస్తున్నట్లు లెక్కలను కళ్లకు కట్టినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమం కుంటుపడకుండా చూస్తున్నామన్నారు.వరి వేస్తే ఉరి అనిన కాలం పోయి, నేడు మద్దతు ధరతో పాటు బోనస్ ఇస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థుల కోసం డైట్, కాస్మెటిక్ ఛార్జీల పెంపుతో పాటు ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు.గత పాలనలో దొరలు బొమ్మలు చూపించారు తప్ప ఇళ్లు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పార్టీలకు అతీతంగా 4.5 లక్షల ఇళ్లు మంజూరు చేసిందని మంత్రి పొంగులేటి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని, పట్టణాల్లో ఇళ్ల స్థలాలు లేని పేదల కోసం ఎ+3 ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని వివరించారు.

### భూ సమస్యలకు చెక్ :

అనతికాలంలో రెవెన్యూ శాఖ అందుబాటులోకి తీసుకురానున్న భూ భారతి పోర్టల్ తెలంగాణ ప్రజలకు ఇక బహుళ ప్రయోజనకారిగా మారబోతుందని మంత్రి పొంగులేటి వివరించారు. దీనికి సంబంధించిన కార్యాచరణ ఇప్పటికే దాదాపు కొలిక్కి వచ్చిందని, మరి కొన్నిరోజులలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. భూ భారతి పోర్టల్‌లో కేవలం సాగుభూముల రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లకు మాత్రమే వెసులుబాటు ఉండగా, ఇప్పుడు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ పోర్టల్ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ (కార్డ్) ద్వారా అందించే సేవలన్నీ కొత్త భూభారతి పోర్టల్ నుంచే పొందవచ్చన్నారు. స్థిరాస్తులకు సంబంధించిన స్లాట్ నమోదు చేసుకోవడం, ఈసీలు(ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్) పొందడం, సర్టిఫైడ్ డాక్యుమెంట్లు పొందడం తదితర సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఏదైనా సర్వే మ్యాప్ కావాలంటే భూమి కొలతలు, భూ దస్త్రాల నిర్వహణ శాఖకు దరఖాస్తు చేసుకునే పని తప్పుతుందని, ఇకపై నేరుగా భూ భారతి పోర్టల్‌ను ఆశ్రయించవచ్చని వివరించారు. ప్రభుత్వ భూములకు (నిషేధిత జాబితాలోని 22ఏ) రిజిస్ట్రేషన్లు కాకుండా అరికట్టేందుకు వీలు కలుగుతుందని, భూముల సర్వే, సరిహద్దు వివాదాలపై స్పష్టత కోరవచ్చని, అటవీ, రెవెన్యూ, వక్ఫ్ , దేవాదాయ తదితర ప్రభుత్వ భూములతో సరిహద్దు సమస్యల వివరాలనూ ఈ పోర్టల్‌లో పొందే విధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ఇది రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజిత పథకాలతో పాటు, కేంద్ర ప్రభుత్వ పథకాలకు కూడా ఉపయోగపడనుందన్నారు. సాగుభూమి సమాచారం, వ్యవసాయేతర భూమికి చెందిన సమాచారం, భూ సర్వే, మీ భూమి ఎవరి పేరు మీద ఉంది తదితర విషయాలు తెలియాలంటే ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదని మంత్రి తేల్చిచెప్పారు.

### తలొగ్గని నైజం :

గత పాలకులు 2023 ఎన్నికల సమయంలో హైదరాబాద్‌లోని పొంగులేటి నివాసంలో ఐటీ సోదాలు చేయించినా ఏమాత్రం తలొగ్గకుండా తనదైన శైలిలో ఆయన ముందుకు సాగారు. ఏకకాలంలో ఐటీ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేసిన అధికారులు.. పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. జూబ్లీహిల్స్‌లోని పొంగులేటి నివాసంలో సోదాలు చేసిన అధికారులు పొంగులేటి కుటుంబసభ్యులను పలు వివరాలు సేకరించారు. ఒకవైపు ఖమ్మం నివాసంలో సోదాలు జరుగుతున్న సమయంలోనే.. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఆయన నివాసాలు, కార్యాలయాలపైనా ఐటీ దాడులు కొనసాగించారు. ముఖ్యంగా ఖమ్మం నగరంలోని పొంగులేటి కుటుంబీకులకు చెందిన ఇళ్లు, బంధువుల నివాసాలు , ఎస్ఆర్ కన్వెన్షన్, రాఘవా కన్స్ట్రక్షన్స్ కార్యాలయాలతోపాటు పొంగులేటి స్వగ్రామం కల్లూరు మండలం నారాయణపురం గ్రామంలోనూ దాడులు జరిపారు, ఎక్కడివారు అక్కడే కదలకుండా చేసి పటిష్ఠ బందోబస్తు విధించారు. పొంగులేటి నివాసంపై ఐటీ దాడులు జరుగుతున్నాయన్న సమాచారం తెలుసుకున్న నాయకులు, కార్యకర్తలు భారీగా పొంగులేటి ఇంటి వద్దకు చేరుకుని నిరసర తెలియజేయంతో అభిమానులను తనదైన శైలిలో శాంతింప చేసి అక్కడి నుంచి పంపించారు.

### ధైర్యమే...ఆయుధం :

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై.. తనపై ఐటీ దాడులకు పురిగొల్పాయని, కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా అదిరేది లేదని, అలాగే బెదిరేది లేదని పొంగులేటి తేల్చిచెప్పారు. తనను, తన కార్యకర్తలను భయభ్రాంతులకు గురిచేసేందుకు ఎన్ని దాడులు జరిపినా.. చివరకు తనను జైల్లో బంధించినా ఒక్క అడుగు కూడా వెనకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు విశ్రమించబోనని ప్రతిజ్ఞ పూనారు. తనపై ఉద్దేశపూర్వకంగా భయభ్రాంతులకు గురిచేసేందుకు ఈ దాడులకు తెరలేపారన్నారు. వ్యవసాయం చేస్తూ కోట్లు సంపాదించానని చెప్పిన కేసీఆర్.. రాష్ట్రంలో రైతులందరిని కోటీశ్వరులను ఎందుకు చేయడం లేదని ధీటుగా ప్రశ్నించారు. క్యాప్సికం పండించడం ద్వారా ఎకరానికి రూ. 10 కోట్లు ఆదాయం సంపాదించవచ్చని చెప్పిన కేసీఆర్.. రాష్ట్ర రైతులను ఎందుకు కోటీశ్వరులను చేయలేకపోయారని ప్రశ్నించారు.

### ఆగని ట్యాపింగ్‌పై ఆగ్రహం :

ఫోన్ ట్యాపింగ్‌ను ఆయుధంగా వాడుకున్న గత పాలకులు ఇప్పటికీ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారని మంత్రి పొంగులేటి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల తన ఫోన్ ట్యాపింగ్ అంశంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. తాను అధికారులతో మాట్లాడిన టెలి కాన్ఫరెన్స్ విషయాలు బయటకు వస్తున్నాయంటే, ఇంకా ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని అర్థమవుతోంది. ఏ ఫామ్ హౌస్ నుండి ఇది జరుగుతుందో ఆధారాలు ఉన్నాయని వారి గుట్టు రట్టు చేస్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ హయాంలో సామాన్యుల నుంచి సొంత కుటుంబ సభ్యుల (అల్లుడు, కూతురు) ఫోన్ల వరకు ట్యాప్ చేయించారని మంత్రి ఆరోపించారు. ఈ విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన ఆధారాలతో ఉన్నాయని, చట్టం నుండి ఎవరూ తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నారనే అనుమానం ఉందని తెలిపారు.

కొంతమంది వ్యక్తులు చట్టవిరుద్ధంగా ఇతరుల పర్సనల్ సంభాషణలను వింటున్నారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది తీవ్ర నేరంగా పరిగణిస్తారని, టెక్నాలజీని తప్పుడు విధానాలకు ఉపయోగిస్తూ.. రాజ్యాంగ విరుద్ధమైన చర్యలకు పాల్పడుతున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రతిపక్ష నేతలు అసభ్య పదజాలంతో హీనంగా మాట్లాడుతున్నారని, వారికి ఈ ఎన్నికల్లో ప్రజలు గుణపాఠం చెబుతారని పొంగులేటి మండిపడ్డారు. తాను సీఎం రేసులో లేనని, కేవలం కాంగ్రెస్ పార్టీలో ఒక సామాన్య కార్యకర్తను మాత్రమేనని పొంగులేటి స్పష్టం చేశారు.

# జగ్గారెడ్డి వ్యాఖ్యలపై ఈసీ సీరియస్

## కేసు నమోదు చేయాలని ఎస్పీకి ఆదేశం
## జగ్గారెడ్డి 'నాయక' ఇమేజ్‌ను మరింత పెంచిన ఘటన



హైదరాబాద్, ఫిబ్రవరి 11 : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జగ్గారెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం సీరియస్ అయ్యింది. ఆయనపై కేసు నమోదు చేసి, నివేదిక ఇవ్వాలని ఎస్పీకి ఎన్నికల కమిషన్ ఆదేశాలిచ్చింది. ఓటర్ల మనోభావాలు దెబ్బతీసేలా జగ్గారెడ్డి వ్యాఖ్యలు చేశారంటూ ఈసీ అభిప్రాయపడింది.

### జగ్గారెడ్డి స్పందన..

ఎన్నికల కమిషన్ చర్యలపై జగ్గారెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ దొంగ ఓట్లపైనే ప్రశ్నించానని ఆయన వివరణ ఇచ్చారు. 'ఒక వార్డులో 300కి పైగా దొంగ ఓట్లున్నాయి. దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకున్న కాంగ్రెస్ కార్యకర్త గల్లాను పట్టుకున్నాడు సీఐ శివకుమార్.. దీని వల్లే గొడవ జరిగింది.

గొడవ జరగడానికి ఈసీ, జిల్లా అధికారులు బాధ్యులు కారా?. దొంగ ఓట్లను ఈసీ ఎందుకు తొలగించలేదు' అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. అంతేకాదు, దొంగ ఓట్లు తొలగించకుండా.. ప్రశ్నించిన మాపైనే కేసులా?.. దొంగ ఓట్లు తొలగించడంలో ఈసీ విఫలం అయ్యిందంటూ జగ్గారెడ్డి ఆరోపించారు.

### సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరిక

సంగారెడ్డిలోని ఒక పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన ఘటన చిలికిచిలికి కేసు నమోదు దాకా వచ్చింది. ఆ వివరాలిలా ఉన్నాయి... సంగారెడ్డి పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న పోలీసు ఇన్‌స్పెక్టర్(సీఐ) 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు.

పోలింగ్ ఆపేస్తామంటూ బూత్ లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ ఘటనపైనే ఈసీ ఈ విధంగా స్పందించింది.

### జగ్గారెడ్డి ఎప్పుడూ ప్రజల పక్షమే..

అయితే, జగ్గారెడ్డి అంటే ఒక ఫైర్ బ్రాండ్‌గానే కాదు.. ఒక పబ్లిక్ లీడర్‌గా ప్రజల్లో పేరు పొందారు. మంచి మనిషిగా పేరున్న ఆయన పార్టీ కార్యకర్తలకు, తన అనుయాయులకు.. చివరకు ప్రజలకు ఏదైనా ఆపద వస్తే వెంటనే అక్కడ వాలిపోయి వారిని ఆదుకుంటాడు. ఈ నైజమే ఆయన్ను ప్రజా నాయకుడుగా నిలబెట్టింది. ఆయన సొంతమైన ఈ నైజం వల్లనే నేడు పార్టీ కార్యకర్తను అవమానించిన సీఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల కమిషన్ స్పందన ఎలా ఉన్నా.. ఈ ఘటన ప్రజల్లో ఆయనకున్న 'నాయక' ఇమేజ్‌ను మరింత పెంచింది.

# న్యూ మలక్‌పేట్ రోడ్డులో భారీ గుంత




రంగారెడ్డి, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): న్యూ మలక్పేట్ రోడ్డులో లాల్జార్ హోటల్ సమీపంలో ఇటీవల మట్టితో పూడ్చిన రోడ్ ప్యాచ్ అకస్మాత్తుగా కూలిపోవడంతో భారీ గుంత ఏర్పడింది. ఆ సమయంలో రోడ్డుపై వెళ్తున్న ట్రాక్టర్ కారణంగా ప్యాచ్ వర్క్ కుంగిపోవడంతో వాక్యూమ్లా లోతైన గుంత ఏర్పడింది. గుంతలో నీటి పైప్ లైన్ లీకేజ్ కూడా కనిపించింది.సమాచారం అందుకున్న వెంటనే దబీర్పురా పోలీసులు , మలక్పేట్ ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గుంత చుట్టూ బ్యారికేడ్లు ఏర్పాటు చేసి పెద్ద ప్రమాదాన్ని తప్పించారు. ఈ విషయంపై మలక్పేట్ ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలాలా పార్టీ కార్యకర్తలకు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

**మలక్ పేట మార్కెట్ యార్డ్‌ను సందర్శించిన ఏసీపి సుబ్బిరామిరెడ్డి, చాదర్ ఘాట్ సిఐ మురారి కి అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ ఉద్యోగుల 2026 డైరీ ను అందచేసిన మార్కెట్ కమిటీ ఉద్యోగుల ఫోరం అధ్యక్షుడు చిలక నరసింహారెడ్డి**
- (మలక్ పేట్ మనం న్యూస్)



# ఈనెల 13న ఫిట్నెస్ 9 జిమ్‌లో వెయిట్ లిఫ్టర్స్ ఎంపిక పోటీలు.



రంగారెడ్డి, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): సీఎం కప్ రెండవ ఎడిషన్ పోటీలలో భాగంగా ఈనెల 13వ తేదీన వెయిట్ లిఫ్టర్స్ ఎంపిక కార్యక్రమాన్ని దిల్‌సుఖ్‌నగర్ లోని ఫిట్నెస్ 9 జిమ్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా వైట్ లిఫ్టర్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బి రవి ప్రకాష్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఎంపిక కార్యక్రమంలో ఔత్సాయికులైన వెయిట్ లిఫ్టర్స్ పాల్గొనాలని ఆయన కోరారు. ఎంపికలో పాల్గొనాలి అనుకునే క్రీడాకారులు తమ పేర్లను ముందుగా వెబ్ సైట్ లో రిజిస్టర్ చేసుకోవాలని అని తెలిపారు. ఎంపికలో పాల్గొనాలనుకునేవారు 13వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు వరకు ఫిట్నెస్ 9 జిమ్ వద్దకు తమ ఆధార్ కార్డు, ఆన్లైన్ రిజిస్టర్ పత్రాలను తీసుకొని రావాలని సూచించారు.

# దివాళాకోరు రాజకీయాలు మానండి

- ప్రజల అభివృద్ధి కోసం పని చేయండి
- డివిజన్ అధ్యక్షుడు చింతల రవికుమార్ గుప్తా



రంగారెడ్డి, ఫిబ్రవరి 11 (మనం న్యూస్): 10 నెలల క్రింద చేసిన పనులకు మళ్ళీ ప్రారంబాలు చేయడం,మంజూరు కానీ పనులు కూడా శిలాఫలకలు పై కార్పొరేటర్ బొమ్మ వేసుకొని మంత్రి తో బలవంతంగా ప్రారంబాలు చేయించడం ముగ్గురు కార్పొరేటర్ల చిల్లర రాజకీయాలకు నిదర్శనం అని వనస్థలిపురం డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ గుప్తా, హస్తినపురం డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు ఆందోజు సత్యంచారి, లింగోజిగూడా డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు

**వరప్రసాద్ రెడ్డి లు మాట్లాడుతూ**

మధుయాష్కీగౌడ్ ని నిజామాబాద్ లో ఇదే విధంగా చిల్లర రాజకీయాలు చేయడం వల్ల వీరిని ప్రజలు అక్కడినుంచి తిరస్కరిస్తే,ఇక్కడ ఎల్.బి.నగర్ కి వచ్చి ఇలాంటి చిల్లర రాజకీయాలకు తెర లేపారు అని అన్నారు . మధుయాష్కీ గౌడ్ కి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం జరిగింది అని , భవిష్యత్తులో కూడా మరొక్కమారు గట్టిగా బుద్ధి చెబుతారు చెబుతారు అని అన్నారు.గతంలో సుధీర్ రెడ్డి అధికారులచే పలు దఫాలుగా అభివృద్ధి విషయంలో చర్చించి నిధులు మంజూరు చేయిస్తే మళ్లీ ఇప్పుడు మధుయాష్కీ తమదిగా ప్రకటించడం, మేమే ఇప్పుడు మంజూరు చేస్తున్నాం అని చెప్పడం హాస్యాస్పదం అని అన్నారు. ఇటువంటి చిల్లర రాజకీయాలు ప్రజల మనసులను గెలవలేవు అని ,ఒకవేళ నిజమైన అభివృద్ధే లక్ష్యమైతే, ఇతరుల పనులను తమదిగా చెప్పుకోకుండా నిజాయితీగా ముందుకు రావాలి అని అన్నారు. గత ఎన్నికల్లో మీరు మూడో స్థానం రావడానికి కారణం కూడా ఇ కార్పొరేటర్లే అని ,మీరు మళ్ళీ వారి మాటలు వింటే మళ్ళీ మరొక్కమారు బంగపాటు తప్పదు అని అన్నారు. దమ్ము ధైర్యం,కృషి ఉంటే హస్తినాపురం సర్కిల్ వద్ద నూతన ఫ్లైఓవర్ మంజూరు చేసి చూపండి అని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ భారస పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ లగ్గోని శ్రీధర్ గౌడ్, సీనియర్ ఉద్యమకారులు మధు గౌడ్, ఆనంద్ రాజ్, గడాల రాజు, కిషోర్ పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సమ్మెకు ఫెడరేషన్ మద్దతు

- జర్నలిస్తులంతా విరివిగా పాల్గొనాలి

రంగారెడ్డి ఫిబ్రవరి 11 (మనం న్యూస్) కేంద్రంలోని బీజేపీ సర్కార్ అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రేపు గురువారం జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర కమిటీ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ పి. రాంచందర్, ప్రధానకార్యదర్శి బి.బసవపున్నయ్య ఒక ప్రకటన విడుదల చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాలను అనుసరించడాన్ని ఖండించారు.రద్దయిన 29 చట్టాల్లో జర్నలిస్టులకు సంబంధించి రెండు చట్టాలు కూడా ఉన్నాయని గుర్తు చేశారు. జర్నలిస్టుల కనీస వేతనాలకు సంబంధించి గురుబక్ష్ మతీజియా వేజ్ బోర్డు సిఫారసులను అమలుచేయించకపోగా, ఉన్న చట్టాన్ని కోడ్ లు గా మార్చి పాత్రికేయరంగాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. జాతీయ కార్మిక సంఘాలు చేపట్టిన సార్వత్రిక సమ్మెలో రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లా కేంద్రాల్లో జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొని సమ్మెను పిలుపునిచ్చారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 12న హైదరాబాద్లోని ఇందిరాపార్క్ వద్ద ఉదయం 11 గంటలకు జరిగే సమ్మెలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

# భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు



హైదరాబాద్, ఫిబ్రవరి 11 : హైదరాబాద్ నగరంలో భారీగా గంజాయి రవాణా విక్రయానికి పాల్పడుతున్న నెట్వర్కు్ను పోలీసులు గుట్టురట్టు చేశారు. వెస్ట్ జోన్ టాస్క్ఫోర్స్, ఎస్ఆర్ నగర్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఈ ఆపరేషన్లో 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీజ్ చేసిన గంజాయి విలువ సుమారు రూ.35 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఒడిశాకు చెందిన మనీల్ దలబెహరా, ఇస్మాయిల్ రైతా అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు.

లీసుల వివరాల ప్రకారం.. మనీల్ దలబెహరా అనే వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఒడిశాలో గంజాయి సాగు చేశాడు. ఆయన పండించిన గంజాయిని హైదరాబాద్లో విక్రయించాలని ప్లాన్ చేశాడు. ఈ క్రమంలో మేడ్చల్లో నివసిస్తున్న ఒడిశాకు చెందిన ఇస్మాయిల్ సహకారంతో నగరంలో మనీల్ దలబెహరా సరఫరా చేశాడు. ఇస్మాయిల్ ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తూ.. గంజాయి విక్రయం నిర్వహిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైందని అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి 70 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నామని అన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

## చదువు

అక్షరం ఒక నదిలా
నా మనస్సు అనే మట్టిని
కొరుక్కుంటూ ప్రవహిస్తుంది
పుటల మధ్య నిలిచిన శూన్యం నుండి
జన్మించే ప్రశ్నలు, నా అంతరంగంలో
నడుస్తూ మాట్లాడతాయి

పుస్తకాలు కేవలం కాగితాల సమాధులు కావు
అవి కాలం మోసిన జ్ఞానపు
ప్రతిధ్వనుల ఫాసిల్స్
నా వేళ్లతో తాకిన ప్రతి పదం
ఇంకా పుట్టని భవిష్యత్తులను
తనలో కరిగిస్తుంది

నా కలంలో మళ్లీ జీవిస్తుంది చదివినది,
చదివిన భావాలలో నా రచన
కలలుగా మారుతుంది
జ్ఞానం ఒక ప్రవాహం
దాని అలలు కథలు చెబుతాయి
కానీ దాని మూలం ఎప్పుడూ
నా అనుభవంలోనే ఉంటుంది

అక్షరాలు మాయమైన గుర్తులు కావు,
అవి జీవన యాత్రలో దారి చూపే దీపాలు
వ్రాయడం అంటే ఒంటరితనాన్ని
భాషగా మలిచే ఒక రసవాదం.

చివరగా పుస్తకాలు మూసినప్పుడు,
నా లోపల కనిపించేది ఒక విశాల శూన్యం
అక్కడే అన్ని మాటలు కరిగిపోయి,
మిగిలినది కేవలం...
ఒక నిశ్శబ్దమైన సమాధానం.

**- డాక్టర్ నూకరాజు బెందుకుర్తి**
9493476437

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

# ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉద్యమం

విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి ఐదేళ్లు అయింది.

విశాఖ ఉక్కు-ఆంధ్రులహక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథంతోపాటు తాటి కొండ ఎమ్మెల్యే టి.అమృతరావు, ప్రత్తిశేషయ్య లాంటి నాయ కులు ఈ ఉద్యమంలో పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో 32 మంది ప్రాణాలర్పించారు.

26 వేలఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రూ.3897.28 కోట్ల అంచనాతో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది.

రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ కో సమగ్ర నివేదిక సమర్పిం చింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్థుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (RINL) ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ (SAIL) నుండి విడివడి RINL గా గుర్తింపు పొందినది.




వైజాగ్ స్టీల్‌గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్త య్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది.

1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది.

కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్‌లలోనే అతి పెద్దది.

సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్ప టికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిడ్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది.

టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించు కున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేక పోతున్నారు.

వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. 'విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు' అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా విని పిస్తోంది. వైజాగ్ స్టీల్‌ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ వైఎస్ఆర్సీపీతో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్‌ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఏసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగా రాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నా లను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.

నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధ ృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అయింది.

కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# అలుపెరుగని యోధుడు తరిమెల



తరిమెల నాగిరెడ్డి (ఫిబ్రవరి 11, 1917 - జులై 28, 1976) అవిభక్త ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. ఆయనను అందరూ టి.ఎన్ అని పిలిచేవారు. అనంతపురం జిల్లా తరిమెల గ్రామంలో ఫిబ్రవరి 11, 1917 న రైతు కుటుంబములో జన్మించారు.

పాఠశాల రోజుల నుండే సమాజం లోని అస మానతలకు వ్యతిరేకంగా తిరుగుబాటు లక్షణాలు కనబరిచారు. మద్రాసు లోని లయోలా కళాశాలలో ఇంటర్మీడియట్ చదివేరోజుల్లో తన జాతీయతా భావాల కారణంగా కళాశాల యాజమాన్యానికి, ఆచార్యులతో నాగిరెడ్డికి పొసగ లేదు.

లయోలా కళాశాల యాజమాన్యం నాగిరెడ్డికి జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగ ఉపన్యాసాలకు హాజరైనందుకూ, రామస్వామి ముదలియారుకు, సత్యమూర్తికి మధ్య జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నందుకు,వ్యాసరచనా పోటీలలో మహ మ్మద్ బిన్‌తుగ్లక్‌ను ప్రశంసించినందుకు, అనేకసార్లు జరిమానా విధించింది.

నాగిరెడ్డి లయోలా కళాశాల తరువాత వారణాసి, బెనారస్ హిందూ విశ్వ విద్యాలయంలో విద్య నభ్యసించారు. వారణాసిలో ఉన్న నాలుగే ళ్ళలో నాగిరెడ్డి కమలాదేవి ఛటోపాధ్యాయ, జయ ప్రకాశ్ నారాయణ్,అచ్యుత్ పట్వర్ధన్ వంటి వారిచే ప్రభావితు డయ్యారు. కమ్యూనిజం, మార్క్సిజంతో ఈయనకు వారణాసిలోనే పరిచయ మయ్యింది. రష్యన్ విప్లవం, స్టాలిన్ నాయకత్వం గురించి విస్తృతంగా చదివి, భారత దేశంలో కూడా మార్క్సి జాన్ని అమలు చేయవచ్చని నమ్మటం ప్రారంభించారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాల యం స్నాతకోత్సవంలో ఉపకులపతిని నిల దీశారు. మహాత్మాగాంధీకి అది తెలిసి తరిమెల నాగిరెడ్డి వైస్ ఛాన్సలర్‌కు క్షమాపణలు చెప్పాలని ఉత్తరం రాశారు. నాగిరెడ్డి అందుకు ఒప్పుకోలేదు. తిరస్కరించారు.

నాగిరెడ్డి తన ప్రభుత్వ వ్యతిరేక రాజకీయ కలాపాల వల్ల అనేకమార్లు జైలుకు వెళ్లారు. 1940లో రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో యుద్ధం, ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం అన్న పుస్తకం వ్రాసి ప్రభుత్వం యొక్క ఆగ్రహానికి గురై జైలుకు వెళ్ళారు. తిరుచిరాపల్లి జైలునుండి విడుదల కాగానే తిరిగి 1941లో భారతీయ రక్షణ చట్టము కింద అరెస్టయ్యారు. 1946లో ప్రకాశం ఆర్డినెన్సు కింద అరెస్టయ్యి 1947లో విడుదల చేయబడ్డారు.

1952లో నాగిరెడ్డి మద్రాసు శాసన సభకు సి.పి.ఐ అభ్యర్థిగా అనంతపురం నియోజక వర్గం నుండి ఎన్నికయ్యారు. జైలులో ఉండి కూడా, ప్రముఖ కాంగ్రెస్ కాంగ్రెస్ నాయకులు, తన బావ అయిన నీలం సంజీవరెడ్డిపై విజయం సాధించి సంచలనం సృష్టించిన ఘనత ఆయనకే దక్కింది. 1955లో కొత్తగా ఏర్పడిన పుట్లూరు నియోజక వర్గం నుంచి శాసనసభకు పోటీ చేసి తరిమెల రామచంద్రారెడ్డి చేతిలో ఓడిపోయారు. 1957లో అనంతపురం లోక్‌సభ నియోజక వర్గం నుండి 2వ లోక్సభకు ఎన్నికయ్యారు. తిరిగి 1962లో పుట్లూరు నియోజకవర్గం నుంచి ఆంధ్రప్రదేశ్ శాసనసభకు సి.పి.ఐ అభ్యర్థిగా పోటీచేసి తరిమెల రామచంద్రారెడ్డి ఓడించి ఎన్నికైనారు. 1967లో నియోజక వర్గాల పునర్విభజనలో పుట్లూరు నియో జకవర్గం రద్దుకాగా, సి.పి.ఐ(ఎం) అభ్యర్థిగా అనంత పురం నియోజకవర్గం నుండి మూడో సారి శాసనసభకు ఎన్నికయ్యారు. 1969లో మార్చిలో శాసనసభా సభ్యత్వానికి రాజీనామా చేశారు. నాగిరెడ్డి రచనలలో ముఖ్యమైనది ఇండియా మార్ట్‌గేజ్ (తాకట్టులో భారతదేశం).

1968లోనాగిరెడ్డి సి.పి.ఐ (ఎం) నుండి విడి పోయి ఆంధ్ర ప్రదేశ్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ కమ్యూనిస్ట్ రెవల్యూషనరీస్ (ఎ.పి.సి.సి.ఆర్) - ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వ య కమిటీని స్థాపించారు. సి.పి.ఐ (ఎం) కార్య కర్తలను కొత్తపార్టీలోకి ఆకర్షించడంలో సఫలం అయ్యారు. కొద్దికాలం ఎ.పి.సి.సి.ఆర్ అఖిల భారత కమ్యూనిస్టు ఉద్యమకారుల సమన్వయ కమిటీలో కలసివుంది. తరిమెల నాగిరెడ్డి 1976లో తను మరణించేదాకా ఎ.పి.సి.సి.ఆర్ నాయకునిగా కొనసాగారు. నాగిరెడ్డి 1976, జులై 28న మరణించారు.

**- ఆర్‌కేఎస్**
9440595494

# ప్రజాస్వామ్యానికి చిరునామా 'లింకన్'



ప్రజాస్వామ్యం నేడు ప్రపంచవ్యాప్తంగా ఒక కీలక మలుపులో నిలబడి ఉంది. రాజకీయధ్రువీకరణ,అధికారదుర్వినియోగం, ఈ సమస్యలు దేశ సరిహద్దులను దాటి ఒకే రూపంలో కనిపిస్తున్నాయి. ఇలాంటి వేళ చరిత్ర మనకు చూపించే దారి నైతిక నాయకత్వం. ఆ నాయకత్వానికి స్పష్టమైన ప్రతీక అబ్రహం లింకన్. ఆయన జీవితం ఒక దేశపు రాజకీయ కథ కాదు,ప్రజాస్వామ్యానికి మనస్సాక్షిగా నిలిచిన జీవన గాథ.

**పేదరికంలో పుట్టిన స్వతంత్ర ఆలోచన**

కెంటకీ రాష్ట్రంలోని పేద కుటుంబంలో లింకన్ జన్మించారు. చిన్న వయసులోనే శ్రమ, కొరత, బాధ్యతలు ఆయనను వెంటాడాయి. చదువు ఆయనకు సులభంగా లభించిన అవకాశం కాదు. అయినా చదవాలనే తపన ఆయనను వదల్లేదు. కిరోసిన్ దీపం వెలుగులో పుస్తకాలు చదవడం, పొలాల్లో పనిచేస్తూనే ఆలోచించడం ద్వారా ఆయన తన మనస్సును తీర్చిదిద్దుకున్నారు. ఈ స్వీయ విద్యే ఆయనలో స్వతంత్ర ఆలోచనను, లోతైన తర్కాన్ని పెంపొందించింది.

**ఓటముల నుంచి పుట్టిన సహనం**

రాజకీయ రంగంలోకి వచ్చినప్పుడు లింకన్కు విజయాలు వెంటనే దక్కలేదు. ఎన్నికల్లో పరాజయాలు, వ్యక్తిగత విషాదాలు ఆయన జీవన ప్రయాణాన్ని కఠినతరం చేశాయి. కానీ ఈ పరాజయాలు ఆయ నను నిరాశావాదిగా మార్చలేదు. ప్రజాస్వామ్యంలో ఓటమి కూడా ఒక పాఠమే అన్న నమ్మకం ఆయనను ముందుకు నడిపించింది. ఓడిపోయినా నిలబడగలగడమే ఆయన నాయకత్వానికి పునాది.

**నైతిక ప్రశ్నను జాతీయ చర్చగా మార్చిన ఘట్టం**

1858లో జరిగిన లింకన్-డగ్లస్ చర్చలు ఆయన జీవితంలో కీలక మలుపు. బానిసత్వం వంటి క్లిష్టమైన అంశాన్ని రాజకీయ సౌకర్యాల కంటే నైతిక ప్రశ్నగా ఆయన నిలబెట్టారు. ఆ ఎన్నికలో విజయం సాధించకపోయినా, దేశవ్యాప్తంగా ఒక ప్రశ్నను లేవనెత్తారు. నైతికత లేకుండా ప్రజాస్వామ్యం నిలబడగలదా? ఈ ప్రశ్నే ఆయనను జాతీయ నాయకుడిగా మార్చింది. అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరిం చిన సమయంలో అమెరికా తీవ్రమైన అంతర్గత సంఘర్షణలో ఉంది. సులభమైన రాజీలు అందుబాటులో ఉన్నప్పటికీ, లింకన్ వాటిని తిరస్కరించారు. ఆయన లక్ష్యం కేవలం యుద్ధాన్ని గెలవడం కాదు, దేశ ఆత్మను కాపాడటం. ఈ సందర్భంలో తీసుకున్న విముక్తి ప్రకటన ఆయన నాయకత్వంలోని నైతిక ధైర్యానికి శిఖర ఘట్టం.

**విముక్తి ప్రకటన**

విముక్తి ప్రకటన భావోద్వేగంతో తీసుకున్న నిర్ణయం కాదు. సరైన సమయాన్ని గుర్తించి తీసుకున్న ఒక స్పష్టమైన నైతిక చర్య. లక్షలాది బానిసలకు స్వేచ్ఛను ప్రకటించడం ద్వారా సమానత్వాన్ని రాజ్యాంగ విలువగా నిలిపారు. ఈ నిర్ణయం అమెరికా సరిహద్దులను దాటి, ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల ఉద్యమాలకు ప్రేరణగా మారింది. లింకన్ వ్యక్తిగత జీవితం కూడా బాధలతో నిండింది. తల్లి మరణం, కుటుంబ నష్టాలు ఆయనను కఠినుడిని చేయలేదు; మరింత మానవీయుడిని చేశాయి. ప్రజల బాధను తన బాధగా అనుభూతి చెందగల నాయకుడిగా ఆయనను మలిచాయి. రెండవ ప్రారంభ ప్రసంగంలో ఆయన పలికిన ఎవరి పట్ల ద్వేషం లేకుండా, అందరి పట్ల దయతో అనే మాటలు ప్రతీకార రాజకీయాలకు ప్రత్యామ్నా యంగా నిలిచాయి.

**ప్రజాస్వామ్యానికి శాశ్వత నిర్వచనం**

గెట్టీస్బర్గ్ ప్రసంగంలో లింకన్ ప్రజాస్వామ్యాన్ని ఒక పాలనా విధానంగా కాక, ఒక నైతిక బాధ్యతగా నిర్వచించారు. ప్రజల ప్రభుత్వం, ప్రజల ద్వారా, ప్రజల కోసం అనే భావన నేటికీ ప్రపంచ రాజకీయ ఆలోచనలకు పునాదిగా నిలుస్తోంది. లింకన్ హత్యతో ఒక జీవితం ముగిసింది. కానీ ఆయన ఆలోచనలు మరింత బలంగా నిలిచాయి. నైతికధైర్యం,సహనం,సమయోచిత నిర్ణయాల సమ్మేళ



నమే నిజమైన నాయకత్వమని ఆయన జీవితం మనకు గుర్తు చేస్తుంది. నాయకత్వం అనేది ఆదేశించడం కాదు, బాధ్యతను అనుభూతి చెందడం. ద్వేషం తక్షణ విజయం ఇవ్వవచ్చు,దయ మాత్రమే చరిత్రను నిలబెడుతుంది. అందుకే అబ్రహాం లింకన్ గతం కాదు,మన వర్తమానానికి అవసరమైన, భవిష్యత్తును దారి చూపించే ఒక శాశ్వత ప్రేరణ.

**- గిలకత్తుల వెంకటరమణ గౌడ్**
9866878769

# సైన్స్ అండ్ టెక్నాలజీ రంగాల్లో 'ఆమె'ను ప్రోత్సహించలేమా!



నేటి అత్యాధునిక డిజిటల్-ఏఐ యుగంలో యువత అవకాశాలకు హద్దులు లేకుండా పోతున్నాయి. సైన్స్, టెక్నాలజీ రంగాలు కొత్తపుంతలు తొక్కుతూ భూమిని కుగ్రామంగా మార్చివేశాయి. నేటివిద్యా వంతులు, వృత్తిపరమైన నిపుణులు, టెక్నో క్రాట్లు దినదినం నూతన ఆవిష్కరణలు, విలక్షణ ఆలో చనలతో సరి కొత్త ప్రపంచాన్ని రుచి చూపిస్తున్నారు. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో పురుషులు, కళాశాల యువకులు మాత్రమే అధికంగా ఉండడం, మహిళల సంఖ్య అతి తక్కువగా ఉండడంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో జరగ వలసిన ప్రగతి నమోదు కావడం లేదు. ప్రకృతిలో సగం అయిన మహిళాశక్తియుక్తులను కూడా ఈ రంగంలో వినియోగిస్తే సత్వర సత్ఫలితాలు వస్తాయని గమనించాలి. నేడు విద్యాలయాల్లో సైన్స్-టెక్నాలజీ విద్యను అభ్యసించే బాలికలు, యువతుల సంఖ్య చాలా తక్కువగా ఉంటున్నది. ఈ మధ్య కాలంలో సైన్స్ చదివే బాలికలు, యువతుల సంఖ్య కొంత వరకు పెరిగినా సాధించాల్సింది చాలా ఉందని గమనిస్తూ వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించడం అవసరం అని తెలుసుకోవాలి.

**సైన్స్-టెక్నాలజీలో 33-35 శాతం మాత్రమే మహిళలు**

ప్రపంచ తొలి మహిళా నోబెల్ పురస్కార గ్రహీత మేడమ్ క్యూరీ, రసాయనశాస్త్రంలో తొలి డాక్టరేట్ పొంది భారతీయ పరిశోధకురాలు అసిమా చటర్జీ లాంటి కొందరు మహిళలు సైన్స్ లోతులను చూసి తమ వంతు పరిశోధన ఫలితాలను ప్రపంచానికి అందించడం చూసాం. మేడమ్ క్యూరీ రెండు నోబెల్ బహుమతులను పొందిన ఏకైక మహిళగా చరిత్ర సృష్టించారు. సైన్స్ రంగంలో వెలుగొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని నేటి ప్రపంచ వనితలు సైన్స్ రంగాన్ని ఎంచుకొని మహోన్నత శిఖరాలను తాకే విధంగా తమ వైజ్ఞానిక పరిణతిని ప్రదర్శించాలనే సందేశం ఇవ్వడానికి, నేటి యువతులను సైన్స్ వైపు ఆకర్శించడానికి ఐరాస- యూనిసెఫ్ చొరవతో 2015 నుంచి ప్రతి ఏట సైన్స్లో మహిళలు, బాలికల అంత ర్జాతీయ దినోత్సవాన్ని పాటించడం కొనసాగుతున్నది. పాఠశాలలో బాలికలు, ఉపాధ్యాయులు, విద్యాలయ యాజమాన్యాలు,



తల్లితండ్రులు, పౌర సమాజం, శాస్త్ర సాంకేతిక శాస్త్రజ్ఞుల సంఘాలు, ప్రభుత్వాలు, సంబంధిత వర్గాలు ఐక్యతతో నడుంబించి బాలికలు/యువతుల దృష్టిని స్టెమ్- ఎస్టిఈఎం- సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ అండ్ మ్యాథమాటిక్స్ రంగాల వైపు మరల్చే ప్రయత్నాలు చురుకుగా చేయడం ద్వారా మరింత వేగంగా వైజ్ఞానిక పరిశోధన ప్రగతి నమోదు అవుతుందని ప్రచారం చేయడం జరగాలి. నేడు 33 శాస్త్రం మహిళా శాస్త్రజ్ఞులు, 35 శాతం యువతులు స్టెమ్ రంగంలో కొనసాగుతున్నారని, దీనిని 50 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని పురుషాధిక్య సమాజం బేషరతుగా ఒప్పుకోవాలి.

**సైన్స్-టెక్నాలజీ రంగంలో 'ఆమె' నైపుణ్యం**

సైన్స్-టెక్నాలజీ (స్టెమ్) రంగంలో లింగ సమానత్వ సాధన సాకారం కావడానికి కావలసిన ప్రచారం, తగు ప్రోత్సాహం ఇవ్వడానికి ప్రతి ఏట11 ఫిబ్రవరిన సైన్స్లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం నిర్వహిస్తున్నారు.

2026 నిర్వహిస్తున్న 'సైన్స్‌లో మహిళలు, బాలికల అంతర్జాతీయ దినం' ఇతివృత్తంగా సైన్స్-టెక్నాలజీ రంగా తలుపులు తెరిచి ప్రణాళికలు ప్రభావం చూపడం...స్టెమ్‌విద్యలో లింగ అసమా నతల తగ్గింపు అనే అంశాన్ని తీసుకొని పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తున్నారు. 1901 నుంచి 2024 వరకు 1,012 మంది శాస్త్రజ్ఞులు నోబెల్ బహుమతులను పొందగా, అందులో 64 మంది మాత్రమే మహిళా శాస్త్రవేత్తలు ఉండడం విచారకరం. ఇప్పటి వరకు సైన్స్ రంగాల్లో 976 (28 సంస్థలు అదనం) మంది సైంటిస్టులు నోబెల్ బహుమతులు పొందగా, అందులో 25 మంది మాత్రమే మహిళలు ఉండడం గమనార్హం.

మెడిసిన్ రంగ నోబెల్ బహుమతుల్లో 5.6 శాతం, రసాయన శాస్త్రంలో 4.1 శాతం భౌతికశాస్త్రంలో 1.8 శాతం మహిళలు మాత్రమే ఉండడం సోచనీయం. ఈ గణాంకాలు మన ప్రస్తుత పురుష సమాజ కర్తవ్యాన్ని వేలెత్తి చూపుతున్నాయి.

నేటి పౌర సమాజం, ముఖ్యంగా పురుష పుంగవులు తగిన చొరవను చూపుతూ బాలికలను, యువతులను స్టెమ్ రంగాల వైపు ఆకర్షించడం జరగాలి. 'మహిళలకు సైన్స్ అవసరం' కన్న 'సైన్స్‌కు మహిళలు అవసరం' అనే నినాదాన్ని నిజం చేయాలి. సైన్స్-టెక్నాలజీ రంగం మహిళలకు తగినది కాదనే దురభిప్రాయాన్ని చెరి పేసి, చిన్న ప్రయోగశాల నుంచి అనంత అంతరిక్షం వరకు మహిళలు ఎదగడం చూద్దాం.

సైన్స్-టెక్నాలజీ రంగాలకు మహిళలను ఆకర్షిస్తూ, తగు స్కాలర్‌షిప్స్ అందిస్తూ, మహిళా వైజ్ఞానిక శాస్త్రవేత్తల ప్రగతిని గుర్తిస్తూ ముందుకు సాగుదాం. సైన్స్-టెక్నాలజీ రంగాల్లో 'ఆమె' మేధో సంపత్తిని పెట్టుబడిగా పెడదాం.

**- డా. బుర్ర మధుసూదన్ రెడ్డి**
9949700037

# ముగిసిన మున్సిపల్ పోల్

- బాక్సుల్లో బ్యాలెట్ భద్రం
- కౌటింగ్ వరకు ఉత్కంఠ
- అభ్యర్థుల్లో టెన్షన్



రాజన్న సిరిసిల్ల,ఫిబ్రవరి11(మనం ప్రతినిధి)ః సిరిసిల్ల జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్బుధవారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లావ్యాప్తంగా పోలింగ్ 77.70 శాతం నమోదు అయిందనిఅధికారులు పేర్కొన్నారు. ప్రశాంతంగా ముగిసిన మున్సిపల్ పోల్ తో అధికారులు బ్యాలెట్ పేపర్లను బాక్సుల్లో భద్రపరచడంతో కౌటింగ్ వరకు ఉత్కంఠ నెలకొనగాతమ భవితవ్యం ఎలా ఉంటుందో ననిఅభ్యర్థుల్లో టెన్షన్ మొ దలయింది. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల్లో కలిపి మొత్తం పోలింగ్ 77.70 శాతం నమోదు అయినట్లు ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ తెలిపారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలో 39,942 మంది పురుషులు, 42,011 మంది మహిళా ఓటర్లు, 06 ఇతర ఓటర్లు ఉండగా, 30, 466 పురుషులు, 33,091 మహిళలు, ఇతరులు 05 మొత్తం 63,562 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 77.55 పోలింగ్ శాతం నమోదు అయింది. అలాగే వేములవాడ మున్సిపల్ పరిధిలో 19,580 మంది పురుషులు, 21,279 మంది మహిళా ఓటర్లు, 18 ఇతర ఓటర్లు ఉండగా, 14,801 పురుషులు, 17,070 మహిళలు, ఇతరులు 10 మంది మొత్తం 31,881 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. పోలింగ్ శాతం 77.99 నమోదు అయింది. జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో కలిపి 1,22,836 మంది ఓటర్లు ఉండగా, 95,443 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా మొత్తం పోలింగ్ శాతం 77.70 నమోదు అయింది. సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కుసుమ రామయ్య ఉన్నత పాఠశాల అలాగే సిరిసిల్ల గీతా నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను, ఓటింగ్ సరళిని సందర్శించి.. అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో .. అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ ,తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ తదితరులు పాల్గొన్నారు.

# ఓట్ల లెక్కింపు కేంద్రాలను సందర్శించిన జాయింట్ డైరెక్టర్




గోదావరిఖని, ఫిబ్రవరి 11 (మనం న్యూస్)ః జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మునిసిపల్ ఎన్నికల పర్యవేక్షణ అధికారి, పురపాలక పరిపాలనా శాఖ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి బుధవారం రామగుండంను సౌదర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె అరుణశ్రీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రామగుండం నగర పాలక సంస్థ చేసిన ఏర్పాట్లను జాయింట్ డైరెక్టర్ కు వివరించారు. ఎలక్షన్ మెటీరియల్ రిసెప్షన్ కౌంటర్ తో పాటు ఎన్టిపిసి టౌన్ షిప్ లోని సెయింట్ కేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రా, ఓట్ల లెక్కింపు కేంద్రమైన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను జాయింట్ డైరెక్టర్ సందర్శించారు. నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పివి రామన్, ఎసిపి శ్రీహరి, టిపి ఎస్ నవీన్ తదితరులున్నారు.

# కార్పొరేషన్ ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



గోదావరిఖని, ఫిబ్రవరి 11 (మనం న్యూస్)ః జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో రామగుండం కార్పొరేషన్ పరిధిలో జ్యోతి నగర్ టిటిఎస్ జడ్.పి.హెచ్.ఎస్, పిటిఎస్ ఎన్టిపిసి ఎస్.టి క్లెయిర్స్, గౌతమ్ నగర్ లోని ప్రగతి పాఠశాల, రాంనగర్ లోని హాట్ హై స్కూల్, అమరావతి హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ. మున్సిపల్ ఎన్నికల్లో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మధ్యాహ్నం మూడు గంటల వరకు లక్షా 01 వేయి 470 మంది (56.49) శాతం తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ఉదయం 9 గంటల వరకు 9.5 శాతం, 11 గంటలకు 24.31శాతం, 1 గంట వరకు 42.12శాతం పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పిస్తామని అన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్ లను పటిష్ఠ భద్రతతో స్ట్రాంగ్ రూంకు తరలించే విధంగా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట రామగుండం తహసిల్దార్ ఈశ్వర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మంథని మున్సిపాలిటీలో ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

- నమోదైన 76.76 శాతం పోలింగ్



మంథని, ఫిబ్రవరి11 (మనంన్యూస్)ః మంథని మున్సిపాలిటీ ఎన్నికల్లో 13 వార్డులలో ఏకంగా 76.76 శాతం పోలింగ్ నమోదయింది. ఉదయం 7గంటల నుంచి నుంచి ఓటర్లు క్యూ లైన్ లో బారులు తీరారు.మధ్యాహ్నం వరకు ఏర్పాటుచేసిన అన్ని పోలింగ్ కేంద్రాలలో జోరుగా పోలింగ్ జరిగింది. మంథని పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను మంథని ఆర్డీవో సురేష్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.పలు వార్డుల్లో చెదురు ముదురు సంఘటనలు మినహా పోలింగ్ మొత్తం ప్రశాంతంగా ముగిసింది.మంథని జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రంలో అభ్యర్థి,ఏజెంట్ కాకుండా ఇతరులు మొబైల్ పట్టుకొని తిరగడం పట్ల అభ్యర్థులు సింగారపు కిష్టయ్య,రాజు గౌడ్ లు అభ్యంతరం వ్యక్తం చేయగా,ఆ సదరు వ్యక్తిని అధికారులు కేంద్రం నుండి బయటికి పంపారు.మంథని పట్టణంలోని13 వార్డుల్లో 14,402 మంది ఓటర్ల గాను 10,007 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మొత్తంగా 76.76 శాతం ఓటింగ్ నమోదు అయింది.పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి,గోదావరిఖని ఏసిపి రమేష్ పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేశారు.మొత్తానికి పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.ఎవరు గెలిచారో..ఎవరు ఓడారో తెలియాలంటే శుక్రవారం13 వరకు వేచి చూడాలి.13 వార్డులో అభ్యర్థులు ఎవరి గెలుపు పై వారు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్




- పోలింగ్ సరళి సందర్శన

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 11(మనం ప్రతినిధి)ః మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని మోడల్ పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసిన కుసుమ రామయ్య ఉన్నత పాఠశాల అలాగే సిరిసిల్ల గీతా నగర్ లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, మున్సిపల్ పరిధిలోని ఇప్పలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను, ఓటింగ్ సరళిని సందర్శించి.. అధికారులతో మాట్లాడారు. అనంతరం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కోనాయిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో .. అలాగే 20 వ వార్డు పరిధిలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. వేములవాడ లోని సినారె కళామందిరంలో రిసెప్షన్ కేంద్రం, కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం గాంధీ నగర్ లోని గ్రీన్ పోలింగ్ కేంద్రంలో పరిశీలించారు. పరిశీలనలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, రాధాభాయ్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్ ,తహసీల్దార్లు మహేష్ కుమార్, జయంత్ కుమార్, టీపీఓ అన్సార్ పాల్గొన్నారు.

# ప్రజాక్షేత్రంలోకి దూసుకెళ్తున్న బిసివైపార్టీ



- పార్టీ పదవుల మూడో జాబితా విడుదల

మంగళగిరి, ఫిబ్రవరి 11, మనం న్యూస్: బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికార సాధనే లక్ష్యంగా, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా భారతచైతన్య యువజన పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ మరో ముందడుగు వేశారు. పార్టీ పదవుల నియామకాలకు సంబంధించి, ఆయన బుధవారం నాడు మూడో జాబితాను విడుదల చేశారు. మూడో జాబితాలో భాగంగా స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ నుంచి నియోజకవర్గ ఇన్ చార్జ్ వరకు అనేక పదువులకు నాయకులను నియమించారు, ప్రధానంగా నెల్లూరు, అల్లూరి సీతారామరాజు, తిరుపతి జిల్లాలకు సంబంధించి వివిధ స్థాయిలలో పలువురు నాయకులను కీలక పదవులలో నియమించారు. జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి కమిటీలతో పాటు, వివిధ అనుబంధ సంఘాలలో నూతన నాయకులకు బాధ్యతలు అప్పగించారు.నూతనంగా నియమితులైన నాయకులందరూ, పార్టీ ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలని, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడుతూ, ప్రజల పక్షాన నిలబడాలని రామచంద్రయాదవ్ పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మరిన్ని నియామకాలతో పార్టీని మరింత పటిష్టం చేసి, ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఆయన ప్రకటించారు.

# ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్న పోలింగ్




- పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి

మంథని,ఫిబ్రవరి11(మనంన్యూస్)ః పెద్దపల్లి జిల్లాలో మంథని మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. మంథని పోలీస్ స్టేషన్ పరిధిలోనీ పోలింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు డీసీపీ వివిధ పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు,పోలింగ్ సిబ్బంది విధులు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై డీసీపీ అధికారులతో సమీక్షించారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీసీపీపిలుపునిచ్చారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. పోలింగ్,బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ చేరే వరకు ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని,భద్రతా చర్యలు కొనసాగుతాయని, శాంతియుత ఎన్నికల నిర్వహణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీసీపీ స్పష్టం చేశారు. డీసీపీ వెంట గోదావరిఖని ఏసిపి ఎం.రమేష్,మంథని సర్కిల్ ఇన్స్పెక్టర్ బి. రాజు,ఎస్ఐలు డి. రమేష్,సాగర్,సిబ్బంది ఉన్నారు.

# కల్పవృక్ష వాహనంపై శ్రీ రాజమన్నార్ అలంకారంలో శ్రీనివాసుడి రాజసం



తిరుపతి,ఫిబ్రవరి 11,మనం న్యూస్ః శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు శ్రీ రాజమన్నార్ అలంకారంలో దర్శమిచ్చారు. శ్రీవారు చిలుకతో కూడిన దండం, ఆవు దూడ, లక్ష్మీ హారము, మకర కంఠి, స్వర్ణ యజ్ఞోపవీతం, కల్కితురాయి, సూర్యచంద్రులతో కూడిన కిరీటం, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లు గజలక్ష్మి, మామిడి పిందుల హారం, కమల, లంబ హస్తలతో భక్తులను కటాక్షించారు. ఉదయం 8 నుండి 9 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

**కల్పవృక్ష వాహనం – ఐహిక ఫల ప్రాప్తి :**

క్షీరసాగరమథనంలో విలువైన వస్తువులెన్నో ఉద్భవించాయి. వాటిలో కల్పవృక్షం ఒకటి. ఈ చెట్టు నీడన చేరిన వారికి ఆకలిదప్పులుండవు. పూర్వజన్మస్మరణ కూడా కలుగుతుంది. ఇతర వృక్షాలు తాము కాచిన ఫలాలు మాత్రమే ప్రసాదిస్తాయి. అలాకాక కల్పవృక్షం కోరుకున్న ఫలాలన్నింటినీ ప్రసాదిస్తుంది. అటువంటి కల్పవృక్ష వాహనాన్ని అధిరోహించి నాలుగో రోజు ఉదయం తిరుమాడ వీధులలో భక్తులకు తనివితీరా దర్శనమిస్తాడు శ్రీనివాసుడు. కాగా సాయంత్రం 5 నుండి 6 గంటల వరకు ఊంజల్సేవ వైభవంగా జరగనుంది. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు సర్వభూపాలవాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ వాహనసేవలో ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రమేష్, కంకణభట్టార్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# మకర వాహనంపై సోమస్కందమూర్తి సమేత కామాక్షి అమ్మవారు

తిరుపతి,ఫిబ్రవరి 11, మనం న్యూస్ః తిరుపతిలోని శ్రీ కపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాల్లో నాలుగో రోజైన బుధవారం ఉదయం శ్రీ కపిలేశ్వరస్వామివారు సోమస్కం దమూర్తిగా కామాక్షి అమ్మవారి సమేతంగా మకర వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. భజన మండళ్ల కోలాటాలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో వాహనసేవ కోలాహలంగా జరిగింది. మకరం గంగాదేవికి నిత్యవాహనం. భగవంతుని ఆశ్రయించినంత వరకు జీవుడు నీటిలో మొసలిలా బలపరాక్రమంతో జీవిం చవచ్చు. అనంతరం ఉదయం 9 నుండి 10 గంటల వరకు అర్చకులు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శ్రీ సోమస్కందమూర్తి, శ్రీ కామాక్షిదేవి అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, పండ్లరసాలు, చందనంతో అభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ కె.పి.చంద్రశేఖర్ , టెంపుల్ ఇన్స్పెక్టర్లు దామోదర్, రవికుమార్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# చిన్నపిల్లల ఆసుపత్రిని పరిశీలించిన టిటిడి జేఈవో



తిరుపతి(టిటిడి), ఫిబ్రవరి 11,మనం న్యూస్: తిరుపతిలో నిర్మాణంలో ఉన్న శ్రీపద్మావతీ చిన్నపిల్లల ఆసుపత్రి నూతన భవనాన్ని టిటిడి జేఈవో (వైద్యం విద్య) డా. ఎ. శరత్ పరిశీలించారు. టిటిడి సాంకేతిక సలహాదారు ఆర్. కొండలరావుతో కలిసి నిర్మాణంలోని భవనాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జేఈవో డా. శరత్ మాట్లాడుతూ, చిల్డ్రన్స్ ఆసుపత్రి నూతన భవనాన్ని నిర్దిష్ట సమయాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా జరుగుతుండడంపై ఆయన సంబంధించిన అధికారులను ప్రశ్నించారు. టిటిడి ఇంజనీరింగ్ టెక్నికల్ అడ్వైజర్ సూచనల మేరకు పనులు వేగవంతం చేయాలని సూచించారు.ఆసుపత్రి పరిసరాలు చుట్టూ పచ్చదనం, ఆసుపత్రి లోపల ధైవభక్తి, మనోధైర్యం నింపేలా దేవాతామూర్తుల ఫోటోలను, నిత్యం పర్యవేక్షించేలా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రి భవనానికి అవసరమైన ఎలక్ట్రికల్ తదితర మౌళిక సదుపాయాల పరికరాల ఎంపికలో మరింత నాణ్యమైన వస్తువులను ఉపయోగించాలని కోరారు. నూతన భవనానికి సంబంధించి జరుగుతున్న పనులపై ఆసుపత్రి ముందు శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఈ టి.వి. సత్యనారాయణ, ఆసుపత్రి డైరెక్టర్ డా. ఎన్. శ్రీనాథ్ రెడ్డి, ఆర్ ఎంవో డాక్టర్ భరత్, ఎస్ ఈలు వేంకటేశ్వర్లు, మనోహరం తదితర అధికారులు పాల్గొన్నారు.

# తిరుపతి జిల్లాలో పర్యాటకానికి మరో అడుగు

- జిల్లా కలెక్టర్ డాక్టర్. ఎస్ వెంకటేశ్వర్



తిరుపతి, ఫిబ్రవరి 11మనం న్యూస్: తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎస్.వి.పురం గ్రామ పరిధిలో పర్యాటక రంగ అభివృద్ధికి మరో కీలక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టబడింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పర్యాటక ప్రోత్సాహక విధానాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం నేపథ్యంలో ఒడిశాకు చెందిన ఎం/ఎస్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్పీ సంస్థ ఆధ్వర్యంలో సుమారు 12.70 ఎకరాల్లో 5 స్టార్ డీలక్స్ రిసార్ట్ నిర్మాణం చేపడుతున్నారు. సుమారు రూ.150 నుండి రూ.200 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ రిసార్ట్లో డీలక్స్ గదులు, సూట్స్, కాటేజీలు, విల్లాలు కలిపి మొత్తం 149 గదులు ఏర్పాటు చేయనున్నారు. ఆల్డే డైనింగ్, స్పెషాలిటీ రెస్టారెంట్లు, బ్యాంక్వెట్ కాన్ఫరెన్స్ హాళ్లు, స్పా వెల్నెస్ సదుపాయాలు, ఇండోర్ మరియు అవుట్డోర్ వినోద కార్యకలాపాలు వంటి ఆధునిక వసతులు అందుబాటులోకి రానున్నాయి. ఈ రిసార్ట్ నిర్మాణం ద్వారా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. అవసరమైన అన్ని అనుమతులు సమన్వయంతో అందించి ప్రాజెక్టు పనులను త్వరితగతిన ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా జిల్లాను రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి శ్రీ ప్రదీప్త కుమార్ మొహపాత్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పర్యాటక విధానాలు మరియు పెట్టుబడులకు అనుకూల వాతావరణం తమ సంస్థను ఆకర్షించాయని తెలిపారు. విశాఖపట్నంలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్న తరువాత తిరుపతిలో ఈ ప్రాజెక్టును చేపట్టామని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల్లో రిసార్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. విదేశీ పర్యాటకులను ఆకర్షించడంతో పాటు స్థానికంగా ఉపాధి అవకాశాలు కల్పించి ప్రాంతీయ ఆర్థికాభివృద్ధికి తోడ్పడతామని చెప్పారు. ప్రాజెక్ట్ అమలుకు జిల్లా యంత్రాంగం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టూరిజం రీజినల్ డైరెక్టర్, తిరుపతి హబ్, డా. ఆర్. రమణ ప్రసాద్, జిల్లా పర్యాటక సాంస్కృతిక శాఖ అధికారి శ్రీ ఎం. జనార్దన్ రెడ్డి, ఎం/ఎస్ బెంగాల్ అల్టిమేట్ రిసార్ట్స్ ఎల్ఎల్పీ సంస్థ ప్రతినిధులు మరియు సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# 3 మున్సిపాలిటీల్లో ప్రశాంతంగా పోలింగ్



- 77.64 శాతం నమోదు
- నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

ఉమ్మడి మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 11 (మనం బ్యూరో): నాగర్ కర్నూల్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ శాంతియుతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బాదావత్ సంతోష్ తెలిపారు. బుధవారం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకే పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగిందన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలింగ్ సజావుగా సాగినట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్ నుండి కూడా ఆయా పోలింగ్ కేంద్రాలలో వెబ్ క్యాస్టింగ్ ద్వారా ఓటింగ్ తీరును ఎప్పటికప్పుడు పరిశీలించారు. స్థానిక పరిస్థితులను ఎన్నికల పరిశీలకురాలు రాజ్యలక్ష్మి అదనపు కలెక్టర్ దేవ సహాయంలతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఓటింగ్ ఎన్నికల నియమావాలిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జిల్లాలోని నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీల్లో పరిధిలోనూ ఓటింగ్ నిర్వహణ కోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. మూడు మున్సిపాలిటీల 65 వార్డులకు జరిగిన ఎన్నికలకు 131 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా, భారీగా ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎక్కడికక్కడ ఓటింగ్ ఆవశ్యకతను వివరిస్తూ వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ఫొటోలతో కూడిన ఓటరు స్లిప్పులను పంపిణీ చేయడం జరిగింది. బీ.ఎల్.ఓలతో హెల్ప్ డెస్క్ లను ఏర్పాటు చేసి ఓటర్లకు వారి ఓటు ఏ పోలింగ్ కేంద్రం పరిధిలో ఉంది అనే విషయాన్ని తెలియజేసేలా చర్యలు తీసుకోవడంతో ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటరు ఐ.డీ కార్డు లేని పక్షంలో ఎన్నికల సంఘం ధృవీకరించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని విస్తృత ప్రచారం చేయడం సత్ఫలితాలు ఇచ్చిందని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో నిర్ణీత సమయం అయినా సాయంత్రం 5 గంటకు పోలింగ్ ముగిసినప్పటికీ, అప్పటికే లైన్లో ఉన్న ఓటర్లకు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఇందుకోసం గేట్లు మూసి, క్యూలైన్లో ఉన్న ప్రతి ఓటరు ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగించామని వివరించారు. పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఓటింగ్ ప్రక్రియ సజావుగా కొనసాగిందన్నారు. ప్రశాంత వాతావరణంలో ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారని కలెక్టర్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వెబ్ క్యాస్టింగ్ జరిపించామని, మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ తీరును నిశితంగా పరిశీలన చేశారన్నారు. నిర్ణీత సమయం లోపు క్యూ లైన్లలో నిలుచున్న వారికి కూడా ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా ఓటు వేసే అవకాశం కల్పించామన్నారు. ఈ నెల 13న. ఉదయం 8.00 గంటల నుండి కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఓట్ల లెక్కింపును చేపట్టి ఫలితాలను వెల్లడించేలా విస్తృత చర్యలు చేపట్టామని కలెక్టర్ పేర్కొన్నారు. కౌంటింగ్ సందర్భంగా ఏ చిన్న తప్పిదానికి సైతం తావులేకుండా జాగ్రత్తగా ఓట్ల లెక్కింపు జరపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలింగ్ ప్రక్రియ మొత్తం శాంతియుతంగా ముగిసేలా జిల్లా యంత్రాంగం ముందస్తుగా సమన్వయంతో చర్యలు చేపట్టిందని కలెక్టర్ తెలిపారు. అలాగే ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి గొడవలు, అపోహలు తలెత్తకుండా పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి తగిన భద్రతా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ శాతం 77.64, శాతం నమోదు. 3 మున్సిపాలిటీల్లో 40028 పురుషులకు గాను 31046 మంది పురుషులు ఓటు హక్కును వినియోగించుకున్నారు, 40728 మంది మహిళా ఓటర్లకు గాను 31657 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకోగా, మొత్తం 80757 మంది ఓటర్లకు గాను, 62703మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపాలిటీల వారిగా ఓటర్లు.. నమోదు అయిన పోలింగ్ శాతం.. నాగర్ కర్నూల్ మున్సిపాలిటీలో పురుషులు 17460 మంది ఓటర్లకు గాను12906 మంది పురుషులు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, 17918 మహిళా ఓటర్లకు గాను 13265 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 35378, మంది ఉండగా, 26171, మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 73.98, శాతం నమోదు అయింది. కల్వకుర్తి మున్సిపాలిటీలో పురుషులు 12975 మంది ఓటర్లకు గాను10444 మంది పురుషులు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, 13048 మంది మహిళా ఓటర్లకు గాను10538 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 26023, మంది ఉండగా, 21027, మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.80, శాతం నమోదు అయింది. కొల్లాపూర్ మున్సిపాలిటీలో పురుషులు 9593 మంది ఓటర్లకు గాను7696 మంది పురుషులు ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోగా, 9763 మహిళా ఓటర్లకు గాను 7809 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం ఓటర్లు 19356, మంది ఓటర్లు ఉండగా, 15505, మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 80.10, శాతం నమోదైయింది. నాగర్ కర్నూలు జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు . ఓటింగ్ సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను సీల్ చేసి, పోలీసు బందోబస్తు మధ్యన స్ట్రాంగ్ రూమ్ లకు తరలించారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



- ఉదయం 11 గంటల వరకు 30.67 శాతం పోలింగ్ నమోదు

సంగారెడ్డి, ఫిబ్రవరి 11 మనంప్రతినిధిః సంగారెడ్డి మున్సిపాలిటీలోని 31వ వార్డు పరిధిలో విద్యానగర్లోని సెయింట్ ఆంథోనీ స్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ పి. ప్రావీణ్య సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటర్ జాబితా, ఓటర్ కంపార్ట్మెంట్, బ్యాలెట్ బాక్స్ తదితర ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ కేంద్రం లోపల, బయట భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో కల్పించిన సదుపాయాలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఓటర్లను ఓటు వేయడానికి అనుమతించే ముందు ఎలాంటి గుర్తింపు పత్రాలు పరిశీలిస్తున్నారని పోలింగ్ సిబ్బందిని ప్రశ్నించగా, ఓటర్ ఐడి కార్డు, ఆధార్ కార్డు వంటి గుర్తింపు పత్రాలను పరిశీలించి అనుమతి స్తున్నట్లు వారు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని పదకొండు మున్సిపాలిటీలలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగు తున్నాయని తెలిపారు. ఉదయం 11 గంటల వరకు జిల్లావ్యాప్తంగా 30.67 శాతం పోలింగ్ నమోదైందని వెల్లడించారు.పోలింగ్ సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని, అర్హులైన ఓటర్లు ఎటువంటి భయాందోళనలు లేకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియో గించుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ కంట్రోల్ రూమ్ను నుండి వెబ్కాస్టింగ్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న పోలింగ్ తీరుతెన్నులను పరిశీలించారు. పోలింగ్ ముగిసే వరకు నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని అడిషనల్ కలెక్టర్ పాండు కు సూచించారు.

## శ్రీశైలానికి వచ్చే భక్తులకు మెరుగైన ఏర్పాట్లు

- దర్శనానికి వచ్చే భక్తులు సంయమనం పాటించాలి
- జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి గణియా



శ్రీశైలం/నంద్యాల, ఫిబ్రవరి 11 మనం న్యూస్ః శ్రీశైల బ్రహ్మోత్సవాల సందర్భంగా క్షేత్రానికి వచ్చే భక్తుల కోసం పూర్తి స్థాయి ఏర్పాట్లు చేపట్టామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి తెలిపారు. బుధవారం శ్రీశైలం కమాండ్ కంట్రోల్ రూంలో జిల్లా ఎస్పీ సునీల్ షొరాణ్‌తో కలిసి నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల దృష్ట్యా జిల్లా యంత్రాంగం సమన్వయంతో దేవాదాయ, అటవీ, పోలీసు, రెవెన్యూ తదితర శాఖలు సమగ్ర చర్యలు చేపట్టాయని తెలిపారు. ఈ ఏడాది కాలినడకన వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. నిన్న ఒక్కరోజే స్వామి, అమ్మవార్లను సుమారు 71 వేల మంది భక్తులు దర్శించుకున్నారని పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం స్పర్శ దర్శనం, అలంకార దర్శనం కోసం వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్పర్శ దర్శనానికి కొంత సమయం ఎక్కువగా, అలంకార దర్శనం తక్కువ సమయంలో పూర్తవుతుందని చెప్పారు. అధిక రద్దీ కారణంగా దర్శనానికి సుమారు నాలుగు గంటల సమయం పట్టే అవకాశం ఉన్నందున భక్తులు సహనంతో వ్యవహరించాలని సూచించారు. శ్రీశైలం క్షేత్రానికి వచ్చే ప్రతి భక్తుడు ఆధ్యాత్మిక భావనతో దర్శనానికి వస్తారని, అదే భక్తి భావాన్ని దర్శనం పూర్తయ్యే వరకు కొనసాగించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. అలాగే క్షేత్ర పరిశుభ్రతను కాపాడేందుకు భక్తులు ఉపయోగించిన ఆహార పదార్ధాల అవశేషాలు, ప్లాస్టిక్ వస్తువులను తప్పనిసరిగా డస్ట్బిన్లో వేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ఉన్నతాధికారుల సహకారంతో బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

రవాణా సౌకర్యం కోసం అదనంగా 460 బస్సులు నడుపుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని ఇతర శైవ క్షేత్రాల్లో కూడా ఇదే తరహా ఏర్పాట్లు చేపట్టామని, మహానంది క్షేత్రంలో శివరాత్రి సందర్భంగా సుమారు 30 వేల మంది భక్తులు దర్శించుకునే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.

## ప్రశాంతంగా పోలింగ్

- జిల్లా కలెక్టర్ కె హైమావతి



గజ్వేల్, ఫిబ్రవరి 11 మనం న్యూస్ః గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీకి సంబంధించిన మునిసిపల్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని హైమావతి తెలిపారు. బుధవారం నాడు జరిగిన మున్సిపల్ ఎన్నికల సందర్భంగా కలెక్టర్ గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ లోని మహతి విద్యనికేతన్, హై స్కూల్, బి ఎం ఆర్ డిగ్రీ కళాశాల,మైనారిటీ వెల్ఫేర్ కంప్యూటర్ సెంటర్ మరియు సెట్విన్ శిక్షణ సంస్థ,ప్రాథమిక పాఠశాల హరిజనవాడ లోనీ పోలింగ్ స్టేషన్ లలో ఓటింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా హైమావతి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని దుబ్బాక, గజ్వేల్, చేర్యాల,హుస్నాబాద్ మున్సిపాలిటీలలో 72 వార్డులలో 176 పోలింగ్ కేంద్రం లలో ఓటింగ్ సరళి ప్రశాంత వాతావరణం సజావుగా సాగుతుందని తెలిపారు. సాయంత్రం 5 లోపల పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకునే అనుమతి కల్పించాలని 5 దాటక గేట్ లు మూసివేయాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ఓటింగ్ సరళి ముగిసిన తర్వాత స్టేట్ ఎలక్షన్ కమిషన్ నియమావళి ప్రకారం ప్రతిదీ పరిశీలించిన అనంతరం బ్యాలెట్ బాక్స్ సీల్ వేసి రూట్ ఆఫీసర్ ద్వారా పోలీస్ ఎస్కార్ట్ ద్వారానే రిసెప్షన్ సెంటర్ కి వెళ్ళాలని తెలిపారు. రిసెప్షన్ సెంటర్ లో అన్ని అరేంజ్మెంట్ లు చూసుకుని బ్యాలెట్ బాక్స్ లను స్ట్రాంగ్ రూమ్ లో భద్రపరచాలని తెలిపారు. పోలింగ్ సిబ్బంది అందరికీ రాత్రి భోజన సదుపాయాల్లో ఎలాంటి లోటు రాకుండ చూసుకోవాలని అలాగే వారు వారి స్వగృహాలకు వెళ్లడానికి ఆయా రూట్ ల వారిగా బస్సు సౌకర్యం అందించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చంద్రకళ, మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్, తహసిల్దార్ శ్రావణ్, పోలీస్ తదితరులు ఉన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి కాలర్ పట్టిన సీఐ



సంగారెడ్డి ఫిబ్రవరి 11 మనం ప్రతినిధి : సంగారెడ్డి మున్సిపాలిటీలో పోలీసులకు మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కి పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. సంగారెడ్డి మున్సిపాలిటీ 34వ కాంగ్రెస్ అభ్యర్థి అడ్డు ను సీఐ కాలర్ పట్టి పోలింగ్ బూత్ నుండి తోసి వేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది విషయం తెలుసుకున్న జగ్గారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పోలింగ్ బూత్ ను ఆపు వేస్తానంటూ జగ్గారెడ్డి తన అనుచరులతో పోలింగ్ బూత్ లోకి చర్చ్ కొని రావడంతో పోలీసులకు కాంగ్రెస్ పార్టీ శ్రేణుల మధ్య తీవ్ర విద్యుత్తు వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ శ్రేణులను జగ్గారెడ్డిని పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసి అక్కడి నుండి పంపించే ప్రయత్నం చేశారు.

## గుమ్మనూరు జయరాంను విమర్శించే అర్హత వైసీపీ నాయకులు లేదు



- టీడీపీ మండలాధ్యక్షులు ఎస్ఎం గోపాల్ రెడ్డి

మంత్రాలయ , ఫిబ్రవరి 11,మనం న్యూస్ః గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ను విమర్శించే అర్హత మంత్రాలయం వైసీపీ నాయకులకు లేదని మంత్రాలయం టీడీపీ మండలాధ్యక్షులు ఎస్ ఎం గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన మంత్రాలయం లో జరిగిన మంచాల సొసైటీ చైర్మన్ ఎన్. రామకృష్ణ రెడ్డి జన్మదిన వేడుకలు. ముఖ్య అతిథిగా విచ్చేసారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తిరుమల లడ్డూ కల్తీ విషయంలో వైఎస్సార్ సీపీ పార్టీ మోసం చేసినది దానిని వెంకటేశ్వరస్వామి క్షమించడని అన్నారు. కల్తీ లడ్డూ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , మా నాయకులు పై లేనిపోని ఆరోపణలు మంచికాదన్నారు.

గుమ్మనూరు జయరాం వైసీపీ పార్టీ విధానాలు నచ్చక టీడీపీ లో చేరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ముఖ్య నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేడు పారిశుద్ధ్య కార్మికుల సమ్మె

విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధి ఫిబ్రవరి 11ః ఫిబ్రవరి 12న అనగా గురువారం దేశవ్యాప్తంగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నందున మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు తమ వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో వేయరాదని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ నగర ప్రజలకు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. జీవీఎంసీ పరిధిలోని పారిశుద్ధ్య కార్మికులు ఫిబ్రవరి 12 అనగా గురువారం సమ్మెలో పాల్గొంటున్న కారణంగా విధులకు హాజరు కానందున ఆరోజు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాలలో పడవేయరాదని, మరుసటి రోజు ఫిబ్రవరి 13 శుక్రవారం తమ వద్దకు వచ్చే పారిశుధ్య కార్మికులకు లేదా క్లాప్ వాహనాలకు వ్యర్థాలను అందించగలరని జీవీఎంసీ కమిషనర్ నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్



సంగారెడ్డి, ఫిబ్రవరి 11 మనం ప్రతినిధిః సదాశివపేట పట్టణంలోని రవీంద్ర మోడల్ హైస్కూల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జనరల్ అబ్జర్వర్ ఉదయ్ కుమార్ బుధవారం సందర్శించి పోలింగ్ ప్రక్రియను సమగ్రంగా పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లు, సౌకర్యాలు, భద్రతా చర్యలు తదితరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఓటరు హెల్ప్ డెస్క్, ఓటర్ జాబితాలు, పోలింగ్ బూత్ల అమరిక, ఓటింగ్ కంపార్ట్మెంట్, తాగునీరు, విద్యుత్ వంటి ప్రాథమిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. పోలింగ్ సిబ్బంది ఎన్నికల ప్రవర్తన నియమావళిని కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా విధులు నిర్వహించాలన్నారు. ప్రతి ఓటరు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించు కోవాలన్నారు.

పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని విభాగాలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

## అరటి తోటలో దొంగలు పడ్డారు

మహానంది,ఫిబ్రవరి11,మనంన్యూస్ః మహానంది మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన బొగ్గు రమేష్ అరటి తోటలో ఉన్న గెలలను గుర్తుతెలియని వ్యక్తులు దోచుకెళ్లినట్లు బాధితుడు బుధవారం తెలిపారు. గత రెండు రోజుల క్రితం తన పొలంలో దాదాపు 70 నుండి వంద అరటి గెలలను తీసుకెళ్లారని తెలిపారు. జమాలయ దర్గా ప్రాంతంలో ఉన్న అరటి తోటల్లో గత కొంతకాలంగా అరటి గెలలు దొంగలు ఎత్తుకెళ్తున్నారని రైతులు వాపోతున్నారు.



## తిరుమల లడ్డూపై కూటమి ప్రభుత్వ అసత్యప్రచారం సరికాదు



తుగ్గలి, ఫిబ్రవరి 11 (మనం న్యూస్ )ః తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి పవిత్ర లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం కావాలనే చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని వైఎస్ఆర్సిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసులు రెడ్డి, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు జిట్టా నాగేష్ యాదవ్, వైసిపీ ఎస్టీ జోనల్ అధ్యక్షులు నారాయణ నాయక్, వైసిపీ మేధావులు ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి రాతన మోహన్ రెడ్డి, ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగభూషణ్ రెడ్డి, ఐటి వింగ్ తాలూకా అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సేవాదల్ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి, వైసిపి మండల అధ్యక్షులు అట్ల గోపాల్ రెడ్డి లు తీవ్రంగా ఖండించారు. బుధవారం పాత్రికేయులతో వైఎస్ఆర్సిపి నేతలు మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి కేంద్రబిందువైన తిరుమల లడ్డూ ప్రసాదంపై అబద్ధపు ఆరోపణలు చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.తిరుమల లడ్డూ తయారీ పూర్తిగా సంప్రదాయాలు, శాస్త్రోక్త విధానాలు, అత్యున్నత నాణ్యత ప్రమాణాలతో జరుగుతుందని, ఈ విషయం దేశమంతా తెలుసునాని వారు స్పష్టం చేశారు.సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సీబీఐ సిట్ అన్ని కోణాల్లో విచారణ చేసి లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో ఎలాంటి జంతు కొవ్వు లేదని స్పష్టంగా క్లీన్ చిట్ ఇచ్చిందన్నారు.ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా కావాలనే అసత్య ప్రచారం చేయడం భక్తుల విశ్వాసాన్ని దెబ్బతీయడమేనని వారు పేర్కొన్నారు.కూటమి ప్రభుత్వం వెంటనే ఈ అసత్య ప్రచారాన్ని నిలిపివేసి, తిరుమల తిరుపతి దేవస్థానంపై, స్వామివారి ప్రసాదంపై ఉన్న అపార విశ్వాసాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు.లేకపోతే ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు రామాంజనేయులు, ఈశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,చంద్ బాషా,సయ్యద్ ఉసెన్ బాషా,గోవర్ధన్ రెడ్డి,సత్యప్ప,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా పోలింగ్



## ఖమ్మంలో 82.30 శాతం పోలింగ్
## భద్రాద్రి జిల్లాలో 73.33 పోలింగ్ నమోదు
## మధిరలో ఓటు హక్కు వినియోగించుకున్న డిప్యూటీ సీఎం





**ఖమ్మం, ఫిబ్రవరి 11(మనం బ్యూరో):** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఖమ్మం జిల్లాలో 82.30 శాతం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 73.33 శాతం పోలింగ్ నమోదైంది. మధిరలోని 9వ వార్డు ఇందిరా డెయిరీ పోలింగ్ కేంద్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 48వ డివిజన్ జగ్గు తండ ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఓటు వేశారు.

ఖమ్మం జిల్లాలో 5 మున్సిపాలిటీలలోని 116 వార్డులకు జరిగిన పోలింగ్ లో మొత్తం 82.50 శాతం ఓటింగ్ నమోదైందని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఉదయం 9 గంటల వరకు 15.37 శాతం, 11 గంటల వరకు 37.10 శాతం, మధ్యాహ్నం 1 గంట వరకు 59.41 శాతం పోలింగ్ నమోదైందని, సాయంత్రం 3 గంటల వరకు 72.93 శాతం పోలింగ్ నమోదైందని, 5 గంటల వరకు 82.30 శాతం పోలింగ్ నమోదైందని అన్నారు. పోలింగ్ ముగిసే సమయానికి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు టోకెన్ అందించి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించామని తెలిపారు.

ఖమ్మం జిల్లాలో 1,41,875 మంది ఓటర్లకు గాను 117043 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 55,506 మంది పురుష ఓటర్లు, 61,520 మంది మహిళా ఓటర్లు, 17 మంది ఇతరులు ఉన్నారు. మొత్తంగా జిల్లాలోని 5 మున్సిపాలిటీలలో 82.50 శాతం పోలింగ్ నమోదైంది. ఏదులాపురం మున్సిపాలిటీలో 85.45 శాతం, వైరా మున్సిపాలిటీలో 83.71 శాతం, సత్తుపల్లి మున్సిపాలిటీలో 77.81 శాతం, కల్లూరు మున్సిపాలిటీలో 87.08 శాతం, మధిర మున్సిపాలిటీలో 78.19 శాతం పోలింగ్ నమోదైంది.

**పోలింగ్ కేంద్రాల సందర్శన**

పురపాలక ఎన్నికల్లో భాగంగా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధి జలగం నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేసి ఓటింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు కల్పించిన వసతులను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్, ఎన్నికల సాధారణ పరిశీలకులు పవన్ కుమార్ కలెక్టరేట్ లోని వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ ను పరిశీలించారు.వెబ్ కాస్టింగ్ మానిటరింగ్ సెల్ లో డిఆర్ఓ పద్మశ్రీ, సిపిఓ శ్రీనివాస్, టెక్నీకల్ మేనేజర్ హనుమా చారి, ఈడిఎం దుర్గాప్రసాద్, టెక్నికల్ టీం సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

# 73.33 పోలింగ్ నమోదు

## పోలింగ్ సమయం ముగిసినా క్యూలో ఉన్న ప్రతి ఓటరికి అవకాశం

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 73.33 శాతం పోలింగ్ నమోదైనట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. జిల్లాలోని మూడు అర్బన్ లోకల్ బాడీల పరిధిలో మొత్తం 106 వార్డులు, 288 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసి ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 1,85,348 మంది ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 88,738 మంది, మహిళలు 96,572 మంది, ఇతరులు 38 మంది ఉన్నట్లు వివరించారు. సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 1,35,910 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

అశ్వారావుపేట మున్సిపాలిటీలో మొత్తం 16,850 మంది ఓటర్లలో 12,839 మంది (76.20 శాతం) ఓటు హక్కు వినియోగించుకోగా, కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 1,34,775 మంది ఓటర్లలో 99,992 మంది (74.19 శాతం) ఓటు వేశారు. యెల్లందు మున్సిపాలిటీలో 33,723 మంది ఓటర్లలో 23,079 మంది (68.44 శాతం) ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. పోలింగ్ సమయం సాయంత్రం 5 గంటలకు ముగిసినప్పటికీ, అప్పటికే పోలింగ్ కేంద్రాల లోపల క్యూలో నిలుచున్న ప్రతి ఒక్కరికి ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కల్పిస్తున్నామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ పూర్తైన వెంటనే బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య సంబంధిత స్ట్రాంగ్ రూములకు తరలించడం జరుగుతుందని తెలిపారు. స్ట్రాంగ్ రూముల వద్ద తగిన భద్రతా సిబ్బందిని నియమించి నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తామని వెల్లడించారు.

# పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు



**పాల్వంచ, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొత్తగూడెం, ఇల్లందు, అశ్వారావుపేట, పాల్వంచ పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని బుధవారం పరిశీలించారు. అక్కడ విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు. మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

# ప్రశాంతంగా వైరా మున్సిపల్ పోలింగ్

- ఫలితాలపై ఉత్కంఠ



**వైరా, ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** వైరా మున్సిపల్ పోలింగ్ ముగిసింది. ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ బుధవారం సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లకు అధికారులు ఓటు వేసే అవకాశం కల్పించారు. వైరా మున్సిపాలిటిలో 20 వార్డులలో మొత్తం ఓట్లు 24,689 ఓట్లు ఉండగ అందులో 20,639 ఓట్లు పోలయ్యాయి. పురుషులు 9,773 ఓట్లు , స్త్రీలు 10,866 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మున్సిపాలిటీ 20 వార్డులో 83.60% పోలయ్యాయి.పోలింగ్ సరళి తొలుత ప్రశాంతంగా ప్రారంభమైనప్పటికీ పోలింగ్ ముగిసే సమయానికి రాష్ట్ర వైరా మున్సిపల్ పలు వార్డులో ఉద్రిక్తతలు నమోదయ్యాయి. ప్రధాన పార్టీల మధ్య వాగ్వాదాలు, ఘర్షణలు చోటు చేసుకున్నాయి. పలు చోట్ల రాజకీయ పార్టీ నేతలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడైనా అదుపుతప్పే పరిస్థితులు ఉంటే వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిపోయింది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు ఈ నెల 13న లెక్కించనున్నారు. మున్సిపాలిటీలో తమ జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు ప్రచార పర్వాన్ని సాగించాయి. ప్రత్యర్థులపై మాటల తూటాలు వదులుతు రాజకీయాన్ని రక్తికట్టించాయి. వాదనలు, సవాళ్లతో మొదలైన ప్రచార విలువలకు తిలోదకాలు దిద్దుతూ తిట్లపురాణాల వరకు చేరుకుంది. పార్టీల వ్యూహాలు, హామీలు, ప్రచార సరళిని అంతా గమనించిన ఓటర్లు పార్టీల భవిష్యత్ ను, అభ్యర్థుల అదృష్టాన్ని ఓటు రూపంలో బ్యాలెట్ బాక్కుల్లో నిక్షిప్తం చేశారు. ఓటర్లు ఎవరికి పట్టం కట్టారో 13న తేలనుంది.

# ఓటు హక్కును బాధ్యతాయుతంగా స్వీకరించాలి

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**పాల్వంచ, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధి 48వ డివిజన్ జగ్గు తండ ఎంపీపీఎస్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి లభించిన అత్యంత విలువైన ఆయుధం ఓటు హక్కు అని తెలిపారు. ప్రజాస్వామ్యంలో మన గళాన్ని వినిపించడానికి ఓటు హక్కు శక్తివంతమైన సాధనం అని అన్నారు. ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్తో పాటు అశ్వారావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేసినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాలలో తాగునీరు, విద్యుత్, భద్రతా ఏర్పాట్లు, అవసరమైన సిబ్బంది నియామకం వంటి చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. వృద్ధులు, వికలాంగులు, ప్రత్యేక అవసరాలు ఉన్న ఓటర్ల కోసం వీల్చైర్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు.అన్ని వర్గాల ఓటర్లు ప్రశాంత వాతావరణంలో ఎలాంటి భయాందోళనలు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. చివరి నిమిషం వరకు వేచి చూడకుండా త్వరితగతిన పోలింగ్ కేంద్రాలకు చేరుకుని, ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# సేవాలాల్ బంజారా సంఘం నాయకుల ముందస్తు అరెస్ట్..



**లక్ష్మీదేవిపల్లి ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముట్టడికి బయలుదేరిన సేవాలాల్ బంజారా సంఘం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులను ముందస్తు అక్రమ అరెస్టు చేసి లక్ష్మీదేవిపల్లి మండల పోలీస్ స్టేషన్ కి తరలించారు. పోలీసుల అక్రమ అరెస్టును సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్, జిల్లా అధ్యక్షుడు రాంబాబు నాయక్, బోడ శ్రీనివాస్ నాయక్ లు తీవ్రంగా ఖండించారు. సేవాలాల్ బంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ... సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ట మద్దిమడుగులో కాకుండా హైదరాబాద్ మహానగరంలో ఏర్పాటు చేయాలని గత కొన్ని రోజులుగా ప్రభుత్వాన్ని కోరుతున్నామని, బంజారాల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని మద్దిమడుగు ప్రాంతంలో ఏర్పాటు చేయటం వలన రాష్ట్రం నలుమూలలో ఉన్న బంజారా లంబాడీలకు దర్శనం కష్టతరమవుతుందని, బంజారా ప్రజల మనోభావాలను అనుగుణంగా సేవాలాల్ మహారాజ్ విగ్రహం హైదరాబాద్ మహానగరంలో ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునర్ ఆలోచన చేసి విగ్రహ ప్రతిష్టాపన విషయంలో ఒక నిర్ణయం తీసుకోవాలని సేవాలాల్ బంజారా సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది. ప్రభుత్వ నిర్ణయంలో మార్పు రాకపోతే త్వరలో మరో అన్ని ఉద్యమాలు ఉద్ధృతం చేసి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



# అర్చరీలో పట్వారి గూడెం యువతి సంచలనం

- సీఎం కప్లో లోహితశ్రీకి స్వర్ణం

**దమ్మపేట, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** పాల్వంచ వేదికగా జరిగిన జిల్లా స్థాయి సీఎం కప్ అర్చరీ పోటీల్లో దమ్మపేట మండలం పట్వారి గూడెం గ్రామానికి చెందిన కనకం లోహిత శ్రీ ,అద్భుత విజయాన్ని సాధించారు. మహిళల రికర్వ్ విభాగంలో తన గురి తప్పని అస్త్రాలతో ప్రత్యర్థులను వెనక్కి నెట్టి ఆమె బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన లోహిత శ్రీ, క్రమశిక్షణతో కూడిన సాధనతో జిల్లా స్థాయి పోటీల్లో అగ్రస్థానంలో నిలవడం పట్ల క్రీడాకారులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విజయంతో ఆమె రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. పట్వారీగూడెం గ్రామం పేరును జిల్లా స్థాయిలో నిలబెట్టిన లోహిత శ్రీ,ని పలువురు ప్రముఖులు అభినందించారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని జాతీయ,అంతర్జాతీయ పతకాలు సాధించాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# మధిరలో ప్రశాంతంగా పోలింగ్

**మధిర, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** మధిర మున్సిపల్ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి . ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 5 గంటలతో ముగిసింది. 5 గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న తమ ఓటు హక్కును ప్రశాంతమైన వాతావరణంలో ప్రజలు వినియోగించుకున్నారు. మున్సిపాలిటీలోని 9వ వార్డు ఇందిరా డెయిరీ పోలింగ్ కేంద్రంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు.

మధిర మున్సిపాలిటిలో 22 వార్డులలో మొత్తం ఓట్లు 25679 ఓట్లు ఉన్నాయి. అందులో 20,000 ఓట్లు పోలై మున్సిపాలిటీ 22 వార్డులో 77.88 శాతంగా నమోదయింది. పోలీసు వారి గట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలీస్ రెవిన్యూ మున్సిపల్ మొదలగు ప్రభుత్వ అధికారుల సమన్వయంతో ఎన్నికలు సజావుగా ప్రశాంతంగా ముగియడంతో మధిర మరోసారి ప్రశాంతతకు మారుపేరుగా మారుమోగింది. మధిరలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతో పాటుగా పుర ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను వైరా ఏసిపి సారంగపాణి పర్యవేక్షించారు. ఎక్కడైనా అదుపుతప్పే పరిస్థితులు ఉంటే వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు పరిస్థితులను అదుపులోకి తీసుకురావడంతో పోలింగ్ ప్రక్రియ అంతా సజావుగా జరిగిపోయి ంది. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్లు ఈ నెల 13న లెక్కించనున్నారు. మున్సిపాలిటీలో తమ జెండా ఎగరేసేందుకు ప్రధాన పార్టీలు నువ్వా నేనా అన్నట్లు ప్రచార పర్వాన్ని సాగించాయి. చివరి దశలో టిఆర్ఎస్ పార్టీ డీలపడ్డట్టు సమాచారం. కాంగ్రెస్ కూటమికి బి కూటమికి మధ్య కానరాని పోటీ జరిగింది, హామీలు, ప్రచార సరళిని అంతా గమనించిన ఓటర్లు పార్టీల భవిష్యత్ ను, అభ్యర్థుల అదృష్టాన్ని ఓటు రూపంలో బ్యాలెట్ బాక్కుల్లో నిక్షిప్తం చేశారు ఓటర్లు.

# రహదారి భద్రత, నేర నియంత్రణకు పట్టణంలో ఆకస్మిక తనిఖీలు

- విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం, ఫిబ్రవరి 11 (మనంన్యూస్):** విజయనగరం పట్టణంలో ఫిబ్రవరి 11న ముందుగా గుర్తించిన 140 ప్రాంతాల్లో సాయంత్రం 4గంటల నుండి 7గంటల వరకు ఆకస్మికంగా వాహన తనిఖీలు చేపట్టినట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. డిఎస్పీల ఆధ్వర్యంలో పట్టణంలో ప్రత్యేకంగా చేపట్టగా, జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తనిఖీలను స్వయంగా పర్యవేక్షించారు. రహదారి భద్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం, నిబంధనలకు విరుద్ధంగా వాహన పత్రాలు సక్రంగా లేని వాహనాలను సీజ్ చేయడం, హెల్మెట్ ధరించని వారిపై కేసులు నమోదు చేసామన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ - విజయనగరం పట్టణంలో వాహన తనిఖీలు చేపట్టేందుకు 140 ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టామన్నారు. ఈ తనిఖీల్లో సుమారు 1000 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బందిని వినియో గించామన్నారు . ఈ తనిఖీల్లో వాహన పత్రాలు సక్రమంగా ఉన్నవి, లేనిది గుర్తించి, రికార్డులు సక్రమంగా లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అదే విధంగా నిబంధనలకు విరుద్ధంగా సైలన్సర్లను మార్పులు చేసి, శబ్ద కాలుష్యంకు కారణమవుతున్న వాహనాలను కూడా సీజ్ చేస్తామన్నారు. మైనరు డ్రైవింగు, హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపైన కేసులు నమోదు చేస్తామని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. వాహన తనిఖీల్లో ప్రజలకు రహదారి భద్రత పట్ల కూడా అవగాహన కల్పించి, హెల్మెట్ ధారణ ఎంత ప్రయోజనకరమో వాహనదారులకు వివరించామన్నారు. రహదారి భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ప్రమాదాలు జరగకుండా లైన్ డిపార్టుమెంట్స్ సహకారంతో రహదారుల ప్రక్కన ఉన్న మొక్కలను తొలగిస్తున్నామని, ప్రమాదాలకు కారణమవుతున్న రహదారులను గుర్తించి, ఆయా డిపార్టుమెంట్స్ దృష్టికి తీసుకొనివెళ్ళి, మరమ్మత్తులు చేపట్టే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. రహదారి భద్రత నియమాలు పాటించిన, హెల్మెట్ దరించిన వాహనదారులను జిల్లా ఎస్పీ అభినందించారు. జిల్లా ఎస్పీ వాహన తనిఖీలను స్వయంగా పర్యవేక్షించి, తల్లి జన్మనిస్తే హెల్మెట్ పునర్జన్మనిస్తుందని హెల్మెట్ ప్రాధాన్యతను ప్రజలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ వివరించారు. రోడ్డు ప్రమాదాల్లో చాలా మంది హెల్మెట్ ధరించకపోవడం వలన తలకు గాయాలై ప్రాణాలు పోవడంతో ఆ కుటుంబ జీవితం చిన్నాభిన్నం అవుతుందన్నారు. రహదారి భద్రతా నియమాల్లో భాగంగా రోడ్డు ప్రమాదాలు నివారించుటకు త్వరలో నో హెల్మెట్ - నో పెట్రోల్ అనే నినాదాన్ని జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తామని జిల్లా ఎస్పీ తెలిపారు.విజయనగరం పట్టణంలో కోట జంక్షను, మూడు లాంతర్లు, గంట స్థంభం వద్ద వాహన తనిఖీలను జిల్లా ఎస్పీ సందర్శించి, తనిఖీలు జరుగుతున్న తీరును స్వయంగా పర్యవేక్షించారు. రహదారి ప్రమాదాలు జరిగిన సమయంలో బాధితుల ప్రాణాలను కాపాడేందుకు గోల్డెన్ అవర్లో తీసుకొని వెళ్ళినట్లయితే, వారిని ప్రభుత్వం గుర్తించి, రూ. 5వేలు నగదును ప్రోత్సాహకంగా అందిస్తుందని, వారిపై ఎటువంటి వేధింపులు ఉండవని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ స్పష్టం చేసారు.

ఈ తనిఖీల్లో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, డిఎస్పీలు ఆర్.గోవిందరావు, జి. భవ్య రెడ్డి, ఎస్.రాఘవులు, డిపిడిసి డిఎస్పీ వీరకుమార్, పలువురు సిఐలు, ఆర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# గొడ్డలి వేటుపై అటవీశాఖ జరిమానా వేటు!..

మనం ఎఫెక్ట్

## టేకు చెట్ల నరికివేతపై తలొగ్గి
## 22,714 రూపాయల జరిమానా
## చెల్లించిన ఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్



**కారేపల్లి, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** పచ్చని టేకు చెట్లపై గొడ్డలి వేటుపై అనే శీర్షికతో మనం దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలపై అటవీశాఖ అధికారులనుండి విశేష స్పందన లభించింది. ఖమ్మం జిల్లా సింగరేణి మండల పరిధిలోని గేటు కారేపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎలాంటి అనుమతులు లేకుండా విలువైన టేకు చెట్లు కొట్టేసిన వారిపై అటవీశాఖ జరిమానా వేటు వేసింది.పాఠశాలకు నోటీసులు జారీ చేసిన అనంతరం బుధవారం పాఠశాల హెడ్మాస్టర్ వెంకట రమణ జరిమానా మొత్తం చలానా రూపంలో 22,714 రూపాయలు అటవీశాఖ అధికారులకు బుధవారం చెల్లించి రసీదు పొందారు.జరిమానా స్వీకరణ అనంతరం పాఠశాల నుండి స్వాధీనం చేసుకున్న కలప కర్రలను ఇల్లందు డిపోకు తరలించనున్నట్లు ఫారెస్ట్ రేంజ్ అధికారి ఎపప్రడైటీస్ మనం దినపత్రికకు తెలిపారు.

**గిరిజన సంక్షేమ శాఖ తీరుపై అనుమానాలు:**

అనుమతులు లేకుండా అక్రమంగా టేకు చెట్లను నరికివేసిన విషయంలో మాత్ర సంస్థ అయిన గిరిజన సంక్షేమ శాఖ మాత్రం కేవలం షోకాజ్ నోటీసులను జారీ చేసి చేతులు దులుపుకున్నారనే విమర్శలు వెలువెత్తుతున్నాయి. సంక్షేమ శాఖ ఉన్నతాధికారుల అనుమతిని బేఖాతరు చేసి,ట్రైబల్ వెల్ఫేర్ సంస్థకే మచ్చ తీసుకొచ్చే ధోరణితో వ్యవహరించిన హెడ్మాస్టర్ వెంకటరమణ, డిప్యూటీ వార్డెన్ ఇస్లావత్ హచ్య పనితీరు పట్ల గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కఠిన చర్యలు తీసుకుంటేనే ఆశ్రమ పాఠశాల పనితీరు మెరుగుపడి మిగిలిన టేకు చెట్లను రక్షణ లభిస్తుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## డాక్టర్ మాధురిని సత్కరించిన ఏపి మంత్రి నిమ్మల



**పాలకొల్లు, ఫిబ్రవరి 11,మనం ప్రతినిధి :** పాలకొల్లు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రి చీఫ్ సూపరింటెండెంట్, డాక్టర్ యర్రా మాధురిని బెస్ట్ గైనకాలజిస్ట్ అవార్డును పొందిన సందర్భంగా ఏపీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల దుస్సాలువతో డాక్టర్ మాధురిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి కమిటీ చైర్మన్ చిన్నమిల్లి గణపతి, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు,పొట్నూరి శ్రీనివాస్,సురేష్, గోపి తదితరులు ఉన్నారు.

## పాలకొల్లుకి గర్వంగా నిలిచిన సంధ్యా మెరైన్స్

- **గ్రామీణ కుటుంబాలకు బలమైన ఆర్ధిక ఆధారం**

**భీమవరం, ఫిబ్రవరి 11 మనం న్యూస్ :** పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పరిధిలో ఆక్వాకల్చర్ రంగంలో విశిష్ట స్థానాన్ని సంపాదించిన సంధ్యా మెరైన్స్, నేడు పాలకొల్లుకి, పాలకొల్లు పరిసర ప్రాంతాలకు గర్వంగా మారింది. పరిశ్రమ అంటే కేవలం వ్యాపారం కాదు, ప్రజల జీవితాల్లో వెలుగు నింపే శక్తి అనే స్ఫూర్తితో ముందుకు సాగుతున్న ఈ సంస్థ వందలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా అందిస్తోంది.

**ఉపాధి ద్వారా కుటుంబాలకు వెలుగు**

సంధ్యా మెరైన్స్లో రొయ్యల శుద్ధి, గ్రేడింగ్, ప్యాకింగ్, కోల్ స్టోరేజ్ వంటి విభాగాల్లో స్థానిక మహిళలు, యువతకు విస్తృత ఉపాధి కల్పిస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల మహిళలు స్వయం ఆదాయం సంపాదిస్తూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.ఇక్కడ పని దొరకడంతో మా ఇంట్లో ఆర్థిక ఇబ్బందులు



తగ్గాయి అని పలువురు మహిళా కార్మికులు ఆనందంగా చెబుతున్నారు.నాణ్యతకు కట్టుబాటు అంతర్జాతీయ గుర్తింపు ముడి సరుకు సేకరణ నుంచి ఎగుమతుల వరకు ప్రతి దశలో కఠిన నాణ్యత ప్రమాణాలు పాటించడం ద్వారా సంస్థ విదేశీ మార్కెట్లలో విశ్వాసాన్ని పొందింది. పరిశుభ్రత, భద్రత, ఆధునిక యంత్రాంగం వినియోగం సంధ్యా మెరైన్స్ను ప్రత్యేకంగా నిలబెడుతోంది.

**ఉద్యోగుల సంక్షేమం – సంస్థ ధ్యేయం.**

సురక్షితమైన పని వాతావరణం, సమయానికి వేతనాలు, శిక్షణ కార్యక్రమాలు అందిస్తూ ఉద్యోగుల అభివృద్ధికి సంస్థ ప్రాధాన్యం ఇస్తోంది. నైపుణ్యాభివృద్ధి శిక్షణల ద్వారా యువతకు మరింత స్థిరమైన భవిష్యత్కు బాటలు వేస్తోంది.స్థానిక ఆర్థిక వ్యవస్థకు చైతన్యం మత్స్యకారులు, ఆక్వా రైతులు, రవాణా రంగానికి చెందిన వారికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సంధ్యా మెరైన్స్ ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తోంది. పరిశ్రమల ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమని నిరూపిస్తూ పాలకొల్లు అభివృద్ధి దిశగా ముందుకు నడుస్తోంది.పాలకొల్లు గర్వంగా పేరొందిన సంధ్యా మెరైన్స్, పరిశ్రమల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువస్తూ సామాజిక బాధ్యతను చాటుతోంది. అభివృద్ధి పథంలో పాలకొల్లును ముందుకు నడిపించే శక్తిగా నిలుస్తున్న ఈ సంస్థకు స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## పూలపల్లిలో 15న మహాశివరాత్రి మహోత్సవం



- **ఏఎంసీ మాజీ చైర్మన్ గాంధీభవన్‌రాజ్**

**పాలకొల్లు, ఫిబ్రవరి 11,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా పూలపల్లి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత అమృత లింగేశ్వర దేవాలయంలో ఈ నెల 15వ తేదీన మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం మహాశివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనునట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ గొట్టుముక్కల గాంధీ భగవాన్ రాజు,శాశ్వత ధర్మకర్త గొట్టుముక్కలసుశీల దేవి తెలిపారు. 15వ తేదీన ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు స్వామివారికి రుద్రాభిషేకం అమ్మవారికి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంతో అద్భుతమైన మహత్యం కలిగిన స్వామివారిని దర్శించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని గాంధీభవన్రాజు కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి పాల శ్రీనివాస్, వి శ్రీహరి రాజు, గంట నరసింహమూర్తి పాల్గొన్నారు.

## చీకటి నుండి వెలుగును తెచ్చింది యేసుప్రభువు

- **పాస్టర్ జాన్**

**ఆచంట, ఫిబ్రవరి 11 మనం న్యూస్ :** చీకటితో నిండిన లోకములో వెలుగును ప్రసరింపజేసి సమస్త మానవాళికి నీతి మార్గములను బోధించి, ఆచరణలో చూపినది యేసుప్రభువేనని అంతర్జాతీయ ప్రసంగీకులు పాస్టర్ జాన్(అమరావతి) అన్నారు. మంగళవారం రాత్రి మండలంలోని బీమలాపురం, గుబ్బల వారి పాలెం తోటలో పాస్టర్ పేతురు ఆధ్వర్యంలో జరిగిన రక్షణ సువార్త ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాస్టర్ జాన్ పాస్టర్ డానియల్(దుబాయ్) ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాన్ మాట్లాడుతూ నీతి మార్గంలో నడుచుట వలన క్షేమకరమైన జీవితం జీవించవచ్చని, దేవునికి వ్యతిరేకమైన పనులు చేస్తే దేవుని ఉగ్రతకు లోను కావాల్సి వస్తుందని దానికి ఉదాహరణగా ఇశ్రాయేలీయులను మిద్యానీయులకు అప్పగించడం ద్వారా వారికి కలిగిన నష్టం గ్రహించి దేవునికి



మొరపెట్టినప్పుడు గిద్యోను ద్వారా ఇచ్చిన జయమును సాదృశ్యంగా చూడవచ్చన్నారు. ప్రస్తుతం సమాజంలో యవ్వనస్తులు సెల్ఫోన్లో అశ్లీలతకు, మద్యానికి, డ్రగ్స్ కు బానిసలు అవుతున్నారని, తద్వారా యవ్వన జీవితమును మధ్యలోనే ముగించి మరణానికి చేరువవుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ, క్రీస్తు ఆధ్యాత్మిక బోధనల ద్వారా నేటి సమాజంలో కులమతాల కతీతంగా అనేకమంది జీవితాలు మంచి మార్గంలో ఉంటున్నాయని, ప్రతి ఒక్కరు గ్రహించి ఉత్తమమైన క్రీస్తు మార్గంలో నడవాలని సూచించారు. పాస్టర్ డేనియల్ మాట్లాడుతూ ఈ లోక యాత్ర ఎప్పుడు ముగుస్తుందో తెలియని పరిస్థితిలో ప్రతి ఒక్కరు ఉన్నారని కాబట్టి వివేచనతో కూడిన ఆధ్యాత్మిక మార్గమును ఎంచుకొని తమ పాప జీవితమును విడిచి రక్షణతో కూడిన ఉత్తమమైన ముక్తి మార్గానికి చేరువయ్యేలా తమ నడవడిక మార్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో వల్లూరు ఏరియా, పోడూరు మండల యూపీఏ పాస్టర్స్ జోగి లాజరస్, జి ఎస్ కుమార్, గుత్తుల సాల్మన్ దొర, జ్యోతి బాబు, రాజేష్, రత్నరాజు, సిర్రా బాలాజీ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

## ఏపి మంత్రి నిమ్మలకు మహాశివరాత్రి ఉత్సవ ఆహ్వాన పత్రిక అందజేత



**పాలకొల్లు, ఫిబ్రవరి 11,మనం ప్రతినిధి :** పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో వేంచేసి ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో ఈనెల 15వ తేదీన జరిగే మహా శివరాత్రి మహోత్సవం ఆహ్వాన పత్రికను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు కు ఆ దేవాలయ ఉత్సవ కమిటీ అందజేసింది. మంత్రి నిమ్మలకు ఆహ్వాన పత్రికను అందజేసిన వారిలో ఆలయ కమిటీ చైర్మన్ వట్టంగనేశ్వరరావు, ధర్మకర్త బాసిన గుణేశ్వరరావు, ట్రెజరర్ బాసిన సత్యనారాయణ, కార్యదర్శి మానెం బసవరాజు ఉన్నారు.

## మ్యుటేషన్ ప్రక్రియ పక్కాగా నిర్వహించాలి



- **కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**నరసాపురం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** వివాదాలకు తావు లేకుండా మ్యుటేషన్ ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ సిహెచ్. నాగరాణి అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆకస్మికంగా సందర్శించి కొన్ని భూమి, స్థిరాస్తిలకు సంబంధించి యజమాన్యంలో మార్పులను ప్రభుత్వ రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ మ్యుటేషన్ మ్యుటేషన్ అనేది భూమి యజమాన్యంలో మార్పు వచ్చినప్పుడు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేసే ముఖ్యమైన ప్రక్రియని అన్నారు. ఇది చట్టబద్ధ హక్కుకు ప్రత్యామ్నాయం కాకపోయినా, పరిపాలనా పరంగా చాలా అవసరమని అన్నారు. భూమి కొనుగోలు చేయడం, వారసత్వం రావడం జరిగిన వెంటనే మ్యుటేషన్ పూర్తి చేసుకోవాలన్నారు. భూమి లేదా ఆస్తి యజమాని మారినప్పుడు, ఆ మార్పును గ్రామ, మండల రెవెన్యూ రికార్డుల్లో మ్యుటేషన్ చేయించాల్సి ఉంటుందని ప్రభుత్వ రికార్డుల్లో కొత్త యజమాని పేరు నమోదు కావడం వల్ల పన్నులు చెల్లించడం, పాసు బుక్కులు పొందడం వంటివాటికి సులువుగా ఉంటుందన్నారు. మ్యుటేషన్ ప్రక్రియకి సంబంధిత మండల రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని లేదా ఆన్లైన్ పోర్టల్ ద్వారా రిజిస్ట్రేషన్ డీడ్ కాపీ, పాత పట్టాదారు పాసుబుక్ ఆధార్, గుర్తింపు పత్రాలు, వారసత్వ ధృవపత్రం సమర్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఆర్డీవో దాసిరాజు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



## ప్రజల విశ్వాసాన్ని నిలుపుకుంటాం

- **పొత్తూరి రామరాజు**

**నరసాపురం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడం కార్యకర్తల బాధ్యత అని నరసాపురం నియోజక వర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ పొత్తూరి రామరాజు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆరో వార్డు గంట్లమ్మ ఆలయం వద్ద వార్డు అధ్యక్షుడు రెడ్డి సూర్యనారాయణ అధ్యక్షతన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల ఆత్మీయ సమా వేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పొత్తూరి రామ రాజు ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ కార్యకర్తల ఐక్యత అత్యంత అవసరమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు పార్టీ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. డ్రైనేజీ, విద్యుత్, ఇళ్ల పట్టాలు, ఇంటి లోన్లు, పారిశుద్ధ్యం, పెన్షన్లు తదితర సమస్యలను వార్డు ప్రజలు రామరాజు దృష్టికి తీసుకు వచ్చారు. అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆయా సమస్య లను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటా మని రామరాజు హామీ ఇచ్చారు. ప్రజల విశ్వాసాన్ని నిలుపు కోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడు తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ, సీనియర్ నాయకులు అధికారి అనంతరామారావు, కోరాడ పాపారావు, పెంద్ర శ్రీనివాస్, దివి వెంకటేశ్వరావు, తువ్వులపల్లి లక్ష్మీ నారాయణ, సిందాడి నిరీక్షణరావు, గంధం సత్యబాబు, సాకేటి రమణ, నాగిడి రాంబాబు, పట్నాల జగన్ పాల్గొన్నారు.

## విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని చదవాలి



- **తోట సీతారామలక్ష్మి**

**భీమవరం, ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** పట్టుదల ఏకాగ్రతతో చదివితే సాధించలేనిది ఏమీ లేదని విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుపై దృష్టి పెట్టాలని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక పిఎస్ఎం బాలికోన్నత పాఠశాలలో 200 మంది పదవతరగతి విద్యార్థులకు తెలుగు యువత పట్టణ అధ్యక్షుడు గొలగాని రమేష్ సౌజన్యంతో స్టడీ మెటీరియల్స్ ను అందించారు. ఈ సందర్భంగా సీతారామలక్ష్మి మాట్లాడుతూ పదవతరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించే లక్ష్యంతో చదవాలని ప్రభుత్వ పాఠశాలలోనే అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారని నాణ్యమైన విద్యాబోధన అందుతుందని అన్నారు. తెదేపా రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి,రాష్ట్ర కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు, రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు, మాట్లాడుతూ ఉన్నత చదువులు చదువుకొని జీవితంలో గొప్ప స్థాయికి ఎదగాలని, చదువుతో గౌరవం, విలువ లభిస్తాయని అన్నారు. గొలగాని రమేష్ మాట్లాడుతూ అన్నింటిలో కన్నా విద్య ఎంతో గొప్పదని అలాంటి విద్యను ఎవరూ నిర్లక్ష్యం చేయవద్దని విద్యతోనే ఉజ్వల భవిష్యత్ అని, విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో 200 మంది పదవతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ ను అందించావన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరి రామ లింగరాజు, మద్దుల రాము, మైలబత్తుల ఐజాక్ బాబు, మాదాసు కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల గోడ పత్రిక ఆవిష్కరించిన కలెక్టర్



**కాట్రేనికోన, ఫిబ్రవరి (మనం న్యూస్):** మనం ప్రతినిధి: భారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 9 నుంచి 13వ తారీకు వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ వెల్లడించారు. బుధవారం ఈ మేరకు వారోత్సవాల ప్రచార గోడ పత్రికను ఆయన చాంబర్ నందు ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యతతోనే సరైన ఆర్థిక నిర్ణయాలు తీసుకో గలుగుతారన్నారుభారతీయ రిజర్వ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ( ఆర్ బి ఐ ) ఫిబ్రవరి 9 నుంచి 13వ తారీకు వరకు నిర్వహిస్తున్న ఆర్థిక అక్షరాస్యత వారోత్సవం సందర్భంగా ప్రజల్లో ఆర్థిక అంశాల పట్ల సమగ్రమైన అవగాహనను వారం రోజులపాటు విస్తృత ప్రచారం ద్వారా పెంపొందిం చాలన్నారు ప్రజలు సరైన ఆర్థిక నిర్ణయాలు తీసు కోవడంలో ఆర్థిక అక్షరా స్యత కీలక పాత్ర పోషి స్తుందని పేర్కొన్నారు సురక్షిత బ్యాంకింగ్ విధానాలు పాటించడం, డిజిటల్ లావాదేవీలు జాగ్రత్తగా నిర్వహించడం, పొదుపు అలవాట్లు పెంపొందించుకోవడం, ఆర్థిక మోసాల నుంచి రక్షణ పొందడం, ఇకేవైసీ చేయించడం అలాగే సెంట్రలైజ్డ్ కేవైసీ రిజిస్ట్రీ మరియు బ్యాంకు డిపాజిట్ల పైన ప్రజల్లో అవగాహన కల్పించాల న్నారు .అలాగే ఈ వారోత్సవం ద్వారా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు బాధ్యతాయుత మైనటువంటి ఆర్థిక ప్రవర్తన పైన అవగాహన కల్పించడం,డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ఆన్లైన్ మోసాలు, ఆన్లైన్ నేరాలు, సైబర్ సెక్యూరిటీ ఇన్సూ రెన్స్, మరియు పెన్షన్ పథకాల పైన అవగాహన కల్పించాలని తెలియజే శారు ఈ కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంకు మేనేజ ర్ కేశవ వర్మ పాల్గొన్నారు.

## మహా శివరాత్రి ఏర్పాట్లపై ఆర్డీవో సమీక్ష



**కాట్రేనికోన, ఫిబ్రవరి 11,మనం ప్రతినిధి:** కాట్రేనికోన మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం దక్షిణ కాశి గా పిలవ బడే కుండలేశ్వరంలో రానున్న మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ముదస్తు ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో మాధవి బుధవారం పరిశీలించారు. ఆలయ ప్రాంగణం, స్నానాల రేవు, భక్తుల రాకపోకలకు సంబంధించిన మార్గాలు, పార్కింగ్ ప్రాంతాలు వంటి ప్రధాన ప్రాంతాలను ఆమె సందర్శించి పరిస్థితిని అంచనా వేశారు. మహాశివరాత్రి పర్వదినం రోజున కుండలేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు సుమారు లక్షమంది వరకు భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్న నేపథ్యంలో, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీవో మాధవి ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్రమబద్ధమైన దర్శన ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, క్యూలైన్ల నిర్వహణ వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రత్యేకంగా స్నానాల రేవు వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున, భద్రతా చర్యలు కట్టుదిట్టంగా ఉండాలని ఆమె తెలిపారు. ఈ నేపథ్యంలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచడంతో పాటు, పడవలను కూడా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు. ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని హెచ్చరించిన ఆర్డీవో, ఆలయ పరిసరాలు, రేవు ప్రాంతం, అన్నదానం జరిగే ప్రదేశాల్లో స్వచ్ఛతను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. చెత్త సేకరణకు ప్రత్యేక బృందాలను నియమించి, తాత్కాలిక మరుగుదొడ్లు, తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణ, వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, పోలీసు బందోబస్తు వంటి అంశాలపై కూడా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఆమె అధికారులకు తెలిపారు. భక్తులు సురక్షితంగా, సౌకర్యవంతంగా మహాశివరాత్రి ఉత్సవాలను జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో మాధవి స్పష్టం చేశారు.తసిల్దార్ రవి కిరణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మత్స్యకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగిడి నాగేశ్వర రావు డీసీ చైర్మన్ ఆకాశం శ్రీనివాస్,మార్గదర్శి త్సవటపల్లి నాగేంద్ర రావు, పి ఎస్ ఎన్ రాజు (విలేకరి రాజు) నాయకులు దండ్రుప్రోలు సత్యం, బొమ్మిడి లింగేశ్వర రావు , గంగమల్ల వీరభద్ర రావు,ఎంపీడీవో బి రాజేశ్వర రావు, సిఐ ఎం మోహన్ కుమార్, ఎస్ ఐ అవినాష్ ఏఈలు శ్రీనివాస్ సుబ్రహ్మణ్యం రమేష్, ఎఫ్ డి ఓ చలపతి వైద్యాధికారి పి నీలిమ కుండలేశ్వరం దేవస్థానం ఈవో కొర్లపాటి సూర్య వెంకట దుర్గా సొసైటీ చైర్ పర్సన్ గంగమల్ల రవి కుమార్,డిప్యూటీ ఎంపీడీవో నున్న శంకర్ నారాయణ,మోకా అప్పాజీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆర్ కే దుర్గా,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతులు లేనిదే మట్టి, ఇసుక తవ్వకాలు చేపట్టరాదు

**కాట్రేనికోన , ఫిబ్రవరి, 11 మనం ప్రతినిధి :** మండలం పరిధిలో ఏ విధమైన మట్టి, ఇసుక తవ్వకాలుగాని, రవాణా గాని జరపరాదని తహసీల్దార్ రవి కిరణ్ తెలిపారు మైన్స్ మరియు సంబంధిత శాఖల నుండి అనుమతులు పొందిన పిమ్మట మాత్రమే తవ్వకాలకు అనుమతించబడునని లేనియెడల సదరు వ్యక్తులపై కేసులు నమోదు చేసి సంబంధిత వాహనములు, త్రవ్వక పనిముట్లను సీజ్ చేయడం జరుగుతుందని కాట్రేనికోన తహసీల్దార్ వి రవి కిరణ్ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు.

# మనమెక్కడ చమురు కొనాలో అమెరికా చెబుతోంది

● రాహుల్ గాంధీ



**ఢిల్లీ, ఫిబ్రవరి 11:** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఇరుదేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందే తప్ప.. భారత్కు దీనివల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదన్నారు. కేంద్ర బడ్జెట్పై చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ లోక్సభలో మాట్లాడారు. తన ప్రసంగంలో వాణిజ్య ఒప్పందంతో పాటు ఏఐ ప్రభావం వంటి అంశాల గురించి ప్రస్తావించారు. ప్రపంచంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా బడ్జెట్ ఏమాత్రం ప్రతిబింబించలేదన్నారు.

''ప్రపంచమంతా ఏఐ యుగంలోకి వెళ్తోందని చెబుతున్నారు. దీనివల్ల భారతీయ ఐటీ కంపెనీలు నష్టపోయే ప్రమాదం ఉంది. సాఫ్ట్వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలకు ప్రమాదం ఉంది. మన దేశానికి ప్రతిభావంతులైన యువతరం పెద్ద ఆస్తి. ఏఐకి ఇంధనమే డేటా.. డేటా లేకుండా ఏఐ ఏమీ చేయలేదు. అమెరికా సూపర్ పవర్గా కొనసాగాలంటే భారత్ డేటానే కీలకం. గతంలో అధిక జనాభాను సమస్యగా భావించేవారు.. కానీ జనాభా మనకు అతిపెద్ద ఆస్తి. కానీ మన డేటాను రక్షించుకునేందుకు ఇండియా చర్యలు తీసుకోలేదు. అమెరికా కంపెనీల కోసం ట్యాక్స్ హాలిడే ప్రకటించింది'' అని రాహుల్ గాంధీ అన్నారు.

**ఒప్పందంతో అమెరికాకే మేలు**

''మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో అమెరికా చెబుతోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం టారిఫ్లు వేస్తామని బెదిరిస్తున్నారు. అమెరికా డిమాండ్లకు తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ ద్వారాలు తెరిచింది. గతంలో భారత ఉత్పత్తులపై ఒకప్పుడు కేవలం 3 శాతం పన్ను ఉండేది. ఇప్పుడు అది 18 శాతానికి చేరింది. అమెరికా దిగుమతులను 46 బిలియన్ డాలర్ల నుంచి 100 బిలియన్ డాలర్లకు పెంచేశారు. భారత్కు ఈ ఒప్పందం ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు. డాలర్ను రక్షించుకునేందుకు ఈ ఒప్పందం దోహదపడుతోంది.'' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**రాహుల్ ప్రసంగంపై రగడ**

బడ్జెట్పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావన తీసుకురాగా.. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ గాంధీ వ్యాఖ్యలను రికార్డులను తొలగించాలని స్పీకర్ ఆదేశించారు. బడ్జెట్ గురించి మాత్రమే మాట్లాడాలని స్పీకర్ సూచించారు. పలుమార్లు రాహుల్ గాంధీ మాట్లాడేందుకు ప్రయత్నించగా.. అధికారపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. అమెరికాకు తలొగ్గి డేటాను, వ్యవసాయాన్ని, ఇంధన రంగాన్ని అమ్మకానికి పెట్టారంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యానించి తన ప్రసంగాన్ని ముగించారు.

# నరవణె పుస్తక వివాదం..
## పెంగ్విన్ సంస్థకు నోటీసులు




**ఢిల్లీ, ఫిబ్రవరి 11:** భారత సైన్య మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం రాజకీయంగా తీవ్ర వివాదాస్పదం అవుతోంది. ఈ నేపథ్యంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా కు ఢిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రచురణ సంస్థ యాజమాన్యం విచారణలో భాగం కావాలని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. అలాగే ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించిన పలు ప్రశ్నలను సంధించారు. వాటికి వివరణ అడిగారు. కాగా.. ప్రభుత్వ అనుమతి పొందక ముందే 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకం బయటకు రావడం వివాదమవుతోంది.
ఆ పుస్తకం ప్రచురితం కాలేదని, అది మార్కెట్లో అందుబాటులో లేదని పీఆర్హెచ్ఐ పేర్కొన్న సంగతి తెలిసిందే. అధికారికంగా విడుదల చేసి, రిటైల్ వేదికల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలనే ప్రచురితమైనవి పరిగణిస్తారని వెల్లడించింది. కానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మాత్రం ఆ బుక్ను మార్కెట్లో అమ్ముతున్నారని చెప్పారు. ఈ వ్యవహారంలో నేరపూరిత కుట్రకు సంబంధించిన సెక్షన్ల కింద పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

# కెనడా స్కూల్లో కాల్పులు
## 10 మంది మృతి
## 25 మందికి గాయాలు



**ఒట్టావా, ఫిబ్రవరి 11:** కెనడాలోని ఓ స్కూల్ కాల్పులు కలకలం రేపాయి. బ్రిటిష్ కొలంబియా రాష్ట్రం టుంబ్లెర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో ఓ దుండగుడు కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో ఇప్పటి వరకు 10 మంది ప్రాణాలు కోల్పోగా 25 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డట్లు తెలుస్తోంది. ఈ ఘాతుకానికి పాల్పడినట్లు భావిస్తున్న వ్యక్తి కూడా తనను తాను గాయపర్చుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు అధికారులు వెల్లడించారు.

స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఈ ఘటన చోటు చేసుకొంది. సమీపంలోని ఓ ఇంట్లో మరో ఇద్దరు వ్యక్తులు కూడా మృతి చెందినట్లు అధికారులు గుర్తించారు. వీరు కూడా స్కూల్లో జరిగిన కాల్పుల ఘటనతో ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని భావిస్తున్నారు. గాయపడిన వారు మరెక్కడైనా ఉన్నారేమోనని తెలుసుకోవడానికి పోలీసులు యత్నాలు మొదలుపెట్టారు. కాల్పుల ఘటనకు సమీపంలోని ఇళ్లల్లో భారీగా తనిఖీలు చేపట్టారు. ఇక షూటర్ను ఇప్పటికే దర్యాప్తు బృందాలు గుర్తుపట్టినా.. అతడి వివరాలను మాత్రం వెల్లడించలేదు.

# అవును.. ఎప్స్టీన్ ద్వీపాన్ని సందర్శించాను
## అమెరికా వాణిజ్య మంత్రి లుట్నిక్



**వాషింగ్టన్, ఫిబ్రవరి 11:** ప్రపంచ వ్యాప్తంగా ఎప్స్టీన్ సెక్స్ కుంభకోణం సెగలు పుట్టిస్తున్న వేళ.. అమెరికా వాణిజ్య మంత్రి హూవార్డ్ లుట్నిక్ అతడి ద్వీపాన్ని సందర్శించినట్లు అంగీకరించారు. తాజాగా అమెరికా కాంగ్రెస్ ఎదుట విచారణకు హాజరై వాంగ్మూలం ఇచ్చారు. తాను ఎప్స్టీన్తో కలిసి అతడి ప్రైవేటు ద్వీపంలో లంచ్ చేసినట్లు తెలిపారు. తాను ఎప్పుడో ఎప్స్టీన్తో గతంలోనే సంబంధాలు తెగదెంపులు చేసుకున్నట్లు ఆయన బుకాయించారు.

''నేను ఓ పడవలో ఫ్యామిలీ వెకేషన్కు వెళుతున్న సమయంలో.. అతడితో కలిసి భోజనం చేశాను. ఆ సమయంలో నా భార్య నాతోనే ఉంది. అంతేకాదు.. నా పిల్లలు, వారిని చూసుకునే ఆయాలు అక్కడే ఉన్నారు. ఓ గంటపాటు ద్వీపంలో ఉండి లంచ్ చేశాం. అది నిజం. కానీ, ఎందుకు అక్కడికి వెళ్లామో గుర్తులేదు'' అని లుట్నిక్ పేర్కొన్నారు. అంతేకాదు 14 ఏళ్ల వ్యవధిలో మూడు సార్లు అతడిని కలిసినట్లు.. 10 ఈ-మెయిల్ సంభాషణలు జరిగినట్లు కూడా అంగీకరించారు. ఇటీవల అమెరికా జస్టిస్ డిపార్ట్మెంట్ విడుదల చేసిన ఫైల్స్ ప్రకారం 2012 డిసెంబర్ 23న లుట్నిక్ ఎప్స్టీన్ ద్వీపం లిటిల్ సెయింట్ జేమ్స్ను సందర్శించినట్లు తెలుస్తోంది. ఆ రోజు ఉదయం లుట్నిక్ భార్య ఎప్స్టీన్ అసిస్టెంట్కు ఫోన్ చేసి తమ బోటు నిలిపేందుకు ఏర్పాట్లు చేయాలని కోరినట్లు ఈ-మెయిల్స్ ద్వారా వెల్లడైంది.

# ఎప్స్టీన్ను కలిశా..కానీ
## రాహుల్ ఆరోపణలపై కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ



**ఢిల్లీ, ఫిబ్రవరి 11:** కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేసిన 'ఎప్స్టీన్' ఆరోపణలను కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరీ తీవ్రంగా ఖండించారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ బృందంలో భాగంగా తాను ఎప్స్టీన్ను కలిశానని చెప్పారు. ''ఐపీఐలో మా బాస్కు ఎప్స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో మాత్రమే సమావేశమయ్యాను. కచ్చితంగా చెప్పాలంటే మూడునాలుగు సార్లు. ఒక్కసారి మాత్రమే ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు మా మధ్య జరిగిన సంభాషణకు ఎలాంటి సంబంధం లేదు'' అని వెల్లడించారు. ఇదంతా అసత్య ప్రచారమంటూ రాహుల్ వ్యాఖ్యలపై మండిపడ్డారు. బడ్జెట్పై ప్రసంగం సందర్భంగా కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ ఎప్స్టీన్ ఫైల్స్ గురించి ప్రస్తావించిన సంగతి తెలిసిందే. అప్పుడు అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్ సింగ్ పేర్లను ప్రస్తావించారు.

''ఈ రోజు విపక్షనేత పార్లమెంట్లో కొన్ని విషయాలు మాట్లాడారు. ఆయనకు నిరాధార ఆరోపణలు చేయడం అలవాటు. మన రాజకీయ వ్యవస్థలో రెండురకాల నేతలు ఉంటారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ.. సామాజిక సేవకే జీవితాన్ని అంకితం చేస్తుంటారు. మరికొందరు అప్పుడప్పుడు దేశానికి వస్తారు. వారికి పార్లమెంట్లో తగిన సమాధానం ఇచ్చినప్పుడు వినకుండా సభ నుంచి వాకౌట్ చేస్తుంటారు'' అని రాహుల్ తీరును విమర్శించారు.

అమెరికా ప్రభుత్వం ఇటీవల 30 లక్షల 'ఎప్స్టీన్' పేజీలను బయటపెట్టింది. వీటితోపాటు 2,000 వీడియోలు, 1,80,000 ఫొటోలనూ విడుదల చేసింది. ప్రజాసంఘాలు, రాజకీయంగా వచ్చిన ఒత్తిడి కారణంగా రూపొందించిన ఎప్స్టీన్ ఫైల్స్ ట్రాన్స్పరెన్సీ యాక్ట్ కింద వీటిని విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖులతో సంబంధాలు నెరిపిన ఎప్స్టీన్ 2019లో న్యూయార్క్ జైల్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మైనర్ బాలికలను అక్రమరవాణా చేశాడన్న ఆరోపణలపై విచారణ ఎదుర్కొన్నాడు. అతడి మాజీ గర్ల్ఫ్రెండ్ గిస్లైన్,మ్యాక్స్వెల్కు 2021లో 20 ఏళ్ల జైలు శిక్షపడింది

# భారత్ అభివృద్ధిని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోంది
## కేంద్రమంత్రి కిరణ్ రిజిజు



**ఢిల్లీ, ఫిబ్రవరి 11:** అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందువల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇరు దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మేలు కలిగించేలా ఉందనే ఆధారాలు చూపాలని రాహుల్కు సవాల్ విసిరారు. లోక్సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్లో లేకపోవడం దురదృష్టకరమన్నారు.

రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్ సింగ్పూరిపై లోక్సభలో తీవ్రమైన ఆరోపణలు చేశారని రిజిజు ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకు గానూ విపక్ష నేతపై సభ హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామన్నారు. లోక్సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పటికీ రాహుల్ తాను అడిగిన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని ఆయనకు తెలియదా అని ప్రశ్నించారు.

# వందే భారత్ ఛార్జీలు..
## చైనా, జపాన్ల కన్నా తక్కువే - రైల్వే మంత్రి



**ఢిల్లీ, ఫిబ్రవరి 11:** వందే భారత్ ఏసీ ఛైర్ కార్లలో ఛార్జీలు అందుబాటు ధరలోనే ఉన్నాయని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు. 300-400 కిలోమీటర్ల మధ్య ప్రయాణానికి కిలో మీటరుకు దాదాపు రూ.2.19 మాత్రమే ఛార్జీ వసూలు చేస్తున్నామని అన్నారు. చైనా, జపాన్, ఫ్రాన్స్ దేశాల్లోని ఇటువంటి సర్వీసుల టికెట్ ధర కంటే ఇది తక్కువేనని అన్నారు. ఆయా దేశాల్లో కిలోమీటరుకు రూ.7 నుంచి రూ.20 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు లోక్సభలో సభ్యుడు అడిగిన ప్రశ్నకు రైల్వే మంత్రి లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

పొరుగు దేశాల రైల్వేల్లో సాధారణ తరగతులతో పోలిస్తే మనదగ్గరే ఛార్జీలు తక్కువని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. భారత్లో కిలోమీటరుకు ఛార్జీ 20 పైసలుగా ఉండగా.. పాకిస్థాన్లో 54 పైసలు, బంగ్లాదేశ్లో 37 పైసలు, శ్రీలంకలో 51 పైసలుగా ఉందన్నారు. వివిధ వర్గాల ప్రయాణికుల సేవలకు టికెట్ ధరలను నిర్ణయించేటప్పుడు.. సేవలకు అయ్యే ఖర్చు, అందిస్తున్న సదుపాయాలు, ప్రయాణికుల స్తోమత, ఇతర రవాణా సదుపాయాల్లో ఉన్న ఛార్జీలు, సామాజిక-ఆర్థిక అంశాలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

2019 ఫిబ్రవరిలో వందే భారత్ సర్వీసులు ప్రారంభించామని, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 82 రూట్లలో 164 సర్వీసులు సేవలందిస్తున్నాయని చెప్పారు. ప్రయాణికుల సర్వీసు విభాగంలో ఈ రైళ్లు ఎంతో ప్రత్యేకమైనవన్నారు. సస్పెన్షన్ సిస్టమ్, వేగం, ఆటోమేటిక్ ప్లగ్ డోర్లు, సౌకర్యవంతమైన సీట్లు, మినీ ప్యాంట్రీ, సీసీటీవీలు, కవచ్ వంటి అత్యాధునిక వ్యవస్థలు ఈ రైళ్లలో ఉన్నాయన్నారు. ప్రయాణికుల స్తోమతను దృష్టిలో ఉంచుకొని ఈ రైళ్లలో ఛార్జీలను తక్కువగా ఉండేలా చూసుకున్నామని రైల్వే మంత్రి వెల్లడించారు.

# స్కూల్లో చొరబడిన సాయుధుడు..
## టీచర్లు, చిన్నారుల నిర్బంధం!



**బ్యాంకాక్, ఫిబ్రవరి 11:** థాయ్లాండ్ సాంగ్ఖ్లా ప్రావిన్సులో దారుణం చోటుచేసుకుంది. హాట్ యాయ్ జిల్లాలోని ఓ పాఠశాలలోకి చొరబడిన సాయుధ దుండగుడు.. కొంతమంది టీచర్లు, విద్యార్థులను బందీలుగా చేసుకున్నాడు. ఈ క్రమంలో వారిపై కాల్పులు జరపడంతో పాఠశాల డైరెక్టర్ సహా ముగ్గురు విద్యార్థులకు తీవ్రంగా గాయాలైనట్లు సమాచారం. రంగంలోకి దిగిన పోలీసులు.. ఈ ఘాతుకానికి పాల్పడిన 19 ఏళ్ల ఓ యువకుడిని అరెస్టు చేశారు. పాఠశాల లోపల ఉన్న విద్యార్థులు, ఉపాధ్యాయులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. బాన్ ఫ్రు ప్రాంతంలో ఓ యువకుడు మద్యం మత్తులో స్థానికులపై దాడి చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని వాహనంలోకి ఎక్కించారు. ఆ సమయంలో తన చేతిలో ఉన్న మారణాయుధంతో పోలీసులను బెదిరిస్తూ.. వారి వద్ద ఉన్న పిస్టల్ను తీసుకొని బైక్పై పారిపోయాడు. అనంతరం ఓ పాఠశాలలోకి చొరబడి.. కొందరు టీచర్లు, విద్యార్థులను సమావేశ మందిరంలో బంధించాడు. ఈ క్రమంలోనే పాఠశాల డైరెక్టర్ సహా పలువురు విద్యార్థులపై కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. ప్రత్యేక ఆపరేషన్ చేపట్టిన పోలీసులు.. దాదాపు రెండు గంటల పాటు శ్రమించి యువకుడిని అదుపులోకి తీసుకున్నారు.

## ఇండియన్ ఫోటోగ్రాఫర్కు చిక్కిన
# తొమ్మిది రంగుల అద్భుతం



**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** మగ హిమాలయ మోనాల్ విమానం మధ్యలో కనిపించింది. ఈ దృశ్యం భూటాన్ ఎత్తైన పర్వతాలపై ఆవిష్కృతమైంది. వీక్షకులు ఈ దృశ్యాన్ని ఉత్కంఠభరితంగా అభివర్ణించారు. ప్రకాశవంతమైన పర్వత సూర్యకాంతి కింద ఈ పక్షి మెరిసింది. చాలామంది దీనిని ఎగిరే ఆభరణంతో పోల్చారు. సహజ ఇంద్రధనస్సు రంగులతో హిమాలయ మోనాల్ అని పిలిచే నెమలి జాతి మగ పక్షి ఎగురుతూ ఫోటోలకు చిక్కింది. రంగులతో మెరిసిపోయే దేహం దీని ప్రత్యేకత. హిమాలయాల ఆభరణం అని పిలిచే ఈ పక్షి జాతి తేజస్సుకు ప్రసిద్ధి చెందింది. ఈ మేల్ హిమాలయ మోనాల్ విమానం మధ్యలో కనిపించిన దృశ్యం భూటాన్ ఎత్తైన పర్వతాలపై దర్శనమిచ్చింది. వీక్షకులు ఈ దృశ్యాన్ని ఉత్కంఠభరితంగా అభివర్ణించారు. ప్రకాశవంతమైన పర్వత సూర్యకాంతి కింద ఇది అద్భుతంగా మెరిసింది. దాని ఈకలు నీలం, ఆకుపచ్చ, ఊదా రంగులను, అటు బంగారం , నారింజ రంగులు ప్రకాశవంతంగా మెరుసి పోవడంతో చాలామంది దీనిని ఎగిరే ఆభరణంతో పోల్చారు. మెటాలిక్ కలర్స్ను మార్చుకుంటూ పచ్చ, రాగి షేడ్స్ తక్షణమే కనిపిస్తాయి. వెంటనే వైలెట్, ముదురు నీలంలోకి మారతాయి. ఒక విధంగా చెప్పాలంటే దీని ప్రతి కదలికతో దృశ్యం మారిపోయి, పూర్తిగా సహజమైన రంగులతో నిండుగా కనిపిస్తుంది.

# ఏఐ ప్లాన్కు సిద్ధంగా లేకపోతే.. స్వచ్ఛందంగా వెళ్లిపోవచ్చు
## ఉద్యోగులకు గూగుల్ 'మర్యాద పూర్వక' ఆఫర్




**హైదరాబాద్, ఫిబ్రవరి 11 :** ఏఐని అందిపుచ్చుకునే క్రమంలో పలు సంస్థలు సిబ్బంది సంఖ్యలో కోతపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ తన ఉద్యోగులకు ఒక ఆఫర్ ప్రకటించింది. కంపెనీ ఏఐ ప్రణాళికలకు సిద్ధంగా లేనివారు.. స్వచ్ఛందంగా పదవీవిరమణ చేయొచ్చని.. వారికి స్వచ్ఛంద నిష్క్రమణ ప్యాకేజీ ఆఫర్ను ప్రకటించింది. గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్(జీబీఓ)లోని కొందరు ఉద్యోగులకు ఈ ప్యాకేజీ వర్తించనుంది. గూగుల్లోని ఈ జీబీఓ యూనిట్.. సంస్థ ఉత్పత్తులు, సేవలకు సంబంధించిన ప్రకటనలు, గ్లోబల్ రెవెన్యూ గ్రోత్ (ప్రపంచవ్యాప్తంగా కంపెనీ ఆదాయం, అమ్మకాల)ను పర్యవేక్షిస్తోంది.

2025 ఏడాదికి గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ ఆదాయం 400 బిలియన్ డాలర్లు. 2026ను మెరుగ్గానే ఆరంభించినప్పటికీ.. ఏఐ పరిధి విస్తృతం అవుతోందని, దానిని అందిపుచ్చుకునేవారినే సంస్థ కోరుకుంటోందని షిండ్లర్ పేర్కొన్నారు. అమెరికాలోని కస్టమర్ సేల్స్ టీమ్స్, కస్టమర్ ఫేసింగ్ పొజిషన్స్ (నేరుగా కస్టమర్లతో సంప్రదింపులు జరిపే)కు ఈ ప్యాకేజీ వర్తించదని పేర్కొన్నారు. ఈ స్వచ్ఛంద నిష్క్రమణ అనేది గూగుల్ కే పరిమితం కాలేదు. ఇతర టెక్ సంస్థలు అమెజాన్, మెటా, మైక్రోసాఫ్ట్ ఇలాంటి ప్యాకేజీలను ప్రవేశపెట్టాయి. మైక్రోసాఫ్ట్ తన సీనియర్ ఎగ్జిక్యూటివ్లకు అల్టిమేటం ఇచ్చినట్లు కథనాలు వెలువడ్డాయి.

**రూ.2.9లక్షల కోట్లు సమీకరించిన గూగుల్..**

ఏఐ కార్యక్రమాలను విస్తృతం చేసే లక్ష్యంతో ముందుకువెళ్తోన్న గూగుల్కు మార్కెట్లో భారీ మద్దతు లభించింది. నిధుల సమీకరణ కోసం ఆల్ఫాబెట్ జారీ చేసిన బాండ్లు మార్కెట్లో అదరగొట్టాయి. దాంతో సంస్థ 24గంటల్లో రూ.2.9 లక్షల కోట్లను సమీకరించింది.

మనం Manam



# ఇద్దరి మధ్య.. రాజకీయ..ఢీ..!



## ఆనాడు తండ్రుల... నేడు తనయుల మధ్య పోటీ

**దశాబ్దాలుగా హోరాహోరి పోరు**

**పుర చైర్మన్ పీఠం కైవసానికి పాలక కాంగ్రెస్ ప్రతిపక్ష బి ఆర్ఎస్ నువ్వా నేనా**

**అశోక్ రెడ్డి రఘునందన్ రెడ్డిలపై పట్టణ ప్రముఖుల తీవ్ర చర్చ**





**తిరుమలగిరి, ఫిబ్రవరి 11 (మనం న్యూస్):** ఆనాడు తండ్రుల సమయంలో రాజకీయంగా ఇద్దరి మధ్య డి అంటే డి అనేవిధంగా ఇద్దరి మధ్య రాజకీయ పోరు ఉండేది.ఇపుడు తనయుల మధ్య పోటీ జరుగుతుంది. వాళ్ళే మూల అనంతరెడ్డి,సంకేపెళ్ళి పద్మనాభరెడ్డిలు. అనాడు ఒకరు సి పి ఐ నుండి మరొకరు కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ రాజకీయ పోరాటం చేశారు.వారి తరువాత ఇప్పుడు వాళ్ళ తనయులు మూల అశోక్ రెడ్డి,సంకేపెళ్ళి రఘునందన్ రెడ్డి ల మధ్య రాజకీయ పోరు సాగుతుంది. తిరుమలగిరి మున్సిపాలిటీ చైర్మన్ పదవి జనరల్ కావడంతో వీరిద్దరూ చైర్మన్ పదవి ఎలాగైనా కైవసం చేసుకోవాలని హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ఒకరు అధికార కాంగ్రెస్ పార్టీ నుండి మూల ఉదయశ్రీ అశోక్ రెడ్డి,ఒకరు సంకేపెళ్ళి రఘునందన్ రెడ్డి లు తిరుమలగిరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు పోటీ చేశారు. అధికార పార్టీ నుండి పోటీ చేసిన అశోక్ రెడ్డి భార్య ఉదయశ్రీ లు. తన భార్యను చైర్మన్ పీఠంపై కూర్చోబెట్టాలని తాపత్రయంతో 11వార్డునుండి బరిలో దింపారు. ఓటర్లు ఆకట్టుకోవడానికి విస్తృతంగా ప్రచార నిర్వహించారు. ఎమ్మెల్యే మందుల సామేలు, జిల్లా మంత్రి నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి లతో రోడ్డు ప్రచారం నిర్వహించారు. ఎలాగైనా గెలిచి చైర్మన్ పదవి దక్కించుకోవాలని ఉద్దేశంతో సంకేపెళ్ళి రఘునందన్ రెడ్డి 14 వ వార్డు పోటీలో నిలిచి గెలుపు కోసం ఓటర్లను ఆకట్టు కొనడానికి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ తో ర్యాలీతో ప్రచారం నిర్వహించి ఓటర్లను ఆకట్టుకోవడానికి విశ్వప్రయత్నం చేశారు. ఆనాడు మూల అనంతరెడ్డి సిపిఐ నుండి తిరుమలగిరి సర్పంచ్ గా పనిచేశారు. సంకేపల్లి పద్మనాభరెడ్డి సర్పంచ్, మార్కెట్ చైర్మన్, ఎంపీపీగా కాంగ్రెస్ పార్టీ నుండి పనిచేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రాౌరెడ్డి దామోదర్ రెడ్డి కి అత్యంత సన్నిహితుడుగా పద్మనాభరెడ్డి కొనసాగారు. తండ్రుల శకం ముగిశాక తనయులకు రాజకీయ ప్రత్యర్థులుగానే కొన్ని దశాబ్దాలుగా ఇప్పటివరకు కొనసాగుతూ వస్తున్నారు. మూల ఉదయ్ శ్రీ అశోక్ రెడ్డి తిరుమలగిరి గ్రామ సర్పంచిగా పనిచేశారు. అశోక్ రెడ్డి మార్కెట్ చైర్మన్గా పనిచేశారు. మారిన రాజకీయ సమీకరనాలలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న గాదరి కిషోర్ కుమార్ సమయంలో అశోక్ రెడ్డి, రఘునందన్ రెడ్డి లు ఒకే పార్టీలో కొనసాగారు. ఒకరు మార్కెట్ చైర్మన్ పదవి చేపట్టగా ఒకరు పార్టీ అధ్యక్ష పదవి చేపట్టి కొనసాగారు. ఇద్దరు ఒకే పార్టీలో ఉన్న ఎవరు వర్గం వారుగానే ఉండేవారు. రఘునందన్ రెడ్డి ఉపసర్పంచ్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్, మండలపరిషత్ వైస్ చైర్మన్ గా పనిచేశారు. ఇప్పుడు మళ్లీ వీరిద్దరి మధ్యనే మున్సిపాలిటీ ఎన్నికల్లో హోరా హోరీగా చైర్మన్ పదవి కోసం పోటీ జరుగుతుంది. కాంగ్రెస్ పార్టీ వార్డు కౌన్సిలర్ల ను ఎక్కువమందిని గెలిపించుకోవడానికి ఎవరికి వారుగా విశ్వ ప్రయత్నాలు చేశారు. ఏ ఒక్కరి ఓటును మిస్ కాకుండా వార్డు అభ్యర్థులు ఓట్లు వేయి ంచుకున్నారు. వీరిద్దరిలో ఎవరిని చైర్మన్ పదవి వరించనుందో ఓటర్లే నిర్ణయించనున్నారు. వీరి భవితవ్యం శుక్రవారం జరిగే ఓట్ల లెక్కింపులో తేలనుంది.

## కాంగ్రెస్ టిఆర్పి నాయకుల మధ్య ఘర్షణ



**సూర్యాపేట, ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి)ః** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం పోలింగ్ సందర్భంగా సూర్యాపేట పట్టణంలోని 13వ వార్డు పోలింగ్ బూత్ వద్ద తెలంగాణ రాజ్యాధికార పార్టీ. కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల నాయకుల మధ్య తీవ్ర ఘర్షణ దారి తీసింది. కాంగ్రెస్. బి ఆర్ఎస్. టి ఆర్ పి. నాయకులు గల్లాలు పట్టుకొని తోపులాటతో కొద్దిసేపు ఉద్రిత వాతావరణం నెలకొంది. పోలీసుల మూడు వర్గాలను చదరగొట్టి అక్కడినుండి పంపించి వేశారు. దీంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానయ్య యాదవ్. నాయకులు కార్యకర్తలతో జనగాం రోడ్ లోని లయోలా కాలేజీ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

### ఓటమి భయంతోనే దాడులు వట్టే జానయ్య

ఓడిపోతామని భయంతో కాంగ్రెస్ బిఆర్ఎస్ పార్టీల నాయకులు ఒకటై తెలంగాణ రాజ్యాధికార పార్టీ కార్యకర్తల నాయకులపై భౌతిక దాడులకు పాల్పడ్డారని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ అన్నారు. మూడు పోలింగ్ బూత్ లో కనీసం పార్టీలకు సంబంధం లేని వ్యక్తులు అక్కడ ఉన్నారని. ఈ ప్రాంతానికి సంబంధం లేని వ్యక్తులు వచ్చి తమకు ఓటు హక్కు ఉందని తెలిపి దొంగ ఓట్లు వేసేందుకు సిద్ధమయాలని దీనిని పసికట్టిన తమ పార్టీ శ్రేణులు ఇదేమని పోలీస్ సైతం అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని జానయ్య ఆరోపించారు. అలాగే ఓటు వినియోగించుకునేందుకు వచ్చిన తన కుమారుడిని స్థానిక పోలీసులు అత్యుత్సాహంతో గల్లా పట్టి నెటీ వేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు అధికార పార్టీకి తొత్తుల వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బహుజనులకు రాజ్యాధికారం దక్కుతుందని భయంతో ఇలాంటి దృశ్యాలను దిగుతున్నారని విమర్శించారు. వెంటనే దానికి సహకరించిన వారిపై కేసు నమోదు చేయాలని. లేకుంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీ పోరాటం కొనసాగిస్తుందని హెచ్చరించారు.



## తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై సమీక్షా సమావేశం

**తిరుపతి, ఫిబ్రవరి 11మనం న్యూస్:** తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, తుడా వైస్ చైర్మన్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు తో కలసి జిల్లా కలెక్టర్ డా, ఎస్. వెంకటేశ్వర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. బుధవారం సాయంత్రం తుడా సమావేశ మందిరంలో తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ తిరుపతి పరిధిలోని చెరువుల సుందరికరణ, తుడా టవర్స్, శెట్టిపల్లి అభివృద్ధి, జిల్లాలోని మాస్టర్ ప్లాన్ రోడ్డుల అభివృద్ధి గురించి సమీక్షించారు. జిల్లా కలెక్టర్ మట్కాడుతూ గౌ, రాష్ట్రముఖ్యమంత్రి ఆదేశాల మేరకు తిరుపతి పట్టణం లో గల 20 చెరువుల అభివృద్ధి చేసి సుందరికరణ చేయాలని అన్నారు. అందులో పేరూరు చెరువు నుండి అవిలాల చెరువు వరకు సమరు 5 కిమీ పైపు లైను వేసి అభివృద్ధి చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలి తెలిపారు. జిల్లా నందు పలు మాస్టర్ ప్లాన్ రోడ్డు లను, శెట్టిపల్లి అభివృద్ధి లో భాగంగా మాస్టర్ ప్లాన్ రోడ్డుల అభివృద్ధి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పట్టణ ప్రజలకు అందుబాటులో కి త్వరలో తుడా టవర్స్ నందు మొత్తం 12 అంతస్తులలో నిర్మాణం జరిగిందిన్నారు. కమర్షియల్ ప్లాట్లు అందులో 234 ప్లాట్లు ఉన్నాయని తెలిపారు. 2 బి హెచ్ కె,3 బి హెచ్ కె,4 బిహెచ్ కె లు ఉన్నాయన్నారు. టవర్స్ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇరిగేషన్ ఎస్ ఈ వెంకటేశ్వర ప్రసాద్,తుడా సెక్రటరీ శ్రీకాంత్ బాబు, తుడా ఎస్ఈ,కె. రవీంద్రయ్య, తుడా చీఫ్ ప్లానింగ్ అధికారి దేవి కుమారి, తుడా భూ సేకరణ అధికారి సుజన, ప్లానింగ్ అధికారులు,తుడా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఓడిపోతామని భయంతో కాంగ్రెస్ దాడులు



**తిరుమలగిరి, ఫిబ్రవరి 11 (మనంన్యూస్)ః** మున్సిపాలిటీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఓడిపోతవని భయంతో బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు నాయకుల పైన దాడులకు పాల్పడుతున్నారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ అన్నారు. బుధవారం తిరుమలగిరి మున్సిపాలిటీలోని ఏడవ వార్డులో తన సతీమణితో ఓటు వేయడానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కొందరు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పైన బెదిరింపులకు పాల్పడుతున్నారని ప్రజాస్వామ్యంలో ఎవరైనా ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవచ్చని చెప్పారు. దాడులకు పాల్పడుతున్న కాంగ్రెస్ కు ప్రజలు తగిన బుద్ధి చెప్తారని అన్నారు. ఆయన వెంట కల్లెట్ల పెళ్లి ఉప్పలయ్య, ఏడవ వాడు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి నాగయ్య, నాని, సన్నీ తదితరులు ఉన్నారు.

## పురపోరు.. ప్రశాంతం..!

- ముగిసిన మున్సిపల్ ఎన్నికలు
- జిల్లా వ్యాప్తంగా 79.90 శాతం పోలింగ్ నమోదు
- అక్కడ అక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా అంతా ప్రశాంతం
- భారీ బందోబస్తు నడుమ అర్ధరాత్రి వరకు బ్యాలెట్ బాక్సులు తరలింపు
- ఊపిరి పీల్చుకున్న పోలీస్ అధికార యంత్రాంగం



**సూర్యాపేట ఫిబ్రవరి 11 (మనం ప్రతినిధి)** జిల్లాలో ఉన్న ఐదు మున్సిపాలిటీల ఎన్నికలు అక్కడక్కడ చెదురు మదురు సంఘటనలు మినహా అంతా ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఉదయం 7 గంటల నుండి పోలింగ్ ప్రారంభ కావడంతో మొదటి రెండు గంటలు కొంతమంది గా సాగిన పది గంటల నుండి బూతుల వద్దా వారు తీరిన ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ బూత్ లో ఓటు వేసేందుకు చేరుకున్న ప్రతి ఒక్క ఓటర్లకు పూర్తిస్థాయిలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు.

### పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

సూర్యాపేట, హుజూర్నగర్, కోదాడ, తిరుమలగిరి, నేరేడుచర్ల మున్సిపాలిటీలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ వచ్చారు. ఇందులో భాగంగా బుధవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలో జడ్పి ఉన్నత పాఠశాల, ఆనంద్ విద్యా మందిర్ హై స్కూల్, జిల్లా పరిషత్



ఉన్నత పాఠశాల, తేజ్ హై స్కూల్, చుక్కారామయ్య హై స్కూల్, కుడకుడలోని ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి సందర్శించి ఏర్పాట్లు, ఓటింగ్ విధానాన్ని పరిశీలించారు. పోలింగ్ సిబ్బందికి అవసరమైన సూచనలు ఇచ్చి, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయ సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ను సందర్శించి వెబ్కాస్టింగ్ ప్రక్రియను పరిశీలించారు. పోలింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ఎలాంటి అంతరాయాలు లేకుండా కొనసాగుతున్నదని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. ఎన్నికలు స్వేచ్ఛా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. కలెక్టర్ తో పాటు. అదనపు కలెక్టర్ సీతారామారావు, తహసీల్దార్ కృష్ణయ్య, ఎన్నికల సిబ్బంది ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### ఐదు మున్సిపాలిటీల్లో పోలింగ్ నమోదు తీరు

సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ఐదు మున్సిపాలిటీలలో 1,75,754 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు ఇందులో భాగంగా సూర్యాపేట 79.38 శాతం హుజూర్నగర్ 82.88, కోదాడ77.05, నేరేడుచర్ల 79.24 తిరుమలగిరి 88.36. మొత్తం జిల్లా వ్యాప్తంగా 1,75,754 మంది. ఓటు హక్కు వినియోగించుకోగ .79. 90 శాతం పోలింగ్ నమోదు కావడం జరిగింది. ఇందులో మున్సిపాలిటీ వారిగా సూర్యాపేట 86. 403. నేరేడుచర్ల 10.893. తిరుమలగిరి 13.656. కోదాడ 23.926, హుజూర్నగర్ 40.881.. మంది ఓటర్లు బ్యాలెట్ బాక్స్ లో తమ తీర్పు నిక్షిప్తం చేశారు.

## అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు

- భద్రత, మౌలిక వసతుల కల్పన, ఇతర ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సమీక్ష



**విశాఖపట్టణం, ఫిబ్రవరి 11 ః** అప్పికొండ సోమేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 15వ తేదీన జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. బుధవారం ఉదయం తన ఛాంబర్లో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన ఆయన పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా భారీ సంఖ్యలో భక్తులు ఆలయానికి వచ్చే అవకాశం ఉన్నందున భద్రత, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, వైద్య సదుపాయాలు వంటి అన్ని మౌలిక వసతులను ముందుగానే సిద్ధం చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా క్యూలైన్లు సక్రమంగా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ప్రాంగణంలో పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విశాఖపట్టణం ఆర్డీవో సుధాసాగర్, డీఎంహెచ్వో జగదీశ్వరరావు, ఎండోమెంట్ అధికారులు, ఆలయ ఈవో పద్మావతి, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కళ్యాణానికి మండపం రెడీ



**మేళ్ల చెరువు, ఫిబ్రవరి 11(మనంన్యూస్)ః** ఈనెల 15 నుండి 19వ తేదీ వరకు మేళ్లచెరువులో జరిగే మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా, పలు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 15వ తేదీ అర్ధరాత్రి శివపార్వతుల కళ్యాణం నేపథ్యంలో ఆనవాయితీగా వచ్చే కళ్యాణ మండపానికి రంగులు దిద్ది కళ్యాణానికి సిద్ధం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు కూర్చుని స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించేందుకు ఎల్ఈడి స్క్రీన్లు, కుర్చీలు ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నాగేళ్ళ శంబిరెడ్డి తెలిపారు. శివపార్వతుల కళ్యాణానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని ఆయన కోరారు.

## కోటి విరాళం ఇచ్చి దాతృత్వం చాటుకున్న డాక్టర్ లమ్మత విశ్వనాథం

**టెక్కలి ఫిబ్రవరి 11 మనం న్యూస్ :** 1966 వ సంవత్సరంలో సంతబొమ్మాళి మండలం , దండుగోపాలపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల లో విద్యనభ్యసించిన ఎన్నారై డాక్టర్ లమ్మత విశ్వనాథం ఆడిటోరియం నిర్మాణానికి కోటి రూపాయలు విరాళం ఇచ్చి తన దాతృత్వం చాటుకున్నారు. బుధవారం ఉదయం శ్రీకాకుళం జిల్లా , టెక్కలి నియోజకవర్గం , సంతబొమ్మాళి మండలం , దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో 1966 వ సంవత్సరం పదివతరగతి పూర్వపు విద్యార్థుల కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లమ్మత విశ్వనాథ పాల్గొన్నారు. అమెరికాలో స్థిరపడిన డాక్టర్ లమ్మత విశ్వనాధపురం జీవిత గమనాన్ని జీవనయానం కాశీ పురంలో మొదలై అనే పేరున ఆత్మకథగా చింతాడ కృష్ణారావు రచించారు. రచయిత కూడా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దండుగోపాలపురం పూర్వ విద్యార్థి కావడం గమనార్హం. ఈ సందర్భంగా అప్పటి 1961 పదవ తరగతి బ్యాచ్ 18 మంది లో కొంతమంది పరమపదించగా మిగిలిన 13 మంది బుధవారం అపూర్వ కలయిక 60 సంవత్సరాల క్రితం జ్ఞాపకాలు నెమరు వేసుకుంటూ పాఠశాలకు విచ్చేసి ఈపుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ లమ్మత విశ్వనాధం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన వంతుగా ₹ఒక కోటి రూపాయలు విరాళాన్ని ఆడిటోరియం₹ నిర్మాణానికి వెచ్చించవలసిందిగా కోరుతూ ప్రకటించారు. దీని పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కమిటీ సభ్యులు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు కోత చిన్నబాబు, కార్యదర్శి కోత.మధుసూదనరావు, ధర్మారావు, సతీష్, వాసు మాస్టర్, ప్రదానోపాధ్యాయులు పిట్ట.గంగన్న ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లి ఉపాధ్యాయులు భాస్కరరావు, లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, శారదాంబ, అన్నాజీరావు, జె.శ్రీనివాసరావు, మురళీధర రాజు, రాము, సూర్య ప్రకాష్, ఉమ, శ్రీధరు, విజయలక్ష్మి, డి.శ్రీనివాసరావు, దయాసాగర్, శ్రీధర్, మార్కండేయులు, పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సినీ ఫక్కీలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా

- ట్రాక్టర్ ట్యాంకర్లో రూ. 1.65 కోట్ల విలువైన ఎర్రచందనం దుంగలు
- 72 ఎర్రచందనం దుంగలు స్వాధీనం




**తిరుపతి, ఫిబ్రవరి 11, మనం న్యూస్:** రెడ్ శాండల్ టాస్క్ ఫోర్సు హెడ్ ఎల్. సుబ్బారాయుడు సూచనలమేరకు ఎస్పీ పీ. శ్రీనివాస్, పర్యవేక్షణలో ఏఎస్పీ జే . కులశేఖర్ మార్గదర్శకములో టాస్క్ ఫోర్సు సిబ్బందికి అందిన సమాచారం మేరకు బుధవారం తెల్లవారు జామున అటవీ సిబ్బందితో కలసి అన్నమయ్య జిల్లా, టి. సుండుపల్లి మండలం పించా ప్రాజెక్ట్ సమీపానికి చేరుకున్న సమయానికి అక్కడ ఒక ట్రాక్టర్ నిలపబడి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. ఆ ట్రాక్టర్ దగ్గర కొంతమంది వ్యక్తులు ఎర్ర చందనం దుంగలు లోడ్ చేస్తూ ఉండగా అది గమనించిన టాస్క్ ఫోర్సు పోలీసులు వారిని వెంబడించి నలుగురిని పట్టు కొనగా మిగిలిన వారు పారిపోయారు. అంతట టాస్క్ ఫోర్సు పోలీసులు సదురు నేర స్థలం పరిశీలించి పట్టుబడిన నలుగురు వ్యక్తులు తెచ్చిన ట్రాక్టర్ మరియు ట్యాంకర్ తో పాటు అందులో దాచి ఉంచిన 72 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన నలుగురు ముద్దాయిలను విచారించగా అందులో ఇద్దరు తమిళనాడు రాష్ట్రం, వేలూరు జిల్లాకు చెందిన వారు మరియు ఇద్దరు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం, చిత్తూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించి ఈ కేసులో వారిని అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన స్మగ్లర్లను అరెస్టు చేయడానికి దర్యాప్తు కొనసాగుతోంది. మొత్తం పట్టుబడిన 72 ఎర్రచందం దుంగల విలువ సుమారు 1.65 కోట్లుగా ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన తిరుపతి టాస్క్ ఫోర్సు సిబ్బందిని టాస్క్ ఫోర్సు హెడ్ ఎల్. సుబ్బారాయుడు అభినందించి ఈ ఆపరేషన్ నందు పాల్గొన్న అధికారులు మరియు సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

## సర్వభూపాల వాహనంపై బకాసురవధ అలంకారంలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి

**తిరుపతి, ఫిబ్రవరి 11, మనం న్యూస్ః** శ్రీనివాస మంగాపురం శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో నాల్గవ రోజైన బుధవారం రాత్రి అనంత తేజోమూర్తి అయిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడు బకాసురవధ అలంకారంలో సర్వభూపాల వాహనంపై భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుండి 8 గంటల వరకు స్వామివారు నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వాహనం ముందు వృషభాలు, గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా



కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

### సర్వభూపాల వాహనం – యశోప్రాప్తి :

సర్వభూపాల అంటే అందరు రాజులు అని అర్థం. వీరిలో దిక్పాలకులు కూడా చేరతారు. తూర్పుదిక్కుకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణానికి యముడు, నైరుతికి నిరృతి, పశ్చిమానికి వరుణుడు, వాయవ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులుగా విరాజిల్లుతున్నారు. ఈ వాహనసేవలో టిటిడి జేఈవో వి.వీరబ్రహ్మం, సివిఎస్వో మురళికృష్ణ, జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆలయ ప్రత్యేకాధికారి డా.టి.రవి, ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్కుమార్, కంకణభట్టర్ బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునికుమార్, ధనశేఖర్, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీ కమిషనర్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు



**చేవెళ్ల, ఫిబ్రవరి 11 ( మనం న్యూస్) :** ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరుగుతుందని కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. ప్రజలు తమ ఓటు హక్కు వినయ్ చుకోవడం కోసం ఉత్సాహంగా పోలింగ్ కు వస్తున్నట్లు కమిషనర్ వెల్లడించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని 16, 17, 18 వార్డు లను డిసిపి యోగేష్ గౌతమ్, ఏసీపీ కిషన్ గౌడ్, సీఐ భూపాల్ శ్రీధర్లతో కలిసి పరిశీలించారు. మధ్యాహ్నం తర్వాత మహిళలు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికంగా వస్తారు. కాబట్టి వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రోడ్ల పైన కూడా ట్రాఫిక్ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సిబ్బంది ఏర్పాట్లు చేశారన్నారు. సమస్యాత్మక సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ లను గుర్తించడంతోపాటు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నట్లు వెల్లడించారు. సాయంత్రం ఐదు గంటల వరకు 80% వరకు పోలింగ్ నమోదు కావచ్చని కమిషనర్ పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రంలో 500 నుంచి 600 ఓటర్స్ ను కేటాయించడంతో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జనం క్యూ లైన్ లో లేకుండా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.చేవెళ్ల జోన్లో మూడు మున్సిపాలిటీలు ఉన్నాయని (చేవెళ్ల, శంకర్పల్లి, మొయినాబాద్) ఉన్నాయన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు ఓటర్లకు పలు సూచనలు చేశారు. పోలింగ్ తర్వాత బ్యాలెట్ బాక్స్ లను తరలింపు ఉంటుంది అన్నారు. ఎల్లుండి ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ఉంటుందని.. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు కూడా పూర్తి చేస్తామన్నారు. స్ట్రాంగ్ రూమ్స్ పరిశీలించడం జరిగిందని.. వార్డుల వారీగా బ్యాలెట్ బాక్స్ లకు త్రీ లేయర్స్ ఆఫ్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. కౌంటింగ్ కేంద్రం మొదటి గేటు వద్ద, ప్రధాన ద్వారం, బ్యాలెట్ బాక్స్ లకు భద్రత చర్యలు ఉన్నాయన్నారు. ఏఆర్ ఫోర్స్, సిఆర్ ఫోర్స్, లోకల్ లా అండర్స్ ఫైనల్ డే కౌంటింగ్ రోజు కూడా వెహికల్స్ ప్రాబ్లమ్స్ రాకుండా, పార్కింగ్ ప్లేస్ ట్రాఫిక్ సమస్య లేకుండా ఏర్పాటు చేశారు. కౌంటింగ్ అనంతరం కూడా విజయోత్సవ ర్యాలీలు తీయడానికి అనుమతులు తప్పనిసరి అని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందన్నారు.

# పోలింగ్ సరళిని వెబ్ ఐపి కెమెరాల ద్వారా వీక్షించిన సీపీ



**నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 11 ( మనం న్యూస్):** నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ , ఆర్మూర్, బోధన్, భీంగల్ పట్టణాల్లో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా పోలింగ్ సరళిని బుధవారం ఉదయం పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య పోలింగ్ బూతులలో పోలింగ్ సరళిని వెబ్ ఐపి కెమెరాల ద్వారా క్షుణ్ణంగా విక్షించారు. నిజామాబాద్ జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు నిజామాబాద్ నగరం, బోధన్ , ఆర్మూర్ , భీంగల్ ప్రాంతాలలో జరిగిన నేపథ్యంలో ఎన్నికల సరళని వెబ్ ఐపి కెమెరాల ద్వారా వీక్షించడానికి పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ హాల్ యందు 1203 వెబ్ ఐపి కెమెరాలను ఇంటర్నెట్ అనుసంధానంతో ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరు తూ.చా తప్పకుండా పాటించాలని, ప్రజలు ఎక్కడ కూడా గుమిగూడ కుండా తగు చర్యలు మరియు భద్రత ఏర్పాట్లను పటిష్టపరచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగింది. పోలింగ్ కేంద్రాల వద్ద ముందస్తు సమాచారం ఎలాంటిది తెలిసిన తమ పై అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకం



- బిజెపి యువ నాయకులు డా. వైభవ్ రెడ్డి

**చేవెళ్ల, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** ప్రజాస్వామ్యాన్ని బలపరిచేది ప్రజల తీర్పే, ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించాలి అని డా. వైభవ్ రెడ్డి పేర్కొన్నారు. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 10వ వార్డు రామన్నగూడా లో ఆయన సతీమణి డా. వృషా రెడ్డితో కలిసి పోలింగ్ కేంద్రానికి చేరుకుని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములయ్యారు. ఎన్నికలు ప్రజల ఆశయాలను ప్రతిబింబించే వేదికగా నిలుస్తాయని, బాధ్యతాయుతంగా తీర్పు ఇవ్వడం ప్రతి పౌరుడి కర్తవ్యమన్నారు.

# గ్రామ సభలో పాలకవర్గం పై కొందరు ప్రతిపక్ష నాయకుల దాడి





**రుద్రూర్, ఫిబ్రవరి 11 ( మనం న్యూస్) :** రుద్రూర్ మండలంలోని రాయకూర్ గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సభలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు హాజరయ్యారు. గ్రామ సభకు వచ్చిన వారు కింద కూర్చోవాలి కానీ కొందరు ప్రతిపక్ష నాయకులు మేము కింద కూర్చోమని కుర్చీలోనె కూర్చుంటామని గ్రామ సభలో గందరగోళం సృష్టించి, దూషించుకుంటూ పాలకవర్గంపై దాడికి పాల్పడ్డారని, ఈ దాడిలో కొందరికి గాయాలయ్యాయని పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. కొందరు ప్రతిపక్ష నాయకులు గ్రామసభకు వచ్చి గ్రామ సభను రసవత్తరంగా చేయుటకు పూనుకున్నారని తెలిపారు. అనంతరం దాడి చేసిన వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

# బీజేపీ మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుంది

- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్



**నిజామాబాద్, ఫిబ్రవరి 11 ( మనం బ్యూరో ):** బీజేపీ మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. నిజామాబాద్ పట్టణంలోని సన్ ఫవర్ హైస్కూల్లో టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ., నిజామాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరబోతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. పుట్టిన గడ్డపై రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవడం గర్వంగా ఉందని అన్నారు. రాజ్యాంగం కల్పించిన వరం ఓటు హక్కు అని పేర్కొంటూ, ప్రతి ఒక్కరు తప్పకుండా ఓటు వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటింగ్ శాతం పెరిగితే ప్రజలకు సేవ చేసే, క్వాలిటీ ఉన్న నాయకులు ఎన్నికవుతారని తెలిపారు. నిత్యం ప్రజల్లో ఉండే నాయకుడే గెలవాలని తన ఆకాంక్ష అని చెప్పారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ మతం పేరుతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నిజామాబాద్ ప్రజలు అభివృద్ధికి పట్టం కడతారని ఆశాభావం వ్యక్తం చేసారు.

# వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల సరళిని పరిశీలించిన కలెక్టర్



**ములుగు ఫిబ్రవరి 11, మనం ప్రతినిధిః** ములుగు కొత్త మున్సిపాలిటీ ఎన్నికల సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ దివాకర టి.ఎస్. బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలో వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ములుగు జిల్లా మున్సిపాలిటీ కి మొదటి సారిగా ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పోలింగ్ ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, వెబ్ కాస్టింగ్ ద్వారా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) సంపత్ రావు, ఈ డి ఎం దేవేందర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్ 'వికసిత్ భారత్' దిశగా ముందడుగు

- కాకినాడ పోర్టు నిర్మాణానికి కేంద్రం సహకరించాలి
- లోక్ సభ లో బడ్జెట్ పై జరిగిన చర్చలో ప్రసంగించిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

**కాకినాడ,ఫిబ్రవరి 11:** 2026-27 ఆర్థిక సంవత్సరానికి ఇటీవల పార్లమెంటులో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ వికసిత్ భారత్ దిశగా ముందడుగు అని కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ అభివర్ణించారు. బుధవారం లోక్ సభ లో కేంద్ర బడ్జెట్ పై జరిగిన చర్చలో భాగంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడారు. వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించడానికి కేంద్ర బడ్జెట్ కీలక మార్గదర్శకంగా నిలుస్తుందని, ఈ బడ్జెట్ దేశ భవిష్యత్తు అభివృద్ధికి దిశానిర్దేశం చేసే వ్యూహాత్మక ప్రణాళికన్నారు. బడ్జెట్లో పోర్టులు, షిప్పింగ్ శాఖకు కేటాయింపులు 3,470 కోట్ల నుండి 5,164 కోట్లకు పెంచడం అభినందనీయమని, రూ. 1000 కోట్లతో ఏర్పాటుచేసిన మారిటైం డెవలప్మెంట్ ఫండ్ ద్వారా తీర ప్రాంతాల్లో షిప్ బిల్డింగ్, పోర్ట్ ల ఆధునికరణకు మరింత బలాన్ని చేకూరుస్తుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపరిచేందుకు బడ్జెట్లో స్కిల్ డెవలప్మెంట్ శాఖ కు 62 శాతం కేటాయింపులు పెంచడం హర్షణీయమన్నారు. వీధి వ్యాపారులకు రుణాలు అందించే 'పీఎం స్వానిధి' పథకానికి బడ్జెట్లో కేటాయింపులు 373 కోట్ల నుండి 900 కోట్లకు పెంచడం ద్వారా మరింతమంది చిరు వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. ఈ పథకం ద్వారా కాకినాడ జిల్లాలో సుమారు 33,000 మందికిపైగా వీధి వ్యాపారులకు రుణాలు మంజూరయ్యాయి అని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ లో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామీణ రహదారులకు మహర్దశ పట్టిందన్నారు. ఏపీలో కుఖ్ఖి-ఐఐఐ ద్వారా రికార్డు స్థాయిలో 3,200 కి. మీ పైగా రహదారులు, 77 వంతెనల నిర్మాణానికి అనుమతి లభించిందని, ఏపీ లో రహదారుల నిర్మాణానికి మరిన్ని నిధులు కేటాయించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కేంద్రాన్ని అభ్యర్థించారు. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక కృషితో కాకినాడ గేట్ వే పోర్టు నిర్మాణం 33 శాతం పూర్తవ్వగా, ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కాకినాడ పోర్టు పూర్తయితే మరో 16ఖ్కీఅ సామర్థ్యం పెరుగుతుందన్నారు, అలాగే షిప్ బిల్డింగ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్ స్కీం, మారి టైం డెవలప్మెంట్ ఫండ్ వంటి కేంద్ర పథకాల ద్వారా కాకినాడలో పోర్ట్ మరియు షిప్ బిల్డింగ్ యూనిట్ కు ఏర్పాటుకు సహకరించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సామాన్యుడి ఆశలను ప్రతిబింబేలా, అభివృద్ధి చివరి వ్యక్తికి చేరేలా వ్యూహాత్మక ప్రణాళికతో రూపొందించిన కేంద్ర బడ్జెట్ కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే వరకు ఉద్యమం



**చేవెళ్ల, ఫిబ్రవరి 11(మనం న్యూస్):** చేవెళ్ల అడ్వకేట్ స్వప్న ఘటనపై న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష ఈ రోజు ఎనిమిదో రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమంలో చేవెళ్ల బార్ అసోసియేషన్కు చెందిన న్యాయవాదులు పాల్గొన్నారు. న్యాయవాదుల భద్రత కోసం ప్రత్యేక అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వెంటనే అమలు చేయాలని కోరారు. కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి తక్షణ పోలీసు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ వచ్చే వరకు ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పి.మధుసూదన్ రెడ్డి, వి. బాలస్వామి, ఎన్. చంద్రశేఖర్, బి. సురేష్, ఈ. జనార్ధన్, బి. విటల్, డి. శ్రీనివాస్, సిహెచ్. రవీందర్, బి. మల్లేష్, డి.గోపాల్, ఏ. ప్రభాకర్ రెడ్డి, ఈ. రవీందర్, కే. సుదర్శన్, కే.కుమార్, ఎం. శివరాజ్, వి.సాయిరాం, బి. ఆనంద్, అభిలాష్, ఎం.మహేష్, శ్రావణ్, ఎం. పూజిత, లోకేశ్వరి దేవి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# సామాన్య భక్తులకు పెద్దపీట

- ఆర్డీఓ విశ్వనాద్



**మహానంది, ఫిబ్రవరి11,మనంన్యూస్:** మహాశివరాత్రి బ్రహ్మో త్సవాల సందర్భంగా విచ్చేసే సామాన్య భక్తులకు పెద్దపీట వేయనున్నట్లు ఆర్డీఓ విశ్వనాద్ తెలిపారు. బుధవారం మహానంది లోని పోచాబ్రహ్మానంద రెడ్డి విశ్రాంతి భవనంలో మహానంది దేవస్థానం ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో రెండవ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ఆర్డీఓ తో పాటు నంద్యాల మున్సిపల్ కమిషనర్ సెషన్న, ఐ పి ఎస్ అధికారి, డిఎస్పీ మంద జావళి లతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్బంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉత్సవాల సందర్బంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.డి ఎస్ పి జావళి మాట్లాడుతూ వంద మంది పోలీస్ సిబ్బందితో ఉత్సవాలలో ఎలాంటి ఇబ్బందులు జరగకుండా నిఘా వుంచుతామని తెలిపారు.మున్సిపల్ కమిషనర్ శేషన్న మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్య పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈఓ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ క్షేత్రానికి వచ్చే బక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్బంగా మహానంది క్షేత్రానికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశామన్నారు. క్యూ లైన్ లలో భక్తులకు మంచినీరు, బిస్కెట్లు, పాలు అందిస్తామని తెలిపారు. వృద్ధులకు, వికలాంగులకు ప్రత్యేక దర్శనం కల్పిస్తామని తెలిపారు. అలాగే ఉచిత ప్రసాదం అందజేస్తామన్నారు. ఆర్డీఓ ఆదేశాల ప్రకారం లింగోద్ భవ సమయంలో ముందస్తుగా నిర్ణయించిన వారిని మాత్రమే అనుమతినిస్తామని తెలిపారు. విఐపి దర్శనాలు రద్దు చేస్తామని తెలిపారు. భక్తులకోసం ఆలయ పరిసర ప్రాంతాలలో వివిధరకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకుని ప్రసాదాలను అందజేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ ఈఓ మధు, తహశీల్దార్ రమాదేవి, ఎంపిడిఓ మహమ్మద్ దౌలా,ఇంటిలిజెన్స్ డి ఎస్ పి వెంకటేశ్వర్లు, రూరల్ సి ఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ ఐ రామ్మోహన్ రెడ్డి, విద్యుత్ శాఖ ఏ ఈ ప్రభాకర్ రెడ్డి, డి ఆర్ ఓ హైమావతి,సూపర్డెన్స్ శశిధర్ రెడ్డి, నిలఖంటేశ్వర రాజు, సుబ్బారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నంద్యాలకు బయలుదేరిన ఉత్సవా మూర్తులు



**మహానంది, ఫిబ్రవరి11,మనంన్యూస్:** మహాశివరాత్రి బ్రహ్మో త్సవాల సందర్బంగా నంద్యాలలో కొలువు తీరిన బ్రహ్మానందీశ్వర స్వామివారిని ఆహ్వానించేందుకు బుధవారం శ్రీకామేశ్వరీ దేవి సమేత మహానందీశ్వర స్వామివార్ల ఉత్సవ విగ్రహాలు బయలుదేరాయి. ఈ నెల 13నుండి బ్రహ్మో ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో స్వామి అమ్మవార్ల కల్యాణానికి పెళ్ళిపెద్దగా ఆహ్వానించేందుకు వెళ్లినట్లు వేదపండితులు రవిశంకర్ అవధాని తెలిపారు.ఈఓ శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసిన పల్లకిలో ఆశీనులుగా చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు,సూపర్డెన్స్ సుబ్బారెడ్డి, నిలకంటేశ్వర రాజు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మల్లయ్య,తదితరులు పాల్గొన్నారు.

# దేవాలయానికి విరాళం అందజేసిన మాజీ టీటీడీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు



**కౌతాళం, ఫిబ్రవరి 11 మనం న్యూస్ :** దేవాలయానికి విరాళం అందజేసిన టీటీడీ మాజి ట్రస్ట్ బోర్డు సభ్యులు అయినా వై.సీతారామ రెడ్డి మండల కేంద్రమైన కౌతాళంలో శివప్ప నగర్ లో ఎరుకల కుల దైవమైన కోరువ అంజమ్మ దేవి దేవాలయానికి కౌతాళం మండల వైఎస్ఆర్సిపి మండల కన్వీనర్ దేశాయి ప్రహ్లాద ఆచారి సహకారంతో మరియు తిరుమల తిరుపతి దేవస్థాన మాజీ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు వై.సీతారామ రెడ్డి వెంటనే 25 వేల రూపాయలు విరాళంగా ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాల్ దినకర్, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి,ఉపసర్పంచ్ సక్రి తిక్కయ్య, హై స్కూల్ మాజీ చైర్మన్ వడ్డే రామ,మండల నాయకులకు సత్యప్ప స్వామి, రాజనగర్ క్యాంప్ వెంకటరామరాజు, వార్డ్ మెంబర్ రామకృష్ణ,సమ్మద్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ అరెస్ట్ - సైబర్ క్రైమ్‌పై ఉక్కు పాదం

**విశాఖపట్నం మనం ఉత్తరాంధ్ర ప్రాంతీయ ప్రత్యేక ప్రతినిధిః** డిజిటల్ అరెస్ట్ మోసం వృద్ధుడికి ముంబై పోలీస్ అని ఫోన్ చేసి, తనపై మనీ లాండరింగ్ కేసు రిజిస్టర్ అయినది అని బెదిరించి, మోసం చేసి 66 లక్షలు దోచుకున్న కేసు లో ఒక ముఠా సభ్యుడుని విశాఖపట్నం సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు. అరెస్ట్ చేశారు కేసు వివరాల్లోకి వెళితే విశాఖపట్నం జిల్లాకు చెందిన ఒక రిటైర్డ్ ఉద్యోగికి ఒక అపరిచిత వ్యక్తీ వాట్సాప్ కాల్ చేసి డిపాజిటర్స్ ప్రొటెక్షన్ బోర్డ్, ముంబై ప్రెసిడెంట్ పరిచయం చేసుకుని, నీపై కొలాబా పోలీస్ స్టేషన్, ముంబై లో మనీ లాండరింగ్ కేసు రిజిస్టర్ అయినది చెప్పి, ఆ సంబంధిత అధికారికి కాల్ బదిలీ చేస్తానని, ఆ కాల్ను మహారాష్ట్ర పోలీస్ డిఐజి వికాస్ శర్మ అని చెప్పుకున్న మరొక వ్యక్తికి బదిలీ చేశారు. అతను సదరు బాదితుడు పేరు మీద కెనరా బ్యాంకులో ఒక ఖాతా తెరిచానని, ఆ ఖాతా ద్వారా కోట్లాది రూపాయల మనీ లాండరింగ్ జరిగిందని, దీనికి సంబంధించి గౌరవ సుప్రీం కోర్ట్ అరెస్ట్ వారెంట్ జారీ చేసిందని బెదిరించి, దర్యాప్తులో భాగముగా భాదితున్ని ఎవరితోనూ మాట్లాడవద్దని, ఒంటరిగా ఉంటూ నిరంతరం వీడియో కాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించి, 05 రోజుల పాటు తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేశారు. అనంతరం భాదితున్ని బెదిరించి 66 లక్షలు వారి యొక్క మ్యూల్ బ్యాంకు అకౌంట్స్ లోకి ట్రాన్స్ఫర్ చేయించుకొని మోసగించారు.హెచ్చరిక సిటీ నగర ప్రజలకు సైబర్ క్రైమ్ పోలీసు వారి సమాచారం తస్మాత్ జాగ్రత్త ప్రజలేవరు తెలియని ఫోన్ నెంబర్ నుండి ఫోన్ వచ్చి డిజిటల్ అరెస్ట్ లో మీ పేరు మీద కొరియర్ బుక్అయ్యింది అని చెబితే నమ్మవద్దు.అలానే ఆ పార్సెల్ లో చట్టవిరుద్ధ వస్తువులు, మాదక ద్రవ్యాలు ఉన్నాయి, మిమ్మల్ని ఆన్లైన్ లో ఇన్వెస్టిగేషన్ చేయాలి స్కైప్ వాట్సాప్ లేదా ఇతర మాధ్యమాలలో వీడియో కాల్ చేయమని చెబితే చేయవద్దు..మీ ఎకౌంటు లో మని లాందేరింగ్ జరుగుతుంది, ఆర్బిఐ తో వెరిఫై చేయాలి అని చెప్పి మీ అమౌంట్ నుండి వారి ఎకౌంటు కు డబ్బులు ట్రాన్స్ఫర్ చేయమని చెబితే చేయవద్దు.ఏదైనా మోసానికి గురైతే 1930 కికాల్ చేసి ఫిర్యాదు చేయండి.ఏదైనా మోసానికి గురైతే 1930 కి కాల్ చేసి ఫిర్యాదు చేయండి, విశాఖపట్నం సిపి గారి ప్రత్యేక నంబర్ 7995095799 కుసమాచారం ఇవ్వండనీ పోలీసులు కోరారు.

# ప్రముఖ పండితుల మధ్య శ్రీ మన్ న్యాయసుధ పరీక్షలు



**మంత్రాలయం , ఫిబ్రవరి 11,మనం న్యూస్:** ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో సంస్కృత ప్రముఖ పండితుల మధ్య శ్రీ మన్ న్యాయసుధ గ్రంథం పై విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. బుధవారం స్థానిక శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో 7వ బ్యాచ్ కి చెందిన శ్రీమాన్యాయసుధ గ్రంథం పై విద్యార్థుల పరీక్ష ప్రారంభమయ్యాయి. శ్రీ రాఘవేంద్రస్వామి మఠం నిర్వహణలో ఉన్న శ్రీ గురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠంలోని విద్యార్థులకు పోటీ పరీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్వారా దీప ప్రజ్వలనతో పరీక్షను లాంఛనంగా ప్రారంభించారు. పీఠాధిపతులు శ్రీ సుబుధేంద్ర తీర్థులతో పాటు కర్ణాటక రాష్ట్రంలోని శ్రీ వ్యాసరాజ మఠం పీఠాధిపతులుశ్రీ విద్యాశ్రీశ తీర్థ స్వామీజీ సమక్షంలో విద్యార్థులు చిచోలి శ్రీ వత్స, శ్రీనిధి, కె సుబోధ దేశాయ్ అచ్యుత, బాలసుబ్రహ్మణ్యం, సుధన్వ కె. సుతేజ, హెచ్. హర్షవర్ధన్ లకు పరీక్షలు నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి పండితులు హాజరయ్యారు.

# కుంభమహోత్సవంలో పాల్గొన్న టీడీపీ నాయకులు



**కౌతాళం, ఫిబ్రవరి 11 మనం న్యూస్:** బుధవారం రోజున కౌతాళం మండలం దమ్ములదిన్నె గ్రామంలో ఘనంగా మరికంబాదేవి కుంభమహోత్సవం కార్యక్రమంలో ఆ గ్రామ తెదేపా కుటుంబ సభ్యులు ఆహ్వానం మేరకు పాల్గొని ఆలయం నందు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండి రైతన్నలు సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర అభివృద్ధి సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కొనసాగాలని కోరాడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఈరన్న స్వామి మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ శివ మోహన్ రెడ్డి,చెన్న బసప్ప,కొట్రేష్ గౌడ్,రమేష్ గౌడ్,వెంకట్ రెడ్డి,కురుగోడు,సిద్దు మొదలగు తెదేపా కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది.

## మమితా బైజు కొత్త సినిమా.. నిర్మాతగా మారిన స్టార్ హీరో

నటి మమితా బైజు క్రేజ్ ఇప్పుడు మామూలుగా లేదు. పదహారేళ్ల ప్రాయంలోనే నటిగా చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ గత ఎనిమిదేళ్లగా మలయాళం, తమిళ భాషల్లో వరుస అవకాశాలను అందుకుంటూ సక్సెస్ రేట్ ను పెంచుకుంటూ పోతున్నారు. తాజాగా సూర్యకు జంటగా నటిస్తున్న చిత్రంతో తెలుగు ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. తను నటించిన మలయాళం చిత్రం ప్రేమలు మాలీవుడ్ లోనే కాకుండా కోలీవుడ్, టాలీవుడ్ ల్లోనూ అనువాదమై మంచి విజయాన్ని అందుకుంది. ఆ తరువాత రెబల్ చిత్రంతో జివీ.ప్రకాష్ కుమార్ కు జంటగా కోలీవుడ్ కు పరిచయమైన బ్యూటీ ఆ చిత్రం ఆశించిన విజయాన్ని సాధించకపోయినా, ప్రదీప్ రంగనాథన్ కు జంటగా నటించిన డ్యూడ్ చిత్రం తమిళం, తెలుగు భాషల్లో మంచి విజయాన్ని అందుకుంది. తాజాగా విజయ్ కథానాయకుడుగా నటించిన జననాయకన్ చిత్రంలోనూ మమితా బైజు కీ రోల్ చేశారు. కాగా ప్రస్తుతం ధనుష్ సరసన నటిస్తున్న కారా చిత్రాన్ని కూడా పూర్తి చేశారు. అదేవిధంగా బెత్లెహేమ్ కుడుంబ అనే మలయాళం చిత్రంలోని నటిస్తూ బిజీగా ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దర్శక, నటుడు ప్రదీప్ రంగనాథన్ తాజా చిత్రంలో నటించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తాజా సమాచారం.

అయితే ఈ చిత్రంలో ఆయనకు జంటగా కాకుండా ఆయన నిర్మించనున్న చిత్రంలో మమితా బైజు నాయకిగా నటించడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది. చాలామంది నటుల మాదిరిగానే ప్రదీప్ రంగనాథన్ కూడా నిర్మాతగా మారిపోతున్నారు. ఈ చిత్రానికి ఆయన అసోసియేట్ డైరెక్టర్ ను దర్శకుడిగా పరిచయం చేయబోతున్నట్లు సమాచారం. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన పూర్తి వివరాలుతో త్వరలో వెలువడే అవకాశం ఉంది.





## టీ20 ప్రపంచ కప్.. ఐర్లాండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం



టీ20 ప్రపంచ కప్ 2026లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. ఐర్లాండ్తో జరిగిన తమ తొలి మ్యాచ్ లో 67 పరుగుల తేడాతో ఆసీస్ ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. లక్ష్యఛేదనలో ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే ఆలౌటైంది. జార్జ్ డాక్రెల్ (41; 29 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్ లు) టాప్ స్కోరర్. లోర్కాన్ టక్కర్ (24), రాస్ అడైర్ (12), మార్క్ అడైర్ (12) పరుగులు చేశారు. ఆస్ట్రేలియా బౌలర్లలో నాథన్ ఎల్లిస్ 4, ఆడమ్ జంపా 4, కునెమన్ ఒక వికెట్ పడగొట్టారు.

టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆసీస్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. మార్కస్ స్టొయినిస్ (45; 29 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), జోష్ ఇంగ్లిస్ (37; 17 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), రెన్ షా (37; 33 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. దూకుడుగా ఆడిన కామెరూన్ గ్రీన్ (21; 11 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్స్ లు) ఎక్కువసేపు క్రీజులో నిలవలేదు. ట్రావిస్ హెడ్ (6), గ్లెన్ మ్యాక్స్ వెల్ (9) విఫలమయ్యారు. కూపర్ కొన్నోలీ (11₹), బార్ట్ లెట్ (11₹) పరుగులు చేశారు. ఐర్లాండ్ బౌలర్లలో మార్క్ అడైర్ 2, మాథ్యూ హంఫ్రీస్, జార్జ్ డాక్రెల్, హ్యారీ టెక్టర్ తలో వికెట్ తీశారు.



## చరిత్రలో ఇప్పటివరకు జరిగిన 'డబుల్ సూపర్ ఓవర్' సమరాలు ఇవే..!

టీ20 ప్రపంచకప్ 2026లో ఇవాళ (ఫిబ్రవరి 11) ఓ చరిత్రాత్మక ఘట్టం చోటు చేసుకుంది. ప్రపంచకప్ చరిత్రలోనే తొలిసారి ఓ మ్యాచ్ డబుల్ సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. ఈ మ్యాచ్ లో గెలుపు కోసం సౌతాఫ్రికా, ఆఫ్ఘనిస్తాన్ కొదమ సింహాల్లా పోరాడాయి.

రెగ్యులర్ మ్యాచ్ లో ఇరు జట్ల స్కోర్లు సమం కావడంతో సూపర్ ఓవర్కు దారి తీసింది. సూపర్ ఓవర్ లోనూ స్కోర్లు సమం కావడంతో రెండో సూపర్ ఓవర్ అనివార్యమైంది. ఇక్కడ కూడా గెలుపు కోసం ఇరు జట్లు చివరి బంతి వరకు వేచి చూశాయి.

అంతిమంగా సౌతాఫ్రికా చివరి బంతికి (రెండో సూపర్ ఓవర్) గెలుపు ఖరారు చేసుకొని విజేతగా నిలిచింది. ఒకవేళ ఈ సూపర్ ఓవర్ లో కూడా స్కోర్లు సమమై ఉంటే, మ్యాచ్ మూడో సూపర్ కు కూడా వెళ్లేది.

## 'స్వయంభు' టీజర్‌తో నిఖిల్ సిద్ధార్థ్ సంచలనం!

యంగ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ లీడ్ రోల్ లో నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా చిత్రం 'స్వయంభు' ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ హైప్ క్రియేట్ చేసింది. ఈ చిత్రాన్ని భరత్ కృష్ణమాచారి డైరెక్ట్ చేస్తుండగా భారీ బడ్జెట్ తో ఈ సినిమాను విజువల్ వండర్ గా రూపొందిస్తున్నారు. ఇక ఈ సినిమా నుండి తాజాగా టీజర్ ను రిలీజ్ చేశారు మేకర్స్. 'స్వయంభు' టీజర్ ఆద్యంతం స్టన్నింగ్ విజువల్స్ తో అదిరిపోయే విధంగా కట్ చేశారు. భారీ యాక్షన్ సీక్వెన్స్ లు ఈ సినిమాను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్లనున్నట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతోంది. ఇక జానపద కథాంశంగా తెరకెక్కిన ఈ సినిమాలో నిఖిల్ తన బెస్ట్ పెర్ఫార్మెన్స్ ను ఇవ్వనున్నాడు. అదిరిపోయే వార్ ఎపిసోడ్స్, ఆకట్టుకునే గ్రాఫిక్స్ తో ఈ సినిమా ప్రేక్షకులకు అదిరిపోయే ట్రీట్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ టీజర్ లో కొన్ని ఇంట్రెస్టింగ్ డైలాగులు కూడా ఆకట్టుకుంటున్నాయి. కేవలం హీరో మాత్రమే కాకుండా మిగతా నటీనటులు కూడా ప్రాధాన్యం ఉన్న పాత్రలు చేస్తున్నారు. వారి నుంచి కూడా కొన్ని డైలాగులు రావడం విశేషం.



సంయుక్త మీనన్, నభా నటేష్, సుబ్బరాజు తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ క్యాస్టింగ్ తో ఈ సినిమా ప్రేక్షకులను థ్రిల్ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. ఇక రవి బస్రూర్ అందించిన స్టన్నింగ్ మ్యూజిక్ ఈ సినిమాకు మేజర్ అసెట్ గా నిలవబోతుంది. సెంథిల్ కుమార్ సినిమాటోగ్రఫీ ఈ సినిమాను గ్రాండియర్ గా చూపెట్టనుంది. ఈ సినిమాను ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ సంయుక్తంగా ప్రొడ్యూస్ చేస్తున్నారు.

## 'ఉస్తాద్ భగత్ సింగ్' సెకండ్ సింగిల్.. సెలబ్రేషన్ మోడ్‌లో హరీష్ శంకర్, దేవిశ్రీ, చంద్రబోస్



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ అభిమానులకు 2026 మార్చి నెల ఎంతో స్పెషల్ కానుంది. హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న మాస్ యాక్షన్ డ్రామా 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రపంచవ్యాప్తంగా మార్చి 26న థియేటర్లలో సందడి చేయనుంది. 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత వీరిద్దరి కాంబినేషన్ లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.

సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో చిత్ర యూనిట్ ప్రమోషన్లను వేగవంతం చేస్తోంది. ఇందులో భాగంగా ఆస్కార్ విజేత చంద్రబోస్ సాహిత్యం అందించిన, దేవి శ్రీ ప్రసాద్ స్వరపరిచిన రెండో సాంగ్ ను విడుదల చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. 'ఆరా ఆఫ్ ఉస్తాద్' పేరుతో రానున్న ఈ పాట హై-ఎనర్జీతో సాగుతుందని చిత్ర బృందం పేర్కొంది. దీనికి సంబంధించి హరీష్ శంకర్, చంద్రబోస్ కలిసి దేవిశ్రీని ఎత్తుకున్న ఫోటో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో పవన్ కళ్యాణ్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాపై ఉన్న క్రేజ్ దృష్ట్యా, రాబోయే రోజుల్లో మరిన్ని అప్డేట్స్ ఇచ్చేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

## రష్మిక బాటలో రుక్మిణి..

కన్నడ భామలకు టాలీవుడ్ లో ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. రష్మిక మందన్న ఇక్కడ స్టార్ గా ఎదిగి, నేషనల్ క్రష్ గా పేరు తెచ్చుకోవడంలో తెలుగు ఇండస్ట్రీలో కీలక పాత్ర పోషించింది. అయితే, మాతృభాష కంటే తెలుగు సినిమాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తోందన్న నెపంతో కన్నడ ప్రేక్షకులు ఆమెను సామాజిక మాధ్యమాల్లో తరచూ టార్గెట్ చేస్తూనే ఉంటారు. ఈ ప్రతికూలతలను ఎదుర్కొంటూనే రష్మిక తన కెరీర్ ను విజయవంతంగా మలుచుకుంది. ఇప్పుడు అదే బాటలో రుక్మిణి వసంత్ కూడా కనిపిస్తోంది. 'సప్త సాగరాలు దాటి' సినిమాతో పాపులర్ అయిన రుక్మిణి, ప్రస్తుతం ఎన్టీఆర్-ప్రశాంత్ నీల్ సినిమాలో ఛాన్స్ కొట్టేసి అందరి దృష్టిని ఆకర్షించింది. మరోవైపు 'కాంతార చాప్టర్ 1'తో కన్నడలోనూ స్టార్ హోదాను దక్కించుకుంది. తెలుగులో ఆమెకు పెరుగుతున్న డిమాండ్ చూస్తుంటే, త్వరలోనే ఆమె టాలీవుడ్ లో టాప్ లీగ్ హీరోయిన్ గా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

టాలీవుడ్ ప్రస్తుతం గ్లోబల్ మార్కెట్ ను శాసిస్తుండటంతో, ఇక్కడ గుర్తింపు వస్తే బాలీవుడ్ ఆఫర్లు కూడా సులువుగా వస్తాయి. ఈ క్రమంలో రుక్మిణి కూడా రష్మికలాగే తెలుగు సినిమాలకే మొగ్గు చూపుతుందా లేక కన్నడ చిత్రాలను బ్యాలెన్స్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ ఆమె కూడా కన్నడను విస్మరిస్తే, అక్కడి ప్రేక్షకుల నుండి విమర్శలు తప్పవని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.



## డాన్స్‌లో సెన్సేషన్.. చదువులో గ్రాడ్యుయేషన్

టాలీవుడ్ సెన్సేషన్ శ్రీలీల తన అందంతో పాటు అభినయం, డ్యాన్స్ స్టెప్పులతో తనకంటూ ఓ ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేసుకుంది. అయితే, ఆమె ఇప్పుడు తన జీవితంలో ఒక అద్భుతమైన మైలురాయిని చేరుకుంది. వెండితెరపై వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే, మరోవైపు తాను చదువుకుంటున్న మెడిసిన్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి ఆఆఖి పట్టా అందుకుంది.

సినిమా షూటింగులు, డ్యాన్స్ ప్రాక్టీస్ వంటి బిజీ షెడ్యూల్స్ మధ్య కూడా చదువును ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆమె డాక్టర్ గా పట్టా పొందడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారింది. దీనికి సంబంధించిన ఆమె గ్రాడ్యుయేషన్ ఫోటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

శ్రీలీల డాక్టర్ పట్టా అందుకోవడంతో ఆమె అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సినిమాల్లో బిజీగా ఉంటూ కూడా ఆమె డాక్టర్ పూర్తి చేయడం నిజంగా అభినందనీయం అంటూ వారు కామెంట్స్ చేస్తున్నారు.

## 'పెద్ది' రెండో సాంగ్ ఆలస్యం? ఫ్యాన్స్‌కి నిరాశేనా!?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా కాంబినేషన్ లో తెరకెక్కిస్తున్న భారీ చిత్రమే పెద్ది. మల్టీ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్ చరణ్ ఇంటెన్స్ రోల్ చేస్తున్నాడు. ఇక ఈ సినిమా నుంచి ఆల్రెడీ వచ్చిన మొదటి పాట చికిరి చికిరి 250 మిలియన్ కి పైగా వ్యూస్ ని సొంతం చేసుకొని బిగ్గెస్ట్ చార్ట్ బస్టర్ అయ్యింది. ఇక ఈ సాంగ్ తర్వాత రెండో సాంగ్ ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి రీసెంట్ గా మేకర్స్ చిన్న హింట్స్ ఇస్తూ వస్తున్నారు. అయితే ఈ వాలెంటైన్స్ డే కానుకగా రెండో పాట రావచ్చు అనే బజ్ వినిపించింది కానీ లేటెస్ట్ గా మాత్రం ఈ రెండో సాంగ్ మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. సో ఇది నిజం అయితే ఫ్యాన్స్ కి మరింత నిరాశ తప్పదని అనుకోవాలి. మరి దీనిపై అధికారిక క్లారిటీ ఏమన్నా వస్తుందేమో చూడాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. అలాగే వృద్ధి సినిమాస్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



## రూల్ ఏదైనా.. నేషనల్ లెవెల్లో మోగుతున్న బన్నీ నామ స్మరణ!

మన టాలీవుడ్ సినిమా నుంచి పాన్ ఇండియా లెవెల్లో బాక్సాఫీస్ ని రూల్ చేసే రేంజ్ కి ఎదిగిన హీరోస్ లో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్కూడా ఒకరు. మరి ఎలాంటి రాజమౌళి బ్రాండ్ లేకుండా బన్నీ తనకున్న పాన్ ఇండియా క్రేజ్ ని తానే టెస్ట్ చేసుకొని మరీ పుష్ప 2 తో ప్రూవ్ చేసుకోవడం జరిగింది.

అయితే బన్నీ విషయంలో చాలానే తతంగం ఎప్పుడూ ఏదొక రకంగా నడుస్తూనే ఉంటుంది. అలా లేటెస్ట్ గా తన 42 రూల్స్ అంటూ ఓ పెద్ద లిస్ట్ తో సోషల్ మీడియా నిన్నటి నుంచి ఊగిపోతోంది. అయితే అలాంటివి ఏమి లేవని బన్నీ టీం క్లారిటీ ఇవ్వడం, ఇంకా అనేకమంది తన సహా నటులు కూడా చెప్పడం జరిగింది.

కానీ ఇక్క మ్యాటర్ ఏదైనప్పటికీ మాత్రం ప్రస్తుతం నేషనల్ లెవెల్లో మాత్రం అల్లు అర్జున్ నామ స్మరణ ఒక్కటే ఎక్కువగా వినిపిస్తుంది అని చెప్పి తీరాలి. కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా నేషనల్ మీడియాలలో సైతం బన్నీ కోసమే చర్చ నడుస్తుంది. మరి ఇదంతా ఎక్కడ వరకు వెళ్లి ఆగుతుందో చూడాలి మరి.



Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.